www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 మంగళవారం

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి। 03, డిసెంబర్ 2024

సంపుటి: 6 సంచిక: 184, పేజీలు: 12, వెల: రూ.5/-



## ఆలూరు లారీ ప్రమాద ఘటనలో నలుగురు దుర్మరణం

- రోడ్డు ప్రక్కన కూరగాయలు అమ్ముతున్న రైతులపై దూసుకొచ్చిన లారీ
- ప్రమాద ఘటనలోనే పలువురు మృత్యువాత
- ప్రమాద సంఘటనపై సీఎం ఆరా
- ప్రభుత్వం ఆదుకుంటుందని సీఎం భరోసా
- బాధితులకు వైద్య సహాయం అందించండి:సీఎం ఆదేశం

(రాపర్తి భాస్కర్ గౌడ్)

వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 2:
రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు స్టేజ్ వద్ద కూరగాయలు అమ్ముకునే వారిపైకి లారీ దూసుకెళ్లిన ఘటనపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సీఎం సంతాపం తెలియజేశారు. మిగతా..3లో




## మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచండి

- పోలీసులకు హైకోర్టు కీలక ఆదేశాలు
- ఏటూరునాగారం ఎన్‌కౌంటర్‌పై పూర్తయిన విచారణ

హైదరాబాద్,డిసెంబర్ 2(వెలుతురు):
ఏటూరు నాగారంలో మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని పౌరహక్కుల సంఘం తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. భోజనంలో మత్తుపదార్థాలు కలిపి మావోయిస్టులను కస్టడీలోకి తీసుకున్నారని, చిత్రహింసలకు గురిచేసి కాల్చిచంపారని న్యాయస్థానానికి తెలిపారు. మావోయిస్టుల మృతదేహాలపై తీవ్ర గాయాలు ఉన్నాయని న్యాయవాది కోర్టులో వాదించారు. కనీసం వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు చూపించకుండా పోస్టుమార్టం చేశారన్నారు. ఎన్?హెచ్?ఆర్సీ నిబంధనలకు విరుద్ధంగా మావోయిస్టుల పట్ల పోలీసులు వ్యవహరించారని హైకోర్టుకు తెలిపారు. అనంతరం ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదిస్తూ, పోలీసులు భద్రత దృష్ట్యా మృతదేహాలను ఆసుపత్రికి తరలించామని కోర్టుకు తెలిపారు. కేఎంసీ వైద్య నిపుణుల ఆధ్వర్యంలోనే పోస్టుమార్టం నిర్వహించారని స్పష్టం చేశారు. పోస్టుమార్టం ప్రక్రియను మొత్తం వీడియో తీశారని పేర్కొన్నారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచాలని పోలీసులకు ఆదేశాలిచ్చింది. అలాగే మృతదేహాలను కుటుంబ సభ్యులకు, మిగతా..2లో



## సరికొత్తగా తెలంగాణ తల్లి విగ్రహం

- తెలంగాణ పల్లె తనం ఉట్టిపడేలా రూపకల్పన
- హైదరాబాద్ నగర శివార్లలలో సిద్ధమౌతోన్న విగ్రహం
- అత్యంత గోప్యంగా డిజైన్ తయారు

హైదరాబాద్,డిసెంబర్2(వెలుతురు):
తెలంగాణ సచివాలయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతిష్టించబోతున్న తెలంగాణ తల్లి విగ్రహం హైదరాబాద్ నగర శివార్లలలో రేడి అవుతోంది. దీన్ని అత్యంత గోప్యంగా డిజైన్ చేపిస్తోంది..పెద్ద అంబర్ పేట గండి చేరువు దగ్గరలోని ఓ శిల్పి దీన్ని తయారు చేస్తున్నారు.. తెలంగాణ సచివాలయం ముందు దీని కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిగతా..2లో





## పది నెలల్లోనే అద్భుతాలు జరుగుతాయా?

- తెలంగాణ సమాజమే మా కుటుంబం
- ప్రభుత్వంపై విషప్రచారాన్ని తిప్పికొట్టండి
- మా తలరాతలు మార్చిన ప్రజాప్రభుత్వం
- మీరే ఈ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలి!
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- ఆరోగ్య ఉత్సవాలకు శ్రీకారం
- అంబులెన్సులు ప్రారంభించిన సీఎం
- సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా ఇందిరమ్మ పాలన
- దిగ్విజయంగా సాగుతున్న గృహజ్యోతి పథకం
- ప్రజాప్రభుత్వం సంకల్పం సత్ఫలితాలిస్తోంది
- హైదరాబాద్‌లో 10 లక్షలకు పైగా కుటుంబాలకు లబ్ధి
- గృహజ్యోతి పథకంపై సీఎం రేవంత్ ట్వీట్

హైదరాబాద్,డిసెంబర్2(వెలుతురు):
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలే అవుతోందని, ఈ పది నెలల్లోనే అద్భుతాలు జరుగుతాయా? అయినా ఈ కాలంలో మనం చేయాల్సింది చేశామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై జరుగుతోన్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మీరు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీదే అన్నారు. ఈ ప్రభుత్వం కష్టం మీద వచ్చిందని చెప్పడం లేదని, కానీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయించడం ద్వారా మా తలరాతను మార్చి పెద్ద బాధ్యతలు ఇచ్చారని, కాబట్టి విషప్రచారాన్ని కూడా తిప్పికొట్టే బాధ్యత మీదే అన్నారు. నల్లచట్టాలు తెచ్చిన మోదీ, వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్ ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆరోగ్య ఉత్సవాలు నిర్వహించారు. మిగతా..2లో

## రాజ్యాంగంపై చర్చకు పార్లమెంట్ రెడీ..!

- ఫ్లోర్ లీడర్లతో లోక్‌సభ స్పీకర్ సమావేశం
- నేటి నుంచి యథావిధిగా పార్లమెంటు సమావేశాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 2(వెలుతురు):
పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటికీ విపక్షాల ఆందోళనలతో ఉభయ సభల కార్యకలాపాలకు అంతరాయం కలుగుతోంది. పలు అంశాలపై చర్చ జరపాలన్న విషయంపై



కేంద్రం, విపక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు ఎట్టకేలకు తెర పడింది. ముఖ్యంగా రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో ఈ నెల 13, 14వ తేదీల్లో లోక్‌సభలో, 16, 17వ తేదీల్లో రాజ్యసభలో చర్చించేందుకు మిగతా..2లో




## 'ప్రగతి'తో పరుగులు

- మౌలిక సదుపాయాల కల్పన వేగంగా అమలవుతోంది
- 'ప్రగతి ప్లాట్ ఫామ్ దేశవ్యాప్తంగా 340 ప్రాజెక్ట్‌ల వేగవంతం
- సైద్ బిజినెస్ స్కూల్, గేట్స్ ఫౌండేషన్ వెల్లడి
- ప్రధాని మోడీ పనితీరుపై ఆక్స్‌ఫర్డ్ ప్రశంసలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 2(వెలుతురు):
ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డిజిటల్ గవర్నెన్స్ ప్లాట్‌ఫారమ్ ప్రో-యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్లీ ఇంప్లిమెంటేషన్ ద్వారా మౌలిక సదుపాయాల కల్పన వేగంగా అమలవుతోందని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, గేట్స్ ఫౌండేషన్ అధ్యయనాల్లో వెల్లడైంది. 'ప్రగతి ప్లాట్ ఫామ్ దేశవ్యాప్తంగా 340 ప్రాజెక్ట్‌లను వేగవంతం చేసింది. దీని విలువ సుమారు 205 బిలియన్ల డాలర్లు. 'ఇది కీలకమైన మిగతా..2లో

## ఆరోగ్య ఉత్సవాలకు శ్రీకారం

- అంబులెన్సులు ప్రారంభించిన సిం

హైదరాబాద్,డిసెంబర్2(వెలుతురు):
ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆరోగ్య ఉత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో 108, 102 వాహనాలకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. 108 సర్వీసుల కోసం 136 అంబులెన్సులు, 102 సర్వీసుల కోసం 77 అంబులెన్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను ఇతర మంత్రులు, నేతలతో కలిసి సీఎం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో 28 పారామెడికల్, 16 నర్సింగ్ కాలేజీలను సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. 33 ట్రాన్స్‌జెండర్ల క్లీనిక్‌లను ప్రారంభించడంతో పాటు 442 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, 24మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు నియామక పత్రాలు అందజేశారు. మైత్రి ట్రాన్స్ క్లీనిక్‌లు ప్రతి గురువారం సేవలందించనున్నాయి. కొత్తగా ప్రారంభించిన వాటితో కలిపి రాష్ట్రంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల సంఖ్య 37కి పెరిగింది.





## జైలు నుంచి విడుదలైన మరుసటి రోజే మంత్రి పదవా?!

- మంత్రి హెూదాలో ఉంటే సాక్షుల్లో ఆందోళన నెలకొనదా?
- సెంథిల్ బాలాజీ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ, డిసెంబర్ 2(వెలుతురు):
క్యాష్ ఫర్ జాబ్ స్కాంలో బెయిల్ పొందిన తమిళనాడు నేత సెంథిల్ బాలాజీకి... జైలు నుంచి విడుదలైన మరుసటి రోజే మంత్రి పదవి లభించడంపై సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. మేం బెయిల్ ఇచ్చాం... మిగతా..2లో

## ప్రజలకు ఏం ఒరగబెట్టారని సంబరాలు..?

### కాంగ్రెస్ పాలనపై మండిపడ్డ కాసం

వెలుతురు, హైదరాబాద్, డిసెంబర్ 2:
బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు మాట్లాడారు,తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు కాంగ్రెస్ పార్టీ కారణంగా విపరీత పోకడలకు దారి తీస్తున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ తో పాటు పీసీసీ చీఫ్, మంత్రులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నరని కాసం మండిపడ్డారు,

డిసెంబరు7తో కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తికావొస్తుంది. అయితే, ప్రజలకు ఏమీ చేయలేదనే అసహనం వారినుంచి బయటపడుతోం దన్నారు, అసలు తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఏం ఒరగబెట్టారని సంవత్సర పరిపాలన సంబురాలు చేసుకుంటున్నట్లు...?గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు మిగల్చిందని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి.. సంబురాల పేరిట కోట్లాది రూపాయల ప్రజల సొమ్ముతో




అడ్వర్టైజ్ మెంట్లతో ప్రచారం చేసుకుంటున్నది తప్ప

రేవంత్...! అసలు తెలంగాణ ఉద్యమంలో నీ పాత్ర ఏంటి..? జై తెలంగాణ అని ఏనాడైనా ఉద్యమించినవా..?

తెలంగాణ ఉద్యమకారులపై దాడి చేసింది రేవంత్ రెడ్డి.. ఉద్యమకారులపై, ప్రజలపై తుపాకీ ఎక్కుపెట్టింది నువ్వు. తెలంగాణ ఉద్యమ సమయంలో మిగతా..3లో

## పట్టుదల, దృఢ సంకల్పం ఉంటే లక్ష్యాన్ని సాధించవచ్చు...

- పద్మశాలీల అభ్యున్నతికి పూర్తి సహకారం అందిస్తా.. !
- పోటీ పరీక్షల కోసం త్వరలోనే బీసీ స్టడీ సెంటర్ ఏర్పాటు ..
- ఉద్యోగాలు సాధించిన వారు సమాజ సేవకు పాటుపడాలి..
- సర్కారు కొలువులు సాధించిన 40 మందికి సన్మానించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ వెలుతురు డిసెంబర్ 02:
సర్కారు ఉద్యోగాల సాధన వెనక కఠోర శ్రమ దాగి ఉంటుందని, లక్ష్యసాధన కోసం దృఢ సంకల్పం పట్టుదలతో ముందుకు సాగాలని ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ శాంతినగర్ పద్మశాలి సంఘ భవనంలో ప్రభుత్వ కొలువులు సాధించిన 40 మంది యువతీ యువకులకు పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో (పోప) ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల నుండి విద్యార్థులు పేదరికం, సామాజిక ఆటుపోట్లను ఎదుర్కొని




పట్టుదలతో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. తాను కూడా పేదరికంతో అనేక ఇబ్బందులు పడ్డానని, మూడు సార్లు ఎన్నికల్లో ఓటమి చవిచూసినా వెనుతిరిగి చూడకుండా ముందుకు వెళ్లడం వల్లే ఎమ్మెల్యే స్థాయికి ఎదిగానని అన్నారు. పద్మశాలీల తో నాకు ఎనలేని అనుబంధం ఉందని, వారి కుటుంబ ఆర్థిక సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. మిగతా..2లో

# సరికొత్తగా తెలంగాణ తల్లి విగ్రహం

**మొదటిపేజీ తరువాయి..**

భూమి పూజ చేశారు. డిసెంబర్ 9 న ఆవిష్కరించడానికి రేడి అవుతున్నారు.. దీనిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు సీఎం ఈ ఏడాది ఫిబ్రవరి 4న కేబిటనేట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రభుత్వం చేసిన ప్రకటన. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కొత్తగా రూపొందిస్తున్న తెలంగాణ తల్లి విగ్రహంపై స్పెషల్ గా ఫోకస్ చేస్తుంది సర్కార్.. దీని కోసం స్వయంగా శిల్పులతో రేవంత్ సమావేశాలు నిర్వహించారు. దాని తర్వాత డిజైన్ ను ఫైనల్ చేశారు.. సగటు తెలంగాణ మహిళ రూపంలో తెలంగాణ తల్లి ఉండనున్నట్లుగా విగ్రహనికి సంబంధించి అన్ని భాధ్యతలు చూస్తున్న వెల్లడించారు. తెలంగాణ వ్యవసాయం, బతుకమ్మ, శ్రమ జీవనం, పోరాటం, ఇలా అన్ని సందేశాలు ఇచ్చే విధంగా తెలంగాణ తల్లి విగ్రహన్ని రూపోందిస్తున్నట్లు తెలిపారు. దీని కోసం ఇప్పటికే సీఎం రెండు మూడు సార్లు ఏవరికీ చేప్పకుండా విగ్రహం తయారు చేస్తున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. ఇక తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయబోయే ప్రదేశంలో పెద్ద ఫౌంటైన్‌ను, రాత్రికాగానే లేజర్ ఫౌంటైన్ ను ఏర్పాటు చేయనున్నారు. దీన్ని ట్యాంక్ బండ్ పైకి, ఎన్టీఆర్ మార్గ్ లోకి వచ్చే సందర్శకులకు సైతం అనుమతి ఇవ్వనున్నారు.. ఇప్పుడు పెట్టబోయే విగ్రహం కోసం సాదరణ సందర్శకుల కోసం ప్రత్యేక గేటును కూడ ఏర్పాటు చేయనున్నారు. అయితే.. ప్రస్తుతం సర్కార్ ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తుంది.. డిసెంబర్ 9వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి..డిసెంబరు 9వ తేదీన కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా.. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. సోనియా గాంధీ జన్మదినంతో పాటు ప్రజా పాలన ఏడాది విజయోత్సవాలను ఘనంగా నిర్వహించేలా రేవంత్ రెడ్డి సర్కార్ ప్లాన్ చేసింది.

# 'ప్రగతి'తో పరుగులు

**మొదటిపేజీ తరువాయి..**

మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల రూపకల్పన విషయంలో రెడ్ టేప్ బ్యూరోక్రసీని తగ్గించడానికి వీలు కల్పించింది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 44 ప్రగతి సమావేశాలు నిర్వహించి మొత్తం రూ.18.12 లక్షల కోట్లతో 355 ప్రాజెక్టులపై సమీక్షించారు 'అని డిసెంబర్ 2 న విడుదల చేసిన అధ్యయనంలో వెల్లడించాయి. కాగా తాజా సమావేశంలో రోడ్డు కనెక్టివిటీకి సంబంధించి రెండు, రెండు రైలు, బొగ్గు, విద్యుత్, జలవనరుల రంగాల్లో ఒక్కో ప్రాజెక్టుతో సహా ఏడు ప్రాజెక్టులపై సమీక్ష జరిగింది. ఈ ప్రాజెక్టుల వ్యయం మొత్తం రూ.76,500 కోట్లకు పైగానే. ఈ ప్రాజెక్టులు 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించినవి. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, జార?ండ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, ఒడిశా, గోవా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీలో ఈ ప్రాజెక్టులు ఉన్నాయి. 340 ప్రాజెక్టులలో చాలా వరకు మూడు నుండి 20 సంవత్సరాల వరకు గడువు ముగిసినట్లు కేస్ స్టడీ పేర్కొంది. ప్రగతి ప్లాట్ ఫామ్ లో ప్రాజెక్ట్ పర్యవేక్షణ కోసం డిజిటల్ డ్యాష్‌బోర్డ్ ఉంది. ఇది దశాబ్దాల నుండి నెలల వరకు ఆలస్యాన్ని తగ్గించడంలో సహాయపడింది. 2015లో ప్రారంభించబడిన ప్రగతి ప్లాట్‌ఫారమ్ ప్రజల ఫిర్యాదులను పరిష్కరిస్తుంది, అలాగే ముఖ్యమైన కేంద్ర కార్యక్రమాలను అలాగే రాష్ట్రాలు ఫ్లాగ్ చేసిన ప్రాజెక్టులను పర్యవేక్షిస్తుంది. వాటిని సమీక్షిస్తుంది. అలాగే కేస్ స్టడీ కొన్ని ప్రాజెక్ట్‌లను హైలైట్ చేస్తుంది. జమ్మూ కాశ్మీర్‌లోని చీనాబ్ వంతెన, ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైలు వంతెన, అస్సాంలోని బ్రహ్మపుత్రపై బోగీబీల్ వంతెన, 2018లో పూర్తయింది. జల్ జీవన్ మిషన్, భారతదేశంలోని ప్రతి గ్రామీణ గృహానికి ఇండోర్ ట్యాప్ వాటర్ కనెక్షన్‌లను అందించే కార్యక్రమం. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, రాష్ట్ర స్థాయి అమలు చేసే ఏజెన్సీల మధ్య మెరుగైన సమన్వయాన్ని సులభతరం చేయడం ద్వారా ప్రగతి సమీక్షలు ఈ చొరవపై పురోగతిని వేగవంతం చేయడంలో సహాయపడ్డాయి. "ఉదాహరణకు 2021లో జరిగిన ఒక సమీక్ష, ఆరు నెలల వ్యవధిలో నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో కొత్త కుళాయి కనెక్షన్‌ల రేటులో 20 శాతం పెరుగుదలకు దారితీసింది' అని అధ్యయనం తెలిపింది. '2019లో, మొత్తం భారతీయ కుటుంబాలలో కేవలం 17 శాతం మాత్రమే నీటి సరఫరాను కలిగి ఉన్నాయిబీ నవంబర్ 2024 నాటికి, 79 శాతం మంది ఉన్నారు' అని ఈ అధ్యయనాల్లో తేలింది.

## రాజ్యాంగంపై చర్చకు
# పార్లమెంట్ రెడీ..!

**మొదటిపేజీ తరువాయి..**

తేదీలు ఖరారు చేసినట్లు పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. మంగళవారం నుంచి ఉభయసభలు సజావుగా సాగేలా విపక్షాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.పార్లమెంట్‌లో అదానీ వ్యవహారం, మణిపుర్ పరిస్థితి, సంభాల్ ఘటన వంటి అంశాలపై చర్చ జరపాలని విపక్షాల డిమాండ్ చేశాయి. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో విపక్షాలు లేవనెత్తిన పలు అంశాలను చర్చించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం వల్ల కేంద్రం, విపక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడింది. ముఖ్యంగా లోక్‌సభలో సంభాల్ అంశం, బంగ్లాదేశ్ పరిస్థితులపై చర్చించేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. . ఈ సమావేశంపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. పార్లమెంటు ప్రతిష్టంభనపై కేంద్రం, విపక్షాలు ఏకాభిప్రాయానికి వచ్చాయని... రేపటి నుంచి ఉభయ సభలు సజావుగా నడుస్తాయని ఆశిస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా... పార్లమెంటు ఉభయ సభల్లో రాజ్యాంగంపై చర్చ జరగనుందని వెల్లడించారు. లోక్ సభలో డిసెంబరు 13, 14 తేదీల్లో... రాజ్యసభలో డిసెంబరు 16, 17 తేదీల్లో భారత రాజ్యాంగంపై చర్చ చేపడుతున్నట్టు కిరణ్ రిజిజు వివరించారు. రాజ్యాంగంపై మొదట లోక్ సభలో చర్చించాలన్న నిర్ణయానికి అందరూ ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. ఏదైనా అంశాన్ని లేవనెత్తాలనుకుంటే నోటీసు ఇవ్వడం ద్వారా మాట్లాడొచ్చని, అంతే తప్ప సభలో గందరగోళం సృష్టించే ప్రయత్నం మంచిది కాదని స్పీకర్ చెప్పారని వెల్లడించారు. స్పీకర్ ప్రతిపాదనకు అందరూ సమ్మతించారని తెలిపారు.

## జైలు నుంచి విడుదలైన మరుసటి రోజే
# మంత్రి పదవా?!

**మొదటిపేజీ తరువాయి..**

తర్వాత రోజే మీరు మంత్రి అయ్యారు... ఏం జరుగుతోంది? అంటూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం విస్మయం వెలిబుచ్చింది. సెంథిల్ బాలాజీ బెయిల్ తీర్పును రీకాల్ చేయాలంటూ దాఖలైన పిటిషన్ ను జస్టిస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసీ ధర్మాసనం విచారించింది. మేం ఇలా బెయిల్ ఇచ్చామో లేదో, అలా మీరు మంత్రి అయిపోయారు... ఇప్పుడీ కేసులో సాక్షుల పరిస్థితి ఏంటి? మీరు మంత్రి హోదాలో అధికార పీఠంపై ఉన్నందున సాక్షుల్లో ఆందోళన నెలకొనదా? అని సుప్రీం ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. అయితే సెంథిల్ బాలాజీ బెయిల్ పై పునరాలోచన లేదని, అతడి బెయిల్ రద్దు చేయబోమని స్పష్టం చేసింది. కానీ, సాక్షులు ఆందోళనకు గురవుతారన్న అంశాన్ని మాత్రం పరిగణనలోకి తీసుకుంటామని, ఆ అంశం వరకు విచారణ జరుపుతామని తెలిపింది. ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ డబ్బు వసూలు చేసిన కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీని ఈడీ 2023 జూన్ 14న అరెస్ట్ చేసింది. సెంథిల్ బాలాజీ 2011-15లో అన్నాడీఎంకే ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు ఈ స్కాం జరిగింది. సెంథిల్ బాలాజీ 2018లో అన్నాడీఎంకేను వీడి డీఎంకే పార్టీలో చేరారు. స్టాలిన్ ప్రభుత్వంలో మంత్రి పదవిని చేపట్టారు. అయితే, క్యాష్ ఫర్ జాబ్ స్కాంలో ఆయన జైలుకు వెళ్లడంతో మంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. సెంథిల్ బాలాజీకి గత సెప్టెంబరులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయగా, విడుదలైన మరుసటి రోజే ఆయనకు స్టాలిన్ సర్కారు మళ్లీ మంత్రి పదవి ఇచ్చింది.









కార్య క్రమంలో పాల్గొన్న మంత్రులు- కోకా కోలా ప్రతినిధులు

# బండ తిమ్మపూర్‌లో కోకా-కోలా గ్రీన్ ఫీల్డ్ ప్లాంట్‌ను ప్రారంభించిన సీఎం

### కోకా కోలా ఉత్పత్తి విధానాన్ని పరిశీలించిన సిఎం

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 2:** హిందుస్థాన్ కోకా-కోలా బెవరేజెస్ కంపెనీ సిద్దిపేట జిల్లా బండతిమ్మాపూర్‌లోని ఫుడ్ ప్రాసెసింగ్ పార్క్‌లో కొత్తగా నిర్మించిన హిందుస్తాన్ కోకా కోలా బేవరేజెస్ అవిన్యా గ్రీన్ ఫీల్డ్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం నాడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,కొండా సురేఖ,పొన్నం ప్రభాకర్ లతో కలిసి ప్లాంట్‌కు సిఎం ప్రారంభోత్సవం చేశారు. తర్వాత ప్లాంట్ ప్రొడక్షన్ విభాగాన్ని సందర్శించి బటన్ నొక్కి ఉత్పత్తిని ప్రారంభించడంతో పాటు ప్లాంట్‌లో కోకా-కోలా ఉత్పత్తి విధానాన్ని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐ సి చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి,ఎచ్సీసీబీ సీఈవో జాన్ పాబ్లో రోడ్రిగేతో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచండి

**మొదటిపేజీ తరువాయి..**

బంధువులకు చూపించాలని తెలిపింది. ఈ విషయంపై తదుపరి విచారణను రేపటికి(03-12-2024)కి హైకోర్టు వాయిదా వేసింది. మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై డీజీపీ జితేందర్ రెడ్డి స్పందించారు. మావోయిస్టులపై విషపదార్థాలు ప్రయోగించారనేది దుష్ప్రచారమని అన్నారు. మావోయిస్టులు స్పృహ కోల్పోయాక కాల్పులు జరిపామనడం అవాస్తమని తెలిపారు. వారు అత్యాధునిక ఆయుధాలతో పోలీసులపై కాల్పులు జరిపారని వివరించారు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులపై మావోయిస్టులు కాల్పులు జరపడంతో, పోలీసులు ఎదురు తిరిగి కాల్పులు జరపడంతో ఏడుగురు మావోయిస్టులు మరణించారని వెల్లడించారు.

హైకోర్టు, ఎన్‌హెచ్‌ఆర్సీ సూచనల మేరకు శవపరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఎన్‌కౌంటర్ కేసు దర్యాప్తు అధికారిగా వేరే జిల్లా డీఎస్పీని నియమించినట్లు డీజీపీ జితేందర్ ప్రెస్ నోట్‌లో వివరాలు వెల్లడించారు. కాగా ములుగు జిల్లా ఏటూరు నాగారంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ బూటకు ఎన్‌కౌంటర్‌పై తెలంగాణ హైకోర్టులో పౌరహక్కుల సంఘం లంచ్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేసింది. మావోయిస్టుల భోజనంలో విషప్రయోగం జరిగిందని పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై న్యాయస్థానం మధ్యాహ్నం విచారణను చేపట్టింది. మృతదేహాలను వైద్య నిపుణుల సమక్షంలో పోస్టుమార్టం జరపాలని పిటిషన్‌లో పౌరహక్కుల సంఘం పేర్కొంది. పోస్టుమార్టాన్ని వీడియో ద్వారా రికార్డు చేయాలని సూచించారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు.

మరోవైపు కుర్సం మంగు, అలియాస్ భద్రుపై రూ.20 లక్షల రివార్డు ఉన్నట్లు జిల్లా ఎస్పీ శబరీష్ తెలిపారు. పూలకొమ్మ అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తున్న గ్రౌండ్స్ బలగాలపై మావోయిస్టులు దాడి చేయడంతో ఆత్మ రక్షణ నిమిత్తం కాల్పులు జరిపామని తెలిపారు. మావోయిస్టుల మృతదేహాల తరలింపులో హైడ్రామా చోటుచేసుకుంది. తెల్లవారుజామున ఎన్‌కౌంటర్ జరిగినా, రాత్రి ఏడు గంటల వరకూ మృతదేహాల తరలింపు జరగలేదు. తొలుత ములుగు ఏరియా ఆసుపత్రికి మృతదేహాలను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఫ్రీజర్లను సైతం సిద్ధం చేశారు. ఆఖరి నిమిషంలో రాత్రి పదకొండున్నర గంటల ప్రాంతంలో ఏటూరునాగారం సామాజిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇవాళ ఫోరెన్సిక్ వైద్యులు శవ పరీక్షలు నిర్వహించిన అనంతరం, మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు.వారం రోజుల పాటు పీపుల్స్ గెరిల్లా ఆర్మీ వారోత్సవాలు జరుగుతాయని మావోయిస్టులు ముందే ప్రకటించగా, దానికి ఒకరోజు ముందే ఈ ఘటన జరగడంతో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలినట్లైంది. ములుగు ఎన్‌కౌంటర్ ఘటనపై తెలంగాణ పౌరహక్కుల సంఘం నేతలు పలు సందేహాలు వెలిబుచ్చుతున్నారు. పోలీసులెవ్వరికీ గాయాలు కాలేదని, అసలు ఎన్‌కౌంటర్ జరిగినట్లు లేదని, అన్నంలో విషం పెట్టి, స్పృహ కోల్పోయిన తర్వాత చిత్రహింసలకు గురి చేసి కాల్చి చంపారని సంఘం నేతలు ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, నిపుణులైన వైద్య బృందం పర్యవేక్షణలో వైద్య పరీక్షలు జరగాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటనా స్థలం నుంచి ఆయుధాలు, కిట్ బ్యాగులు, మావోయిస్టు విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

# పది నెలల్లోనే అద్భుతాలు జరుగుతాయా?

**మొదటిపేజీ తరువాయి..**

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మార్గ్‌లో గల హెచ్‌ఎండీఏ మైదానంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. ప్రజాపాలన వేడుకల్లో భాగంగా 213 అంబులెన్స్‌లను ప్రారంభించారు. 108, 102 వాహనాలను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత విద్య, వైద్యం అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ రెండింటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఏడాదిలోపు తమ ప్రభుత్వం వైద్యశాఖలో 14 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. వైద్య శాఖ బలోపేతమైతేనే ఆరోగ్య తెలంగాణ నిర్మాణమవుతుందన్నారు. దేశంలో ఇంత పెద్ద ఎత్తున వైద్య శాఖలో ఎవరూ భర్తీ చేయలేదన్నారు. దేశంలోనే అత్యధిక డాక్టర్లను అందించే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. తెలంగాణ సమాజమే తమ కుటుంబం అనుకొని తాము ఉద్యోగాలు ఇచ్చామన్నారు. బీఆర్ఎస్ ఎనిమిది మెడికల్ కాలేజీలను ఇచ్చి కనీస వసతులు కల్పించలేదని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఉద్యోగాలు ఊడితేనే యువతకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. పరీక్షలు వాయిదా వేయమని చాలామంది డిమాండ్ చేశారని, కానీ విద్యార్థుల విలువైన సమయం వృథా అవుతుందని అలా చేయలేదన్నారు. కానీ గత ప్రభుత్వం పలుమార్లు వాయిదా వేసిందన్నారు. గత ప్రభుత్వం వరి వేస్తే ఉరి అన్నదని... తాము మాత్రం పంటలు వేసేలా ప్రోత్సహించామన్నారు. సన్నాలకు రూ.500 బోనస్ ప్రకటించామని గుర్తు చేశారు. తాము అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. రైతుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు పడుతుంటే కొంతమందికి భయం పట్టుకుందన్నారు. సంక్రాంతికి ముందు గంగిరెద్దుల వాళ్లు వచ్చినట్లు కొంతమంది వస్తారని, కానీ వారు వచ్చేది పంచాయతీ ఎన్నికల కోసమే అన్నారు. సీఎంగా తన పనిని ఆపి పక్కన పెడితే... అభివృద్ధి ఆగిపోతుం దన్నారు. అందుకే తాను పని మీద దృష్టి సారించానన్నారు. మీరు (కార్యకర్తలు, ప్రజలు) భుజాలపై మోస్తేనే తాము అధికారంలో కూర్చున్నామన్నారు. మాకు కుర్చీ రావడానికి కారణం ఈ ప్రజలు, కార్యకర్తలే అన్నారు. కాబట్టి ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత మీదే అన్నారు. అందుకే ప్రతిపక్షం చేసే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టే బాధ్యత కూడా మీదేనని సభకు



వచ్చిన వారిని ఉద్దేశించి అన్నారు. పేదలపై కరెంట్ బిల్లు భారం తప్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం 'గృహజ్యోతి' పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే.

ఈ పథకం కింద నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ ను వినియోగించే కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా కరెంట్ అందిస్తోంది. దీంతో ఆయా కుటుంబాలకు కరెంట్ బిల్లు చెల్లించే అవసరం తప్పింది. ఆమేరకు కుటుంబాలపై భారం తగ్గింది. ఈ పథకంపై తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర ట్వీట్ చేశారు. పేదల ఇంట విద్యుత్ వెలుగులు పంచాలన్న ప్రజా ప్రభుత్వ సంకల్పం సత్ఫలితాలను ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం కింద కేవలం హైదరాబాద్ లోనే 10.52 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని సీఎం చెప్పారు. ఈ పరిణామం హర్షణీయం అని పేర్కొన్నారు. సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ గా ఇందిరమ్మ పాలన నిలుస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.





# పట్టుదల, దృఢ సంకల్పం ఉంటే లక్ష్యాన్ని సాధించవచ్చు...

**మొదటిపేజీతరువాయి..**

పద్మశాలీల సమస్యలకు ప్రజా గొంతుక గా మారి శాయశక్తుల తన వంతు కృషి చేస్తానని అన్నారు. అసెంబ్లీలో తొలిసారిగా అడుగు పెట్టినప్పుడే మార్కండేయుడి ఆశీస్సులు పొందడం జరిగిందని గుర్తు చేశారు. కొందరు ఉద్యోగులు విజయ సాధన కోసం తాము పడ్డ కష్టాలను, పోటీ పరీక్షల్లో నెగ్గడానికి ఇబ్బందులను వివరించారు. త్వరలోనే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పేద విద్యార్థుల ప్రతిభ నైపుణ్యత మెరుగుపరిచేందుకు అన్ని వసతులతో బీసీ స్టడీ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నట్టు హామీ ఇచ్చారు. పద్మశాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కుర్ర రమేష్, కుసుమ గణేష్ లను పదోన్నతి పొందిన ఎం జోత్స్న, చంద్రకళ, బేతలలిత, అర్చనలను ఎమ్మెల్యే , పద్మశాలి సంఘం నేతలు సన్మానించారు. పద్మశాలి సంఘం, పోపా తరపున ఎమ్మెల్యే పాయల్ శంకర్ ను జిల్లా అధ్యక్షులు బేత రమేష్, నాయకులు శివకుమార్, లచ్చిరాం, చంద్రమోహన్ , తాలూకా అధ్యక్షులు బొమ్మ కంటి రమేష్, ప్రధాన కార్యదర్శి చిలుక విలాస్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు కటకం రాందాస్, కాసర్ల శ్రీనివాస్, కామన్ విట్టల్, బాస దత్తు, రాకేష్ పద్మవార్ , బార్ అసోసియేషన్ అధ్యక్షులు నగేష్, మండల ప్రధాన కార్యదర్శి తుమ్మరాజు, గాజుల హనుమాన్లు, పాల్గొన్నారు.



## కార్మిక సభ్యత్వాల డ్రైవ్‌లో ఐఎన్టియుసి ఫెడరేషన్

**చర్లపల్లి డివిజన్లో కమిటీల నియామకం..**

**కార్మికులకై నేనున్నా అంటున్న అధ్యక్షులు పవన్..!**

**కార్మికుల కోసం కృషి చేస్తా ప్రధాన కార్యదర్శి కమ్లేష్..!**

**చర్లపల్లి, వెలుతురు 2 డిసెంబర్ 2024:**
చర్లపల్లి డివిజన్ ప్రాంతంలో ఉన్న వివిధ రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతి నిత్యం అందుబాటులో ఉండటమే కాక సమస్యల పరిష్కారం వైపు కృషి చేస్తానని అన్నారు. అదేవిధంగా డివిజన్ ప్రధాన కార్యదర్శి కమ్లేష్ ఆధ్వర్యంలో నూతన సభ్యత్వల డ్రైవ్ కార్యక్రమం చెప్పట్టటం జరిగింది కావున ఈ ప్రాంతంలో ఉండే భవన నిర్మాణ, పెట్రోల్ పంప్, లేదర్ ఇండస్ట్రీ, స్వయం ఉపాధి, మరియు వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులు ఐఎన్టియుసి ఫెడరేషన్ కాంగ్రెస్ పార్టీ విభాగంలో మీరు సభ్యత్వం తీసుకొని కార్మిక రంగం లో ఎదురవుతున్న అనేక ఇబ్బందులపై సంఘటీతమై పనిచేయాలని రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మురహరి బుద్దారం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సభ్యత్వ కార్యక్రమంలో కార్మిక రంగ వ్యవస్థలలో పని చేస్తున్న ప్రతి కార్మికుడు భాగస్వామ్యం వహించాలని పిలుపు నివ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మ్యాతరి సుదర్శన్, ప్రదీప్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

## గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

**- కార్యకర్తల సమావేశంలో ఎంఎల్ఏ పాయల్ శంకర్**

**ఆదిలాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే దేంగా పనిచేయాలని అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు సోమవారం బిజెపి కార్యాలయంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై దిశా నిర్దేశం చేస్తూ ఆయన మాట్లాడారు బిజెపి అంటేనే క్రమశిక్షణతో కూడుకున్నదని నాయకత్వం పై నమ్మకాన్ని



నిలబెట్టుకుంటే గెలుపు దానంతట అదే వస్తుందని ఆయన అన్నారు ప్రజల కోసం ప్రతి ఒక్కరు పని చేయాలని అప్పుడే మనతోపాటు పార్టీ కూడా బలపడుతుందని ఆయన అన్నారు నమ్మకమైన పార్టీ కార్యకర్తల బలం వల్లే నేడు నేను ఎమ్మెల్యేగా గెలిచానని ఆయన గుర్తు చేశారు ఒకటి రెండు సార్లు పోటీ చేసి ఓడిపోతే మళ్ళీ వచ్చే ఎన్నికల్లో కనబడని వారందరు ఉంటారు కానీ బిజెపిలో మాత్రం మూడుసార్లు పోటీ చేసి ఓడిపోయి నాలుగోసారి ఎన్నికలకు సిద్ధమైన నా కోసం పార్టీ కోసం నా వెంటే ఉంటూ నియోజకవర్గం లో భాజపా బలోపేతానికి కృషి చేశారని అదేవిధంగా స్థానిక సంస్థల్లో సైతం పార్టీని, పోటీ చేసే పెంచుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు భాజాపా అంటే ప్రజలతో కార్యకర్తలకు ఉన్న అనుబంధం సంబంధాలను మాత్రమే చూస్తుందని ఆస్తులు అంతస్తులు చూసి టికెట్టు ఇచ్చే పార్టీ కాదని ఆయన అన్నారు నిబద్ధత నిజాయితీతో పనిచేస్తే ఎలాంటి పదవి నాయన చేరుకోవచ్చని ఆయన అన్నారు పార్టీ కోసం పార్టీ ఆశయాల కోసం నిరంతరం కృషి చేసిన ఎంతోమంది ముఖ్యమంత్రి మంత్రులుగా ఉన్నారని ఆయన ఈ సందర్భంగా చెప్పారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పక్కాగా ముందుకెళ్లాలని పోలింగ్ బూతుల వారిగా ఏర్పాటుచేసిన కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు ఈ సమావేశంలో నాయకులు ఆకుల ప్రవీణ్ రఘుపతి జోగు రవి కృష్ణ యాదవ్ గొర్ల రాము శ్రీనివాస్ సోమ రవి. సుభాష్ రాకేష్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఇబ్రహీంపట్నంలో తలపెట్టిన మాదిగల ఆత్మీయ సభను విజయవంతం చెయ్యాలి

**ఇబ్రహీంపట్నం మాదిగ జేఏసీ కన్వీనర్ బోసుపల్లి ప్రతాప్**

**ఇబ్రహీంపట్నం వెలుతురు డిసెంబర్ 02:**
ఈ నెల 10 వ తేదీన ఇబ్రహీంపట్నం లో తలపెట్టిన మాదిగల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చెయ్యాలని కోరుతూ నేటి సాయంత్రం నీలం సంజీవ రెడ్డి కాలనీ (మన్నెగూడ కాలనీ ) లో చెక్క ప్రశాంత్, కంతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాదిగల



సమాయత్త సమావేశం జరిగినది. ఇట్టి సమావేశంలో ఇబ్రహీంపట్నం మాదిగ జేఏసీ కన్వీనర్ పెద్దలు బోసుపల్లి ప్రతాప్ గారు మాట్లాడుతూ అక్కడ సమావేశం అయినా యువకులకును ఉద్దేశించి ఏబీసీడీ వర్గీకరణ గురించి క్లుప్తంగా వివరించి 10వ తేదీన జరిగే సమావేశనికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమిహి వ్యవస్థాపక అధ్యక్షులు గౌరవ మందకృష్ణ మాదిగ గారు ఉస్మానియ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ కాసీం గారు పాల్గొనే సభకు మన కాలనీ నుండి అత్యధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చెయ్యాలని కోరారు

ఈ కార్యక్రమం లో ఇబ్రహీంపట్నం మాదిగ JAC నాయకులు బచ్చిగళ్ల రమేష్ కొండ్రు పురుషోత్తం, మేతరి కుమార్, గుడ్ల అర్జున్, మాజి సర్పంచ్ మేతరి అంజయ్య, చెక్క దయానంద్, పెద్దింటి సురేష్,మెతరి శ్రీహరి కాలనీ లోని యువకులు పెద్దలు పాల్గొన్నారు.


# యువ సంఘం కింద హిమాచల్ ప్రదేశ్‌ను సందర్శించనున్న తెలంగాణ విద్యార్థులు

**వెలుతురు డిసెంబరు 02, 2024, హైదరాబాద్:**
ప్రజల మధ్య సత్సంబంధాలను నెలకొల్పడంలో భాగంగా వివిధ రాష్ట్రాలకు చెందిన యువత ఒకరినొకరు అర్థం చేసుకునేందుకు వీలుగా 'ఏక్ భారత్ శ్రేష్టతా భారత్' (ఈబీఎస్బీ) కింద యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ 'యువ సంగం' పేరుతో ఒక కార్యక్రమాన్ని రూపొందించింది. భారతదేశంలోని అన్ని రాష్ట్రాలూ, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన ప్రజల మధ్య ప్రణాళికాబద్ధంగా, ఎప్పటికీ కొనసాగే సాంస్కృతిక బంధం ఉండాలన్న లక్ష్యంతో గౌరవ ప్రధానమంత్రి 'ఏక్ భారత్-శ్రేష్టతా భారత్'కు రూపకల్పన చేశారు. ఒక రాష్ట్రానికి చెందిన యువత మరో రాష్ట్రంలో 5 నుంచి 7 రోజులపాటు పర్యటించడం ద్వారా అక్కడి జీవన వైవిధ్యాలూ, భౌగోళిక పరిస్థితులూ, అభివృద్ధి కార్యక్రమాలూ, ఇటీవల సాధించిన విజయాలనూ ప్రత్యక్షంగా తెలుసుకోవడంతోపాటు అక్కడి యువతతో ప్రత్యక్ష సంబంధాలను ఏర్పాటు చేసుకోవడం కోసం రూపొందించిన సాంస్కృతిక వినిమయ కార్యక్రమమే ఈ యువసంగం.

యువసంగం అయిదోదశలో భాగంగా- తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువత.. ఏక్ భారత్ శ్రేష్టతా భారత్ యువసంగం కార్యక్రమాల కింద డిసెంబరు 22 నుంచి 29 వరకూ హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం హమీర్పూర్ లోని ఎన్ఐటీని సందర్శించనున్నారు. తెలంగాణ నుంచి ఎంపిక చేసిన 50 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

తెలంగాణకు సంబంధించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నోడల్ విశ్వవిద్యాలయంగా మౌలానా అజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని ఎంపిక చేశారు.

ఈ ఉర్దూ విశ్వవిద్యాలయంతో- హిమాచల్ ప్రదేశ్ హమీర్పూర్ లోని ఎన్ఐటీని విద్యా మంత్రిత్వశాఖ అనుసంధానం చేసింది. భారత యువత పరస్పర అవగాహన కోసం 'ఏక్ భారత్-శ్రేష్టతా భారత్' (ఈబీఎస్బీ)లో కింద యువసంగం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.




# రెయిన్ వాటర్ సంపుల పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి

**కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం -ముఖ్య అధికారులు**

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 2:**
లేక్ వ్యూ గెస్ట్ హౌస్ దగ్గర వరద నివారణ కోసం నిర్మిస్తున్న రెయిన్ వాటర్ సంప్ పనులను సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. వరద నివారణ చర్యలపై అధికారులకు పలు సూచనలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి అలాగే రోడ్ల పైన వరద మళ్లిస్తే నగరంలో ట్రాఫిక్ జాంలను తగ్గించవచ్చన్న సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. వచ్చే వర్షాకాలం నాటికి అన్నీ చోట్ల పనులు పూర్తి చేయాలని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి అలాగే

రైయిన్ వాటర్ సంప్‌ల డిజైన్ మార్చాలని అధికారులకు సూచించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ వ్యాప్తంగా గుర్తించిన 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ దగ్గర రెయిన్ వాటర్ సంపు లను నిర్మించాలని ఆదేశాలను జారీ చేసిన సిఎం రేవంత్ రెడ్డి, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇళంబర్తి,సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి.ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు ఏం ఒరగబెట్టారని సంబరాలు..?

**మొదటి పేజీ తరువాయి..**

రేవంత్ రెడ్డిని సమాజం ఛీ కొట్టిందన్నారు

రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు రేవంత్ లక్కీ లాటరీతో ముఖ్యమంత్రి అయిండు.

కిషన్ రెడ్డ తెలంగాణ ఉద్యమంలో యాత్రలు, పోరాటాలతో ప్రజలను చైతన్యవంతం చేశారు. అనేకసార్లు అరెస్టయ్యారని గుర్తు చేశారు,

రేవంత్..! దీనిపై దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు,

రేవంత్ రెడ్డికి తెలంగాణ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై, కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు లే దన్నారు,

ప్రధాని నరేంద్ర మోదీ,కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లనుతిడితే పెద్ద నాయకుడివిఅవుతావనుకుంటున్నావేమో అంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణకు మోదీ గఏం చేశారంటూ గతంలో కేసీఆర్ కూడా ఇట్లనే మాట్లాడిండు. ఆఖరుకు ఫాంహౌస్ కు పరిమితమయ్యిండు.

రేవంత్ రెడ్డికి కూడా కేసీఆర్ కు పట్టిన గతే పట్టే రోజులు దగ్గరపడ్డాయని అంటున్నారు

ఆర్టీసీ కళ్యాణమండపం సాక్షిగా, జర్నలిస్టుల సాక్షిగా తెలంగాణకు, హైదరాబాద్ కు, సికింద్రాబాద్ కు కేంద్రం ఇచ్చిన లక్షల కోట్ల నిధుల గురించి అన్ని వివరాలతో కిషన్ రెడ్డి గారు బహిరంగంగా వివరించిన్రు.

రేవంత్ రెడ్డి.. మరోసారి తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధుల గురించి అమరవీరుల స్థూపం దగ్గర చర్చకు సిద్ధమా..? ఇంకెక్కడైనా చర్చించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రంలో సంపూర్ణంగా రైతు రుణమాఫీ చేసిన చరిత్ర బిజెపిది. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూ. 13 వేల కోట్లు ఇస్తే మొత్తం రుణమాఫీ పూర్తవుతుందని చెబితే... నిన్న పాలమూరు సాక్షిగా రూ. 3 వేల కోట్లతో రుణమాఫీ పూర్తయిందంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మొత్తంగా అబద్ధాల ప్రచారంతో ప్రజలను మాయ చేయాలని మరోసారి ప్రయత్నం చేస్తున్నారు. 2024 మార్చి 31 వరకు 64 లక్షల 90 వేల 228 మంది షార్ట్ టర్మ్ క్రాప్ లోన్స్ తీసుకున్నారు.

రైతు రుణమాఫీకి మొత్తం రూ. 79 వేల 387 కోట్లు ఇవ్వాల్సి ఉంది.

కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 22 వేల కోట్ల రూపాయలు ఇచ్చి.. మొత్తం రుణమాఫీ చేసినట్లుగా ప్రచారం చేసుకుంటున్నది. రేవంత్ రెడ్డి.... గతంలో తెలంగాణలో ఉన్న దేవుళ్ళందరి మీద ఒట్టు వేసి రుణమాఫీ పూర్తిచేస్తామని హామీ ఇచ్చిండు. అయిపోయింది.. ఇప్పుడు తెలంగాణ మంత్రుల మీద ఒట్టేసి రైతు భరోసా ఇస్తానంటున్నాడు. అటు ఇటు తిరిగి మా మీద ఒట్టు పెట్టిండు అని కాంగ్రెస్ మంత్రులే అనుకుంటూ భయపడుతున్నరు. రేవంత్ రెడ్డి ఒట్టు అంటే.. ప్రజలు తిట్టు అన్నట్లుగా భావిస్తున్నారు.

సోకాల్డ్ గాంధీ కుటుంబం నకిలీ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని, పదేపదే రాజ్యాంగం గురించి మాట్లాడుతున్నారు. వాళ్లకు దేశభక్తి కంటే కుటుంబ భక్తే ఎక్కువ.

నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతున్నరు. సిగ్గుండాలి. మొత్తం 41 సార్లు వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలను రద్దు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. రాజ్యాంగంలో 90 సవరణలు కాంగ్రెస్ హయాంలో జరిగినవే. కోర్టులను ప్రశ్నించడం,.. పార్లమెంటును ప్రశ్నించడం.. ఎలక్షన్ కమిషన్ ను, సీబీఐని, ఇన్ కమ్ ట్యాక్స్ డిపార్ట్ మెంట్ ను తప్పుబట్టే నీచమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. అనేక రకాలుగా రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ, అపహాస్యం చేసే చరిత్ర కాంగ్రెస్ పార్టీది. ల్యాండ్స్ గురించి, గుజరాత్ మద్యం బ్రాండ్ల గురించి మాట్లాడే రేవంత్ రెడ్డికి.. రియల్ ఎస్టేట్ బినామీ భూముల విషయంలో ఆఫీసర్లకు ఏయే బ్రాండ్లు ఇవ్వాలో బాగా తెల్సు. గుజరాత్ లో మద్య నిషేధం ఉందా అని అడుగుతున్న రేవంత్ రెడ్డికి.. తెలంగాణలో డ్రగ్స్ నిషేధం ఉందని తెలుసా..? ఆయన ప్రశించారు

రేవంత్ కు.... స్మగ్లింగ్ కు, నిషేధానికి, అధికారికంగా అమ్మకాలు జరపడానికి మధ్య తేడా తెలియకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నడు. 6 గ్యారంటీలు, 66 హామీల్లో ఏ ఒక్కటీ సరిగ్గా అమలు చేయకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ ప్రజలను నిట్టనిలువునా మోసం చేసింది.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బిజెపి ప్రజల్లోకి తీసుకెళ్తుంటే రేవంత్ ప్రభుత్వానికి భయం పట్టుకుంది.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెవర్చేంతవరకు బిజెపి పోరాటం కొనసాగిస్తూనే ఉంటుంది.

ఇప్పటికైనా బిజెపి పట్ల, బిజెపి నాయకులపై మాట్లాడే ముందు రేవంత్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరిస్తున్నామన్నారు.

## గ్రేటర్ పరిధిలో సిక్స్‌లేన్ ఫ్లైఓవర్

**నెహ్రూ జులాజికల్ పార్క్ నుంచి అరాంఘర్ ఫ్లైఓవర్**

**త్వరలో సీఎం చేతుల మీదుగా జాతికి అంకితం చేసే అవకాశం**

**హైదరాబాద్,డిసెంబర్2(వెలుతురు):** ట్రాఫిక్ కష్టాలతో కునారిల్లుతున్న జంటనగరాల వాసులకు మరో శుభవార్త. నెహ్రూ జులాజికల్ పార్క్ నుంచి అరాంఘర్ సిక్స్ లేన్ ఫ్లైఓవర్ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు ఎట్టకేలకు పట్టాలెక్కబోతోంది. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధమైంది. ఇది భాగ్యనగరంలోనే అతిపెద్ద రెండో ఫ్లైఓవర్. 24 మీటర్ల వెడల్పు, నాలుగు కిలోమీటర్ల పొడవైన ఈ ఫ్లైఓవర్ కోసం 636 కోట్ల రూపాయలు ఖర్చయింది. ఫ్లైఓవర్‌కు రెండువైపులా ఎనిమిది కిలోమీటర్ల సర్వీస్ రోడ్డు పూర్తి చేయడమే ప్రాజెక్టులో అతి పెద్ద సవాల్. అడ్డుగా ఉన్న నిర్మాణాలను కూల్చివేసి సర్వీస్ రోడ్‌ను చకచకా నిర్మిస్తున్నారు. ఫ్లైఓవర్ పనులు దాదాపుగా 90 శాతం పూర్తయ్యాయి. హెచ్ఎండీఏ ఉన్నతాధికారులతో కలిసి బల్దియా కమిషనర్ ఇటీవలే పనులను పర్యవేక్షించారు. నాలుగు రోజుల్లో సర్వం సిద్ధమై.. సీఎం చేతుల మీదుగా ప్రజలకు అంకితం అవుతుంది. నగరం అంతటా పట్టణాభివృద్ధిని పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన "ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు" కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కీలక ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ఫ్లై ఓవర్ వల్ల శాస్త్రిపురం, కాలాపత్తర్ వంటి కీలకమైన జంక్షన్‌లలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు. ఇది గనుక అందుబాటులోకి వస్తే.. జూపార్క్ నుంచి ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు, మహబూబ్‌నగర్, కర్నూలు, అనంతపురం, బెంగళూరు వెళ్లేవారికి ట్రాఫిక్ఇబ్బందులు తప్పుతాయి. తాడ్‌బన్, దానమ్మ హట్స్, హసన్ నగర్ జంక్షన్లలోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఇక ఆగాల్సిన పనే ఉండదు. జూపార్క్‌కు వచ్చే సందర్శకులు, పాతబస్తీ వైపు వెళ్లే వాహనాలకు ప్రయాణం సులభతరం అవుతుంది.

## ఆలూరు లారీ ప్రమాద ఘటనలో నలుగురు దుర్మరణం





**మొదటి పేజీ తరువాయి..**

ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సదుపాయం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటామని సిఎం హామీ ఇచ్చారు,కాగా ఈ ప్రమాదంలో పది మంది ప్రాణాలు కోల్పోయారు మరికొంత మందికి తీవ్రంగా గాయాలయ్యాయి.

ప్రమాద సంఘటన స్థలం లోనే ప్రేమ్, రాములు. సుజాత అనే కూరగాయల వ్యాపారం చేస్తున్న వారు మృతి చెందిన సంఘటనలో ఉన్నారు,ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా లారీ డ్రైవర్ క్యాబిన్ లో ఉన్నట్లుగా నటించి గందరగోళ సమయంలో పరారీ అయినట్లుగా తెలుస్తోంది. రోడ్డు పక్కన కూరగాయలను విక్రయించే వ్యాపారులపై నుంచి లారీ వెళ్లడంతో తీవ్ర ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. పొట్టకూటికోసం వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్న పేదలు వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

ఈ ప్రమాదంలో మృతి చెందిన వారివద్దకు చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ నాయకుడు భీమ్ భరత్. మహేశ్వరం నియోజకవర్గం ఎంఎల్ఏ సబితా ఇంద్రా రెడ్డిలు సందర్శించారు.

# సంపాదకీయం

## రేవంత్ రెడ్డి ఏడాది పాలన!

తెలంగాణ రెండవ ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి ఏడాది పదవీకాలాన్ని పూర్తిచేసుకుంటున్నారు. అనేక ప్రచారాలు, ఒత్తిళ్ల మధ్య కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక ఏడాది పాటు ముఖ్యమంత్రిగా బాధ్యతలను పూర్తిచేయడమనేది పెద్ద విషయమే. అయితే ఈ ఏడాదిలో ఆయన ఏం సాధించారో చూడటం కూడా అవసరమే.

వై ఎస్ రాజశేఖర్ రెడ్డి లా రేవంత్ రెడ్డి జీన్స్ లో కాంగ్రెస్ రక్తమున్న నాయకుడు కూడా కాదు. భారతీయ జనతా పార్టీ మూలాలతో, తెలుగుదేశం పార్టీ శిక్షణలో రాటుదేలి ఎదిగిన నాయకుడు! అలాంటి రేవంత్ రెడ్డి కొన్ని తరాలుగా కాంగ్రెసు పార్టీనే నమ్ముకుని ఉన్న నాయకులందరినీ బైపాస్ చేసి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించగలిగారంటే.. అది కేవలం ఆయన కష్టార్జితం. శ్రమ ఫలం.

రేవంత్ రెడ్డి దూకుడు, కష్టనష్టాలకు వెరవని తత్వం ఇవన్నీ కలిపి ఆయనను రేసులో ముందంజలో ఉంచి ముఖ్యమంత్రి అయ్యేలా చేశాయి. సీఎం పదవికి తాను ఎంపిక కావడానికి దారి తీసిన కారణాలు, పార్టీ అధిష్ఠానాన్ని ఇంప్రెస్ చేసిన అర్హతలు ఏవైనా కావొచ్చు గాక.. ఎన్నయినా ఉండవచ్చు గాక.. పదవిలో కలకాలం కొనసాగడానికి అవి చాలవు అనే సంగతి రేవంత్ కు చాలా బాగా తెలుసు. అందుకే సీఎం అయ్యేదాకా ఒక తీరు .. అయిన తర్వాత మరో తీరు అన్నట్టుగా ఆయన తన పనితీరును నిర్దేశించుకున్నారు.



'ఆరు గ్యారంటీలు' అనే జనాకర్షక హామీలతో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చిన రేవంత్ రెడ్డి.. పగ్గాలు చేపట్టిన వెంటనే రెండింటిని నెరవేర్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారు. ఆరోగ్య శ్రీ బీమా లిమిట్ ను పది లక్షల రూపాయలకు పెంచారు. సర్వత్రా జనామోదం పొందిన నిర్ణయాలు అవి.

ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చిన తర్వాత తీసుకుంటున్న నిర్ణయాలు, అనుసరిస్తున్న విధానాలు, దూకుడు విషయంలో సహచరులు నోరెత్తలేక మౌనంగా ఉండి పోయే పరిస్థితిని సృష్టించాలని రేవంత్ రెడ్డి ముందుగానే ఒక స్థిరాభిప్రాయానికి వచ్చినట్లుగా కనిపిస్తోంది. ఆయన పనితీరు దానికి తగ్గట్టుగానే ఉంది.దానికి తగ్గట్లుగానే ఆయన పని చేసుకుంటూ పోతున్నారు. పార్టీలో సీనియర్ సహచరులలో అసంతృప్తి రాకుండా తనకు చేతనైన చర్యలు తీసుకుంటున్నారు. డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఎన్నికల ఫలితాల సమయంలోనే డిప్యూటీ ముఖ్యమంత్రిగా కూర్చుండబెట్టారు. అప్పటి వరకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నివాసం గా ఉన్న భవంతిని, తన జమానాలో డిప్యూటీ అయిన భట్టికి కేటాయించారు. అంతేకాదు, అన్ని ప్రభుత్వ కార్యక్రమాలలో ముఖ్యమంత్రితో సమానంగా భట్టివిక్రమార్కకు ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. చివరికి ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసే ఫోటోల విషయంలో కూడా ముఖ్యమంత్రితో సమానంగా భక్తి విక్రమార్క ఫోటోలు కూడా పెట్టిస్తూ ఆయనను సంతృప్తి పరిచారు.

పరిపాలన పరంగా తన ముద్ర చూపించుకోవడం లక్ష్యంగా, తాను మాత్రమే చేయగలిగిన శైలి పనులు ఇవి అనిపించేంత దూకుడుగా ఆయన నిర్ణయాలు తీసుకోవడం ప్రారంభించారు. తెలంగాణ చరిత్రలోనే హైడ్రా కూల్చివేతలు ప్రత్యేక అధ్యాయం! నీటి వనరులను, సరస్సులు, కాలువలను కాపాడడానికి చాలా మొండి ధైర్యంతో హైడ్రా ఆలోచనకు రేవంత్ రూపకల్పన చేశారని చెప్పాలి. అన్ని రకాలుగానూ.. ఇంతటి వైభవోపేతమైన భాగ్యనగరం.. వర్షాకాలంలో దుర్భర జీవితానికి ఆలవాలం అవుతున్నదంటే.. నీటివనరులు శాశ్వత దురాక్రమణలకు గురై ఉండడమే అనే కఠోరసత్యాన్ని సీరియస్ గా పట్టించుకున్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

నీటి వనరుల ఆక్రమణల విషయంలో ఎంతటి వారి ఆస్తులైనా సరే, ఎంత విలువైన నిర్మాణాలు అయినా సరే.. వెనక్కు తగ్గేది లేదని.. సమూలంగా నేలమట్టం చేసేయడమే అని ఆయన పలు సందర్భాల్లో నిరూపించుకుని ముందుకు సాగారు.

అలాగని, రేవంత్ రెడ్డి పరిపాలనలో లోపాలు లేవని చెప్పలేం. సకాలంలో రైతుబంధు నిధులు ఇవ్వకపోగా రుణమాఫీ చేస్తానని ప్రకటించిన హామీ ఇవాళ్టి దాకా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. హైడ్రా కూల్చివేతల విషయంలో చిన్న చిన్న అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. మూసీ నది ప్రక్షాళన విషయంలో పేదల ఇళ్లు కూల్చి వేయడం అనేది పెద్ద రాద్ధాంతంగా మారిపోయింది.

మూసీ నదిని ప్రక్షాళన చేయడం ఆ ప్రాంతం మొత్తానికి పూర్వవైభవం తీసుకురావడం అనేది అతి పెద్ద బృహత్కార్యం. ఇలాంటి కార్యాన్ని తలపెట్టినప్పుడు అవాంతరాలు రావడం సహజం. రాజకీయ అభ్యంతరాలను పట్టించుకోకుండా ప్రజలకు మంచి చేస్తున్నానా లేదా, అలాగే తన నిర్ణయం వలన ఎన్ని పేద కుటుంబాలు పూర్తిగా ఛిద్రమవుతాయి అందుకు తన ప్రభుత్వం చూపగలిగిన పరిష్కారం ఏమిటి? ఇలాంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. పేదలకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారి ఉపాధులు ఏమాత్రం దెబ్బ తినకుండా వారు అదనపు ఇబ్బందులు పడకుండా తన ఆత్మ సాక్షికి తెలిసేలాగా పరిష్కారాలను చూపగలి గారా లేదా అనేది ముఖ్యం. ఆ విషయంలో రేవంత్ రెడ్డి ఇంకా పూర్తిగా దృష్టి సారించినట్లుగా అనిపించడం లేదు

మరోవైపు, సీఎం మార్పు బూచీనా చూపిస్తే రేవంత్ రెడ్డి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడానికి, ఆయనలో ఒకరకమైన భయాన్ని రేకెత్తించడానికి ప్రతిపక్షాలు తమ శక్తివంచన లేకుండా పనిచేస్తూనే ఉన్నాయి. కేటీఆర్, కిషన్ రెడ్డి వంటి విపక్ష నాయకులు ఇప్పటికి కొన్ని వందల సార్లు.. రేవంత్ రెడ్డి పదవి త్వరలోనే పోతుందని చెబుతూ వచ్చారు. కానీ వారి అలాంటి మైండ్ గేమ్ కు రేవంత్ ఏ మాత్రం లొంగలేదు. మరింత దూకుడుగా, మరింత ఆత్మవిశ్వాసంతో, మరింత ఘనంగా అడుగులు వేస్తున్నారు. అవినీతి మరకలు తనకు అంటకుండా చూసుకుంటున్నారు. ఎక్కడ నెగ్గాలో కాదు.. ఎక్కడ తగ్గాలో తెలియడం గొప్ప అనే సిద్ధాంతాన్ని ఆయన కూడా పాటిస్తున్నారు. ప్రజాందోళనల్ని ఆయన గౌరవిస్తున్నారు. ఒక రాజకీయ నాయకుడికి ఇది చాలా ముఖ్యమైన లక్షణంగా ఉండాలి. చాలా మంది ప్రజాందోళనల్ని గుర్తించకుండా, గౌరవించకుండా.. తమ భవిష్యత్తును తామే నాశనం చేసుకుంటూ ఉంటారు. రేవంత్ రెడ్డి అలాంటి తప్పులు అంతగా చేయడం లేదు.

ఒక పార్టీ అధికారంలోకి వస్తే.. తొలి ఏడాదిలోనే మేనిఫెస్టో మొత్తం పూర్తిచేసేస్తుందని, చేసేయాలని ఎవ్వరూ ఆశించరు. కానీ హామీల గురించి ప్రతిపక్షాలు ప్రతినిత్యం గోలచేస్తూనే ఉన్నాయి. రేవంత్ అన్ని హామీలకు డెడ్ లైన్ల సహా ఒక కార్యచరణ ప్రణాళిక ప్రకటిస్తే.. ప్రతిపక్షాల నోర్లకు తాళాలు పడతాయి. ఆయన ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

# సరోగసీ విషవలయం

సరోగసీ ఒక వ్యాపారంగా విస్తరిస్తోందన్నది బహిరంగ రహస్యమే. ఆధునిక జీవనశైలిలో అనేక మార్పులు రావడం, ఒత్తిళ్లు పెరగడంతో ఆ ప్రభావం యువతను అనేక విధాలుగా వేధిస్తోంది. సంపాదనలో భార్యాభర్తలు ఇద్దరూ నిమగ్నం కావడంతో అప్పుడే సంతానం అక్కరలేదని సరిపెట్టుకొంటున్నారు. కొన్నేళ్ల తరువాత సంతానం పొందాలనుకొనే ఆకాంక్ష కలిగినా సంతాన సాఫల్యం కలగని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దాంతో సంతాన రహితులైన స్వదేశీయులే కాదు విదేశాల్లో ఉన్న ప్రవాస భారతీయులు కూడా కొన్ని లక్షల రూపాయల పెట్టుబడితో ప్రత్యామ్నాయంగా అద్దె గర్భాలను కుదుర్చుకుని సంతానం పొందడానికి తాపత్రయపడడం పరిపాటి అయింది.

అయితే ఇది ఫక్కా వాణిజ్యంగా రూపాంతరం చెందుతోంది. ఎన్ని నిబంధనలున్నా దీనిని నియంత్రించడం కష్టసాధ్యమవుతోంది. ఈ చాటుమాటు వ్యవహారాలు, విషాద సంఘటనలు దేశంలో అక్కడక్కడ జరుగుతున్నా అంతగా బయటపడడం లేదు. రెండు రోజుల క్రితం తెలంగాణలోని రాయదుర్గంలో సరోగసీ గర్భధారిణి నిర్బంధానికి గురై, లైంగిక వేధింపులు భరించలేక తొమ్మిదో అంతస్థు నుంచి దూకి బలవన్మరణానికి బలైపోవడం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. సరోగసీ తెలంగాణలో చాపకింద నీరులా సాగుతోందనడానికి ఈ విషాద సంఘటన సాక్షమవుతోంది. సరోగసీలో నిబంధనల ప్రకారం సమీప బంధువుల నుంచి మాత్రమే అద్దెగర్భం ప్రక్రియలో సంతానాన్ని పొందవలసి ఉంటుంది. కానీ నిబంధనలు ఏవీ పాటించకుండా నిరుపేద మహిళలకు కొంత నగదు ముట్టజెప్పి పిల్లలను ప్రసవింప చేసుకోగలుగుతున్నారు. కొన్ని సాఫల్య కేంద్రాలు, ప్రైవేట్ ఆస్పత్రులు ఈ అద్దెగర్భాల ప్రక్రియను భారీ వాణిజ్య రాకెట్‌గా సాగిస్తున్నాయి. సరోగసీ ద్వారా సంతానం పొందాలనుకుంటే కొన్ని నిబంధనలు చట్టంలో రూపొందించారు. దంపతులకు పెళ్లయి ఐదేళ్లు నిండాలి. వీరికి గతంలో పిల్లలు కానీ, దత్తత తీసుకున్న సంతానం కానీ ఉండకూడదు. భర్తకు 26 55, భార్యకు 25 50 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. దంపతుల్లో ఒకరికి సంతాన వైఫల్యం సమస్య ఉన్నట్టు జిల్లా మెడికల్ బోర్డు ధ్రువపత్రం అవసరం.

జన్మించిన బిడ్డ సంరక్షణ హక్కులకు మేజిస్ట్రేట్ అనుమతి తీసుకోవాలి. గర్భాన్ని అద్దెకిచ్చే మహిళ వివాహితురాలై ఉండడమే కాదు, ఒక బిడ్డకు జన్మనిచ్చి ఉండాలి. ఒకసారి మాత్రమే అద్దెగర్భం పొందే అవకాశం ఉంటుంది. అదీ సమీప బంధువులకు మాత్రమే ఇవ్వాలి. ప్రసవానంతరం ఆ మహిళకు 16 నెలల బీమా సౌకర్యం కల్పించాలి. ఇన్ని నిబంధనలు ఉన్నా ఇవేవీ పట్టించుకోకుండా దళారీ వ్యవస్థ ద్వారా అద్దె గర్భాలను కుదుర్చుకుంటున్నారు. ఒకప్పుడు హైదరాబాద్, విజయవాడ కేంద్రాలుగా సాగిన సరోగసీ వ్యవహారం రానురాను తెలంగాణ గ్రామీణ ప్రాంతాలకు కూడా ప్రాకింది. ఐదేళ్ల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల్లో సరోగసీ దందా వెలుగు చూసింది.

పేద గిరిజన మహిళలకు లక్షల రూపాయలు ఆశ చూపి



వారిని పావులుగా వాడుకున్నారు. భువనగిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సరోగసీ కోసం సుమారు 100 మంది మహిళలను గుట్టుగా ఉంచగా, ఓ మహిళ బయటపడడంతో ఆ వ్యవహారమంతా వెలుగులోకి వచ్చింది. చిన్న వయసులో వివాహాలు జరిగి పిల్లలు పుట్టిన యువతులను సరోగసీకి ఎంపిక చేసుకుంటున్నారు. వారికి తొలుత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆ తర్వాత సరోగసీకి బలవంతంగా ఒప్పిస్తున్నారు. అయితే ఇది వికటించి కొందరు మహిళలు అనారోగ్యానికి గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. బలవంతంగా వివాహితలను ఈ రొంపిలోకి లాగినట్టు కొన్ని కేసులు కూడా పోలీస్ స్టేషన్లలో నమోదయ్యాయి. థాయ్‌లాండ్, నేపాల్, మెక్సికో, కంబోడియాలతో పాటు భారత దేశం కూడా సరోగసీని నిషేధించిన తరువాత ఉక్రెయిన్, జార్జియా, లావోస్, మలేసియా, అర్జెంటీనా, కొలంబియా, నైజీరియా, కెన్యా, దక్షిణాఫ్రికా వంటి దేశాలకు సరోగసీ మార్కెట్ విస్తరించింది. భారత దేశంలో 2010లో సరోగసీ నియంత్రణ ముసాయిదా బిల్లు తయారైంది. 2019 లో సరోగసీ నిషేధ చట్టాన్ని లోక్‌సభ ఆమోదించింది.

2021లో సరోగసీ (నియంత్రణ) చట్టం ఆమోదం పొందింది. అంతవరకు భారతదేశం ప్రముఖ సరోగసీ గమ్యస్థానంగా ఉండేది. అనైతిక విధానాలు సాగేవి. అద్దె తల్లుల ఒప్పందాలు తక్కువ ఖర్చుతో సులువుగా జరిగేవి. విదేశాల్లో ఉండే సంతాన యోగం లేని వారు భారత దేశానికి వచ్చి అద్దె తల్లుల ద్వారా సంతానాన్ని సులువుగా పొందగలిగే వారు. 2009లో గుజరాత్‌లో 45 మంది సరోగసీ తల్లులను అధ్యయనం చేయగా, సంతానం పొందాలనుకున్న తల్లిదండ్రుల్లో 41% మంది విదేశాల నుంచి వచ్చారని తేలింది. అద్దె తల్లులు కావాలనుకునే మహిళలు తాము తీసుకునే రిస్కుకు తగినట్టు పారితోషికం చెల్లించాలన్న డిమాండ్ ఆయా కుటుంబాల నుంచి ఎక్కువగా తెరపైకి వచ్చింది.

ఈ విషయంలో స్వదేశీయులు కన్నా విదేశాల నుంచి వచ్చిన తల్లిదండ్రులే ఎక్కువగా చెల్లిస్తున్నారు.ప్రస్తుతం భారత ప్రభుత్వం పరోపకార సరోగసీని మాత్రమే నిబంధనల ప్రకారం అనుమతిస్తుంది. ఇందులో వాణిజ్యపరంగా ఆర్థిక లావాదేవీలు వంటివి ఉండకూడదు. ఇది చట్టబద్ధంగా వివాహం చేసుకున్న సంతానం లేని దంపతులకు మాత్రమే పరిమితం చేయబడింది. కానీ ఇప్పుడు కేవలం ధనార్జనే ధ్యేయంగా అమాయకులైన యువతులను పావులుగా దళారులు వాడుకుంటున్నారు. అందుకనే ఈ సరోగసీ రాకెట్‌లో ఇరుక్కున్న మహిళలకు స్వేచ్ఛలేక, ఆరోగ్య భద్రత లేక వారి భవిష్యత్ విషాద గాథలుగా మిగిలిపోతున్నాయి.

# బీజేపీ నుంచి షిండే, అజిత్‌ల ఎగ్జిట్ ఎన్నడు?

మహారాష్ట్ర అసెంబ్లీలో మొత్తం స్థానాలు 288. కనీస మెజారిటీ 145. ప్రస్తుతం బీజేపీకి సొంతంగా 132 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. శివసేన (షిండే) పార్టీ తరఫున గెలిచన వారి సంఖ్య 57. ఎన్సీపీ (అజిత్) పార్టీ తరఫున 41 మంది గెలిచారు. ప్రస్తుతం బీజేపీ ఫార్ములా ప్రకారం.. సీఎం సీటు బీజేపీ నేతకు, షిండే, అజిత్ లకు డిప్యూటీ సీఎం పదవులు అని అంటున్నారు. మొన్నటి వరకూ షిండేకు డిప్యూటీగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్ సీఎం అవటం దాదాపు ఖాయమైంది. గతంలో తను సీఎంగా వ్యవహరించినప్పటికీ ఫడ్నవీస్ అవసరార్థం ఆ తర్వాత షిండేకు డిప్యూటీగా చేశాడు కాబట్టి, ఇప్పుడు షిండే ఆయనకు డిప్యూటీగా చేయడంలో పెద్ద ఘోరం ఏమీ లేదనేది బీజేపీ థియరీ. ఇక రెండవ డిప్యూటీ సీఎం పాత్రను అజిత్ పవార్ మరోసారి పోషిస్తాడు. అజిత్‌కు ఈ సర్దుమాటు సరే.. కానీ షిండే లోనే అసంతృప్తి ఉంది. మోడీ, షాలు ఏది చెబితే అది అని అంటున్నారాయన. కానీ శివసేనను చీల్చుకొచ్చినప్పుడు తనను సీఎంగా చేశారు కాబట్టి, ఇప్పుడు కూడా తననే సీఎంగా చేయాలనే డిమాండ్ ఆయన వైపు నుంచి వినిపించింది. ఇలాంటి డిమాండ్ చేసినందుకే కదా.. ఉద్ధవ్ ఠాక్రేని బీజేపీ దెబ్బతీసిన విషయం షిండేకు తెలియనిది కాదు!

రాజీ పడటం మినహా షిండేకు మరో మార్గం లేదు. ఆయన ఆ మాత్రం లౌక్యం తెలియనివాడూ కాదు. అయితే సీఎం హోదాలో ఉన్నప్పుడే షిండే పలు సార్లు అలిగాడు. తనను సీఎంగా కూర్చోబెట్టి మొత్తం బీజేపీ వాళ్లు ఆడుకుంటున్నారనే ఆక్రోశం ఆయనలో గతంలోనూ ధ్వనించింది. ఒక దశలో ఆయన అలిగి వెళ్లిపోయారనే ప్రచారమూ జరిగింది. సీఎంగా తను ఉండగా.. కేబినెట్ గురించి అయినా, మరో విషయంలో అయినా డిప్యూటీ సీఎం ఢిల్లీకి వెళ్లి చర్చించి రావడం గురించి షిండే నొచ్చుకున్నారు! అయితే అప్పుడు అలా నొచ్చుకున్నా పెద్ద మార్పేం కనిపించలేదు. గత్యంతరం లేక బీజేపీతోనే షిండే ఎన్నికలకు వెళ్లారు. మరి ఇప్పుడు ఆయన కొత్తగా

చేయగలిగింది ఏమీ లేదనే చెప్పాలి. ఐతే, షిండే డిప్యూటీ సీఎం తీసుకోకపోవడమే మంచిదని. కావాలంటే కేంద్ర మంత్రి



పదవి, లేదా ఈ కూటమి కన్వీనర్ వంటి పదవి తీసుకుంటే మంచిదని అనేది ఆయన సన్నిహితుల సలహా. అయితే ఏ హోదాలో ఉన్నా, షిండే కు పెద్దగా ప్రాధాన్యత ఉండదనేది మాత్రం నిజం. బీజేపీ తన అవసరార్థమే షిండేకు సీఎం సీటు ఇచ్చింది. అయినా ఇప్పుడు ప్రతీకారం అయితే గట్టిగానే ఉండొచ్చు. బీజేపీ కోరిక మేరకే షిండే శివసేనను చీల్చుకొచ్చారు. బీజేపీతోనే కలిసి సాగుతున్నారు. అయినా షిండేకు చుక్కలు కనిపించడం ఖాయం. పైగా ఇలాంటివి బీజేపీకీ అలవాటైనవే. కాబట్టి తన వద్ద 57 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని షిండే మురిసిపోవాల్సిందేమీ లేదు! వారిలోంచి మరో షిండేను పుట్టించాల్సిన అవసరం కూడా ఇప్పుడు బీజేపీ లేదు. గంప గుత్తగా శివసేనను బీజేపీ లో విలీనం చేసేసుకున్నా అరిచి గగ్గోలు పెట్టే నాథుడు లేడు! బీజేపీ అనుకుంటే.. ఈ విలీనం రోజుల వ్యవధిలో పూర్తవుతుంది. షిండే ఒక్కడూ అప్పుడు గగ్గోలు పెట్టినా పట్టించుకునే వారు ఉండరు. అప్పుడు ఉద్ధవ్ కు నువ్వు నామాలు పెడితే, ఇప్పుడు నీకు బీజేపీ నామాలు పెట్టిందనే మాటే సర్వత్రా వినిపిస్తుంది.

ఇక అజిత్ పవార్ సంగతి సరే సరి. ఆయనకు పెద్దగా ఆశలు లేవు. కేసులు, ఇబ్బందులు లేకపోతే చాలు. మంత్రి పదవి, డిప్యూటీ సీఎం.. హోదాల గురించి పట్టించుకునే పరిస్థితి ఉండదు గతంలో తాము తీవ్ర అవినీతి పరుడుగా చెప్పిన అజిత్ కు బీజేపీ ఎప్పుడో మంచివాడనే సర్టిఫికేట్ ఇచ్చింది. కాబట్టి.. బీజేపీ ప్రాపకంలో అజిత్ బ్యాలెన్స్ రాజకీయ జీవితం కొనసాగవచ్చు! అది ఆయన అదృష్టం. కానీ, అజిత్ ను బీజేపీ వదిలించుకోవాలనే డిమాండ్ కమలం పార్టీలోని ఒక వర్గం నుంచి వినిపిస్తూ ఉంది. అవసరానికి తీసుకున్నారు సరే, ఇప్పుడు అతడి అవసరం లేదని, ఇక శంకరగిరి మాన్యాలు పట్టించాలని ఈ వర్గం వాదిస్తూ ఉంది. కాబట్టి.. అజిత్ వీలైనంతా సాగిలా పడటమే మిగలవచ్చు!

ఏదేమైనా, మహారాష్ట్ర రాజకీయాల్లో షిండే, అజిత్ పేర్లు ఇక వీలైనంత తక్కువగా, వీలైనంత చిన్నగా వినిపిస్తాయి. వచ్చే ఎన్నికల నాటికి వీరిని రాజకీయ చిత్రం నుంచి వీరి ప్రాధాన్యత తగ్గుతుంది. అసలు వీరొకరు ఉన్నారనే విషయాన్ని ప్రజలు, పరిశీలకులు కూడా పట్టించుకోని పరిస్థితి రావచ్చు.

# తెలంగాణ రాజకీయ చరిత్రపై చెరగని సంతకం

తెలంగాణ తొలి దశ ఉద్యమ సారథి.. రెండు సార్లు ముఖ్యమంత్రి పదవి.. సుదీర్ఘ కాలం పాటు గవర్నర్ బాధ్యతలు.. చిన్న వయసులోనే మంత్రి హోదా... ఆయనే డాక్టర్ మర్రి చెన్నారెడ్డి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై చెన్నారెడ్డి వేసిన ముద్ర చాలా ప్రభావవంతమైనది. రాజకీయ దురంధరుడిగా.. పాలనాదక్షుడుగా ఆయన నడిచిన బాట అనితర సాధ్యం. తెలంగాణ రాష్ట్ర సాధనకు కారణభూతుడు కూడా ఆయనే. 1969 ఉద్యమాన్ని పతాక స్థాయికి చేర్చి.. మలిదశ ఉద్యమానికి మార్గం సుగమం చేశారు డాక్టర్ చెన్నారెడ్డి. 1971 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్) అఖండ విజయం సాధించినప్పటికీ, సీపీఐ నేత ఎస్ఏ డాంగే సలహాతో ఇందిరాగాంధీ రాష్ట్ర ఏర్పాటుకు నిరాకరించారని చెబుతారు. కొన్ని రక్షణలను హామీగా పొందడంతో సరిపెట్టుకొని, చెన్నారెడ్డి టీపీఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేశారు. చెన్నారెడ్డి, 'తెలంగాణ అభిమాని, నిర్ద్వంద్వంగా తెలంగాణవాది.' చెన్నారెడ్డి మాటలు ఎంతో ప్రేరణాత్మకంగా, ఆసక్తికరంగా, ఉల్లాసంగా ఉండేవని ఆయనను కలిసిన వారు..ఆయన గురించి తెలిసిన వారు చెబుతారు. రాజకీయాలలో ఎదుగుతున్న, ఎదగాలనుకున్న యువ నాయకులకు చెన్నారెడ్డి జీవితం గొప్ప పాఠ్యగ్రంథం. ఆయనకు వున్న రాజకీయ పరిజ్ఞానం, నేతృత్వ లక్షణాలు, సంక్షోభ నిర్వహణలో నైపుణ్యత, క్లిష్టమైన రాజకీయ పరిస్థితుల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించే తీరు ఇతరులలో అరుదుగా కనిపిస్తుంది. 1950లో ప్రొవిజనల్ పార్లమెంట్‌కు నామినేట్ కావడం, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ విప్‌గా నియమితులవడం కాక ముందు, చెన్నారెడ్డి మూడు సంవత్సరాలు వైద్యవృత్తిలో వున్నారు. చిన్ననాటి నుంచి డాక్టర్ కావాలని కలగన్న చెన్నారెడ్డి తన 22వ ఏట ఎంబీబీఎస్ పట్టా తీసుకోవడం ద్వారా ఆయన కల నెరవేర్చుకున్నారు. ఆ తర్వాత వరంగల్ గాంధీ ఆస్పత్రిలో ప్రభుత్వ డాక్టర్ గా నియమితులయ్యారు. ఉద్యోగంలో చేరిన రెండు నెలల్లోనే రాజీనామా చేసి హైదరాబాద్ లో సొంతంగా రెండు హాస్పిటళ్లు ఏర్పాటు చేసి వైద్యం చేయడం మొదలుపెట్టారు. రెండేండ్ల తర్వాత ఆ రెండు హాస్పిటళ్లను మూసివేసి, తన జీవితాన్ని దేశ రాజకీయాలకు అంకితం చేశారు. 30 సంవత్సరాలు పీసీసీ వర్కింగ్ కమిటీ సభ్యునిగా ఉన్నారు. పార్లమెంటులో హైదరాబాద్ లోని విషమ పరిస్థితులను గురించి చెన్నారెడ్డి చేసిన ప్రసంగాలు నెహ్రూ,



రాజాజీ వంటి వారిని ఆకర్షించాయి. దీంతో చెన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీ విప్ గా ఎన్నికయ్యారు.

1952లో, హైదరాబాద్ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికై, బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 1967 సాధారణ ఎన్నికల తరువాత, ఇందిరాగాంధీ కేంద్ర కేబినెట్‌లో చేరమని సూచించినప్పటికీ, ముఖ్యమంత్రిగా కొనసాగడానికే మొగ్గుచూపిన బ్రహ్మానందరెడ్డి తనకు బదులుగా చెన్నారెడ్డి పేరును ప్రతిపాదించారు.

ముల్కీ ఉద్యమాన్ని నడిపేందుకు 'తెలంగాణ ప్రజా సమితి' (టీపీఎస్)ను స్థాపించిన ఏ.మదన్‌మోహన్, తన అధ్యక్ష స్థానాన్ని చెన్నారెడ్డికి అప్పగించారు. ఇది చెన్నారెడ్డి నేతృత్వ సామర్థ్యాలను, నాయకత్వ పటిమను ప్రజలు తెలుసుకోవడానికి, తరువాత జరిగిన 1971 లోక్‌సభ, 1978 అసెంబ్లీ, 1980 లోక్‌సభ, 1989 లోక్‌సభ అసెంబ్లీ ఎన్నికలలో 'భారీ విజయాలు' సాధించడానికి మార్గం సుగమం చేసింది. ఈ విజయాల వల్ల చెన్నారెడ్డి 'అద్భుతమైన నాయకత్వ నైపుణ్యం' ఉన్న వ్యక్తిగా నిరూపితమయ్యారు. ఎన్టీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, జైలు భరో కార్యక్రమం అద్భుతంగా ఆయన నిర్వహించడంతో రాష్ట్ర కాంగ్రెస్‌ను ఉత్తేజపరిచాయి. 1989 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ 294 సీట్లలో 181 సీట్లు గెలుచుకుంది. డాక్టర్ చెన్నారెడ్డి రెండవ సారి ముఖ్యమంత్రి అయ్యారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి వంటి వ్యక్తులు రాజకీయాల్లోకి రావడం తెలంగాణ ప్రజల భాగ్యం. తెలంగాణ ఉద్యమానికి ఆయన దిశానిర్దేశర, నాయకత్వ నైపుణ్యం, ప్రజలతో సన్నిహితంగా మమేకం కావడం వంటి ప్రత్యేకతలు ఆయనను అసాధారణ నేతగా నిలిపాయి. రాజకీయ చతురతతోనూ, ప్రగతిశీల ఆలోచనలతోనూ, అత్యున్నత ప్రజాసేవా దృక్పథంతోనూ ఆయన తన సేవలు అందించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర అపూర్వం, అపురూపం. దీనిపై రెండో మాట లేదు. వర్తమాన తెలంగాణ విజయగాథలో చెన్నారెడ్డి స్ఫూర్తి ప్రతిబింబిస్తున్నది. ఆయన విలువలు, ఆలోచనల నుంచి మనం ఎన్నో, ఎన్నెన్నో పాఠాలు నేర్చుకోవాలి. మర్రి చెన్నారెడ్డి లేకుండా తెలంగాణ ఉండేది కాదు. అందుకే ఆయన చిర స్మరణీయులు. తెలంగాణ రాజకీయ చరిత్రలో చెరగని సంతకం.

**(డిసెంబర్ 2- మర్రి చెన్నారెడ్డి వర్ధంతి)**




# హయత్ నగర్ హైవే రోడ్డు మధ్యలో నిల్చిపోయిన రోడ్డుకు మోక్షం

**-స్థల యజమానులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించిన కార్పొరేటర్**

**వెలుతురు, హయత్ నగర్,డిసెంబర్ 2:**
జాతీయ రహదారి హయత్ నగర్ ఆర్టీసీ కాలనీ వద్దప్రధాన రహదారి మధ్యలో నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. సోమ వారం రోడ్డు విస్తరణలో స్థలాన్ని కోల్పోతున్న బాధితులతో స్థానిక కార్పొరేటర్ చేసిన ప్రయత్నం కు మార్గం సుగమమైంది.

జాతీయ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా హయత్ నగర్ ఆర్టీసీ కాలనీ వద్ద సమాధులు ఉండడంతో చాలా రోజులుగా రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి చోరువతో స్థల సంబంధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి స్థలం నష్టపరిహారాన్ని అధికారులచే అందించి రోడ్డు నిర్మాణానికి వారిని ఓపించారు, దీంతో వెంటనే రోడ్డు మధ్యలో నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేయాలని హైవే రోడ్డు సంబంధిత అధికారులకు కార్పొరేటర్ జీవన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఎల్ బి నగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి

**- జోనల్ కమిషనర్ కార్యాలయం ముందు సిపిఐ ధర్నా**

**- జోనల్ కమీషనర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్**

**వెలుతురు, ఎల్ బి నగర్, డిసెంబర్ 2:**
ఎల్ బి నగర్ నియోజక వర్గంలో పలు డివిజన్లలోని అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని కోరుతూ సోమ వారం నాడు భారత కమ్యునిస్టు పార్టీ (సిపిఐ) ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి ఆద్వర్యంలో జోనల్ కమీషనర్ ఆఫీసు




ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రా చారి మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న జోనల్ కమిషనర్ ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ సిపిఐ సహాయ కార్యదర్శి బాతరాజు నరసింహ,మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ప్రమిదా పార్టీ నాయకులు,శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# బి ఎన్ రెడ్డి నగర్‌లో మహా శివ పడి పూజ కార్య క్రమం- పాల్గొన్న ఎంఎల్ ఏ

**వెలుతురు, వనస్థలిపురం, డిసెంబర్ 2:**
బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని శ్రీమల్లికార్జున భక్తసమాజం ఆధ్వర్యంలో శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శివ గురుస్వామి,ముద్దగౌని సతీష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో శివ మహాపడిపూజ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ



కార్యక్రమంలో పరమేశ్వరునికి మహా రుద్రాభిషేకం పంచామృతాలతో అభిషేకం కార్య క్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్ రెడ్డి, బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డిలతో పాటు పలువురు భక్తులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అతి వేగంగా బైక్ నడుపుతూ వ్యక్తిని ఢీ కొట్టి పరారైన యువకుడు

**స్థానిక గాయిత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భాదితుడు**

**లైసెన్స్ లేని యువకునిపై కేసు నమోదు**


**శంకర్‌పల్లి వెలుతురు డిసెంబర్ 2:** అతి వేగంగా బైక్ నడుపుతూ వ్యక్తిని ఢీ కొట్టి పరారైన యువకుడు స్థానిక గాయిత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భాదితుడు. శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుందరయ్య తెలిపిన వివరాల ప్రకారం గత నెల 28వ తేదీన స్థానిక బేస్త సత్యం (50), స్థానిక చౌరస్తా నుండి ఇంటికి వెళుతుండగా శంకర్ పల్లి నుండి హైద్రాబాదు రోడ్డు గుండా అతి వేగంగా వెళుతున్న అజయ్ (19) అనే యువకుడు సత్తయ్య ను బైక్ తో ఢీ కొట్టి పరారయ్యాడని తెలిపారు. విషయం తెలిసి వెంటనే భాదితుని బంధువులు సత్తయ్యను స్థానిక గాయిత్రి ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారని, కాగా సత్తయ్య తలకు తీవ్రమైన గాయం జరికి తల లోపల రక్తస్రావం జరగడమే కాక కుడి భుజం విరిగిందన్నారు. కాగా అజయ్ స్థానిక ఆస్ట్రా డయాగ్నొస్టిక్ సెంటర్ లో ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేస్తున్నాడని తెలిపారు. ఈ మేరకు డ్రైవింగ్ లైసెన్సు కూడా లేని అజయ్ పై కేసు నమోదు చేశామని, త్వరలో బైక్ ను సీజ్ చేసి అజయ్ పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా రోజు చేపలు అమ్ముకుంటే తప్ప తమకు పూట గడవదని సత్తయ్య భార్య రేణుక ఆవేదన వ్యక్తం చేశారు.



# కానిస్టేబుల్ నాగమణిది పరువు హత్య - భూ వివాద హత్య!

**-నాగమణి హత్యలో ప్రధాన నిందితుడు తమ్ముడు పరమేష్**

**- మృతురాలు పోలీస్ డిపార్ట్మెంట్ వ్యక్తి కావడంతో కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు**






**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, డిసెంబర్ 2:**
రంగారెడ్డి జిల్లా రాయపోల్ గ్రామ సమీపంలో జరిగిన కానిస్టేబుల్ నాగమణి హత్య పరువు హత్యన లేక భూ వివాదమా అని తెలియవాల్సుంది కాగా నాగమణి హత్య ఉద్దంత వివరాల ప్రకారం హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ నాగమణి (27) ని స్వయానా తమ్ముడు పరమేష్ కాలయముడయ్యాడు, కానిస్టేబుల్ నాగమణి హత్య ఉద్దతం ప్రకారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నం మండలం రాయపోల్ గ్రామానికి సమీపంలో ఆమె హత్య జరిగింది, సోమ వారం రాయపోల్ గ్రామం నుండి తాను విధులు నిర్వహిస్తున్న హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లే దారిలో తాను స్కూటీ పై వెళ్తున్న సమయంలో నాగమణి తమ్ముడు పరమేష్ కారు తో బైక్ ను ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే పడిపోవడం తో పరమేష్ కత్తి తో దాడి చేసి హత మార్చాడు.

దీంతో ఈ హత్య సంఘటన ఇబ్రహీం పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాయపోల్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ తో నాగమణి పరిచయం ఏర్పడింది. కాగా ఆమె గతంలోనే పెళ్లి అయింది. విడాకుల అనంతరం తన క్లాస్ మేట్ అయిన శ్రీకాంత్ ను గత నెల 10 న యాదగిరి గుట్ట లో వివాహం చేసుకుంది.

దీంతో నాగమణి తమ్ముడు పరమేష్‌కు ఈ వివాహంతో కోపోద్రిక్తుడైన పరమేశ్ సోమ వారం దారి కాచి కత్తితో దాడి చేసి హత మార్చినట్లు గా తెలిపారు. ఈ హత్యపై పూర్తి సమాచారం సేకరించేందుకు దర్యాప్తు చేస్తున్నట్లుగా ఇబ్రహీం పట్నం పోలీసులు వెల్లడించారు. కానిస్టేబుల్ నాగమణి హత్యకేసు పరువు హత్య లేక భూ వివాదం నేపథ్యంలో జరిగిందా తెలియవాల్స వుంది. కాగా ఈ హత్యకేసులో మృతురాలు పోలీస్ డిపార్ట్మెంట్ కు సంబంధించిన వ్యక్తి కావడంతో పోలీసులు కేసు ను తీవ్రంగా పరిగణించి దర్యాప్తు ప్రారంభించారు. కాగా తమకు న్యాయం చేయాలంటూ నాగమణి భర్త శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో పాటు బంధువులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగడంతో పోలీ సులు రంగంలోకి దిగి ఏలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. అలాగే మృతురాలి స్వగ్రామం తో పాటుగా భర్త శ్రీకాంత్ గ్రామం ఒకే ఊరు రాయపోల్ కావడంతో గ్రామంలో విషాదంతో పాటు వివాదం జరుగకుండా ఉండేందుకు పోలీసులు కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేశారు.

# శాస్త్రీయ కళారూపాలను ప్రోత్సహించాలి

**-విశ్రాంత న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్**

**వెలుతురు కాచిగూడ డిసెంబర్ 02:** శాస్త్రీయ కళారూపాలను ప్రోత్స హించడం భవిష్యత్ తరాలకు ఎం తో అవసరమని విశ్రాంత న్యాయ మూర్తి బూర్గుల మధుసూదన్ అన్నారు. విశ్వ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రపంచ నాట్య దినోత్సవం పురస్క రించుకొని 'భారతీయనాట్యకళా వైభవం' పేరిట మెగా వరల్డ్ రికార్డ్ నమోదుకై 200 నిమిషాల్లో 200 మంది నాట్య కళాకారులతో నృత్య కళ ప్రదర్శన త్యాగరాయగానస భలో వైభవంగా నిర్వహించారు. నృత్య ప్రదర్శనలో వివిధ ప్రాంతా లకు చెందిన నృత్య కళాకారులు పాల్గొని కూచిపూడి, భరతనాట్యం వివిధ కళ రూపా ల ప్రదర్శనను అద్భుతంగా ప్రదర్శించి ఆకట్టుకు న్నారు. అనంతరం జరిగిన కార్యక్ర మానికి మధుసూదన్ హాజరై చిన్నా రులకు ప్రశంస పత్రం అందజేసి, మాట్లాడారు. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచ దేశాలకే ఆ దర్శమన్నారు. సంస్థ నిర్వాహకులు డాక్టర్ రంజిత్ ఏ కార్యక్రమం చేసిన ఎంతో వినూత్నంగా ఉంటుందని అ న్నారు. ఆయన దశాబ్దాల పాటు క ల్లి, కళాకారులను ప్రోత్సహించ డం అభినందనీయమని కొనియా డారు. ఈ కార్యక్రమంలో జెవన్ రాజేంద్ర, మూ సా అలీఖాన్, ఎన్. బిక్కునాథ్ నాయక్, విరాభోగవ సంతరాయలు, కటకం భాస్కర్ గుప్తా, రాఖీ, విజయ, మధు, ప్ర ముఖ నాట్య గురువులు ప్రశాంతి, భరణి, రమేష్, అనూష, తేజశ్రీ, కల్పనా, గోపి, రచ్చ నరేష్, రవికు మార్, రంగచార్యులు, కృష్ణ ప్రియా, అశ్వని, ఇతర ప్రముఖులు కన్నీగం టిఉపేంద్ర, రాళ్లబండి రామా రావు, ఖాన్ మెయి నిద్దీన్, జాన్ సైదా, కొద్ది చర్ల రమేష్, శ్రీనివాస రావు, చంద్రశే ఖర్, సిద్ధం శెట్టి శ్రీకాంత్, శ్రీ హర్ష, శ్యాంసుందర్, రమేష్ తేజ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.







# కాంగ్రెస్ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు..

**6 గ్యారంటీలు అమలు చేయలేదు: చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం**

**శంకర్‌పల్లి వెలుతురు డిసెంబర్ 2:**
కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఎక్కడా అమలు చేయలేదని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ కేఎస్ రత్నం, రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కమిటీ (దిశ) సభ్యులు ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా శంకర్‌పల్లిలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలనుమోసగిస్తున్నదని విమర్శించారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుంటే రాష్ట్ర ప్రజలే కాంగ్రెస్ కు ఘోరీ కడతారని హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ నెరవేర్చలేక పోయిందని మండిపడ్డారు. ఏడాది పాలనలో ఏం చేశారని విజయోత్సవాలు చేస్తున్నారని ప్రశ్నించారు. రైతుభరోసా, తులం బంగారం, రూ. 4 వేల పెన్షన్ ఏమయ్యాయని నిలదీశారు. మహిళలకు నెలకు రూ. 2,500 సాయం చేస్తామని చెప్పి మాట తప్పారన్నారు. ఇప్పటివరకు ఒక్కొరికి రూ.27,500 ప్రభుత్వం బాకీ పడిందని వివరించారు. హామీలను అమలుచేయకపోతే ప్రజలు ప్రభుత్వాన్ని క్షమించరని హెచ్చరించారు. హామీల అమలుపై కాంగ్రెస్ ను ప్రజలు నిలదీయాలని కోరారు.

మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను స్థానికులకు ఇవ్వకుండా నగర వాసులకు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అన్నారు. కార్వాన్, యాకూత్ పుర నియోజక వర్గంలోని మైనార్టీలకు డబుల్ బెడ్ రూమ్ లను కేటాయిస్తే, స్థానికంగా పట్టణంలో నివసించే నిరుపేద మైనార్టీలు ఇండ్లు లేకుండా ఏం కావాలని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాములు గౌడ్, మున్సిపల్ ఇంచార్జ్ వాసుదేవ్ కన్నా, మున్సిపల్ అధ్యక్షుడు సురేష్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, నాయకులు బయన్న, రాజ్ కుమార్, కిషన్ నాయక్, బాబు నాయక్ ఉన్నారు.




# చివరి జీవరాశి ఉన్నంత వరకు పుడమికి చక్రవర్తి శ్రీ రాముడే..

**- బీజేపీ నాయకుడు బాల్ రెడ్డి**

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
శ్రీ రాముడు మర్యాదా పురుషోత్తముడు అని,భూమి ఉన్నంతవరకు దీనికి చక్రవర్తి శ్రీ రాముడు అని బొక్క బాల్ రెడ్డి తెలిపారు అయ్యప్ప దీక్షలో ఉన్న బాల్ రెడ్డి హరి హర క్షేత్రం ఉప్పరపల్లి అయ్యప్ప స్వామి దేవాలయం పీఠానికి రామరాజ్యం ఫౌండేషన్, సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులు భాగ్యనగరం నుంచి అయోధ్య వరకు శ్రీ రామ పాదుకలతో 14 రోజులపాటు నిర్వహించబోయే రామదీక్ష పాదయాత్ర ఆహ్వాన పత్రికను బాల్ రెడ్డి కృష్ణ మామ గురుస్వామి కిట్టు గురుస్వామి రమేష్ గురుస్వామి రాకేష్ గౌడ్ నంగి దేవేందర్ రెడ్డి ఓం రెడ్డి శ్రీధర్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి సందీప్ గౌడ్ ప్రశాంత్ రెడ్డి అజయ్ కాంత్ రెడ్డి వంశీధర్ రెడ్డి గోనె శ్రీకాంత్ కౌశిత్ రెడ్డి నితిన్ తనీష్ అయ్యప్ప భక్తులు అందజేశారు.

హిందూ ధర్మాన్ని,ధర్మానికి ప్రతీకగా నిలిచిన ఆదర్శపురుషుడైన శ్రీ రాముని తత్వం ప్రజల అందరిలో వికసించేలా ఈ పాదయాత్ర ఉండాలి అని ఆయన ఆకాంక్షించారు. పాదయాత్ర,శ్రీ రామ దీక్ష ఎటువంటి ఆటంకం లేకుండా విజయవంతంగా కొనసాగి, అయోధ్యలో బాల రాముని చెంతకు చేరాలి అని ఆయన నిర్వాహకులకి తెలిపారు





# డ్రీమ్స్ స్కూల్ ఉపాధ్యాయునీలకు 'బెస్ట్ టీచర్స్ అవార్డు' ప్రదానం...

**వెలుతురు కాచిగూడ డిసెంబర్ 02:**
అంబర్ పేటలోని డ్రీమ్స్ కిడ్స్ అప్ప ర్ ప్రైమరీ స్కూల్లో విద్యా బోధనలు అందిస్తున్న యం.రమ, ఎ.సంధ్యా రాణి, రేవతిలకు 'బెస్ట్ టీచర్స్ అవా ర్డు లభించింది. అంబర్ పేట మండ ల రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సుందర య్య విజ్ఞానకేంద్రంలో జరిగిన కార్య క్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చే తుల మీదుగా వారు మెమెంటో, శా లువాతో ఘనంగా సన్మానించి, అభి నందనలు తెలిపినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు.మంచి విద్య ను అందించడంలో ప్రైవేటు విద్యా సంస్థలు చేసిన కృషి అభినందనీ యం అని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయునీలు మాట్లాడు తూ..ఈ అవార్డుతో తమ బాధ్యత మరింత పెరిగిందని, రాబోయే రోజు ల్లో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి మరింత కృషి చేస్తామని ఉపా ధ్యాయునీలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌తో పాటు ఉపాధ్యాయ బృందం పలువురు ప్రముఖులు వా రికి అభినందనలు తెలిపారు. ఈ కా ర్యక్రమంలో కార్పొరేటర్‌లు పద్మ వెంకట రెడ్డి, అమృత, అసోసియే షన్ అధ్యక్షులు జె. రాజశేఖర్ రెడ్డి, కార్యదర్శి రవి, సలహాదారు లు రవి కుమార్, ఉపాధ్యక్షులు నిరంజన్, కోశాధికారి శోభారెడ్డి తదితరులు పాల్గొన్నారు.












# వైభవంగా తెలుగు వర్సిటీ 39వ వ్యవస్థాపన దినోత్సవం

## అంతర్జాతీయ స్థాయిలో తెలుగు విశ్వవిద్యాలయం పనిచేస్తుంది - మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

**వెలుతురు, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా డిసెంబర్ 02:**
తెలుగు విశ్వవిద్యాలయం బాచుపల్లి ప్రాంగణంలోని వంద ఎకరాల విస్తీర్ణంలో గల సువిశాల ప్రాంగణంలో 39వ వ్యవస్థాపన దినోత్సవం సోమవారం వైభవోపేతంగా జరిగింది. తెలుగు భాష, సాహిత్యం, లలితకళలు. సాంస్కృతిక రంగాల అభ్యున్నతికి కృషి చేస్తున్న తెలుగు విశ్వవిద్యాలయం ప్రతియేటా వ్యవస్థాపన దినోత్సవ సందర్భంగా ఆయా రంగాలకు విశేష సేవలందిస్తున్న ప్రముఖునికి విశ్వవిద్యాలయ ప్రతిష్ఠాత్మకమైన విశిష్ట పురస్కారాన్ని అందజేస్తుంది. సాంస్కృతిక రంగానికి ఎనలేని సేవలనందిస్తున్న శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ డా.కె.ఐ.వరప్రసాద రెడ్డి గారికి 2023 సంవత్సరానికి గాను లక్ష రూపాయిల నగదు, ప్రశంసాపత్రంతో విశిష్ఠ పురస్కారాన్ని అందజేశారు.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐ.టి., వాణిజ్యం మరియు పరిశ్రమల శాఖామాత్యుల, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఇంఛార్జ్ మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు వర్సిటీ విశిష్ట పురస్కారాన్ని వరప్రసాద రెడ్డిగారికి ప్రదానం చేసి మాట్లాడుతూ దేశ విదేశాలలో తెలుగుభాష, సాహిత్యం, లలితకళల ఔన్నత్యాన్ని చాటుతున్న తెలుగు విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తుందని అభినందించారు. ఐ.టి., ఫార్మా, సేవారంగాలలో ఉపాధి ఉన్నప్పటికినీ లలితకళా రంగాలలో కూడా ఉపాధిని పొందే విధంగా తెలుగు విశ్వవిద్యాలయం గొప్ప నైపుణ్య శిక్షణా కేంద్రంగా నిలిచినందుకు సంతోషంగా ఉందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర సమాచార, సాంకేతిక మంత్రిత్వ శాఖ నుండి విశ్వవిద్యాలయానికి అన్నివిధాలుగా సాంకేతిక పరమైన సహకారాన్ని అందిస్తుందనీ, తక్షణమే వర్సిటీకి అవసరమైన కంప్యూటర్లను, డిజిటల్ బోర్డులను, సంబంధిత సాంకేతిక పరికరాలను సమకూర్చుతామని హామి ఇచ్చారు. విశ్వవిద్యాలయం ప్రదానం చేస్తున్న విశిష్ట పురస్కారాన్ని పొందిన వరప్రసాద రెడ్డిగారు వ్యక్తి కాదు వైద్య రంగంలో అసమాన కీర్తిని పొందిన శక్తిగా నిలిచారని, పురస్కారానికే ప్రత్యేక గౌరవాన్ని ఆపాదించారని ప్రశంసించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుల ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ బాచుపల్లిలో ఏర్పడిన తెలుగు విశ్వవిద్యాలయ నూతన ప్రాంగణానికై పూర్వ ఉపాధ్యక్షులు, రిజిస్ట్రార్లు చేసిన కృషిని గుర్తుచేస్తూ వారందించిన సేవల ప్రతిఫలమే ఈనాటి ఈ సువిశాల విశ్వవిద్యాలయ ప్రాంగణమని వారికి మనస్పూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగు విశ్వ విద్యాలయం కేవలం రాష్ట్ర విశ్వవిద్యాలయమే కాదని, అంతర్జాతీయ విశ్వవిద్యాలయంగా పనిచేస్తూ అమెరికా, మలేషియా, మారషస్ మొదలగు దేశాలలో తమ అనుబంధ సంస్థలు తెలుగు భాషా సాహిత్య వికాసానికై అవిరళ కృషి చేస్తున్నదని గుర్తుచేశారు. విశ్వవిద్యాలయాన్ని మరింత ప్రగతిపథంలో నడిపించడానికి ప్రభుత్వ సహకారంతో భవిష్యత్ ప్రణాళికలను రూపొందించుకుంటుందని వివరించారు.

పురస్కార గ్రహీత పద్మభూషణ్ డా. కె.ఐ. వరప్రసాద రెడ్డి



తన ప్రతిస్పందనలో మాట్లాడుతూ మన సంస్కృతే తెలుగువారికి బలం, అస్తిత్వం అని వాటిని సమాజంలో కాపాడుకోవడానికి, అవి మరింత పరిఢవిల్లడానికి తెలుగు విశ్వవిద్యాలయం అవసరమని అందుకు ప్రభుత్వ సహకారం వాంఛనీయమని వరప్రసాదరెడ్డిగారు పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రాథమిక పాఠశాలల్లోను, విశ్వవిద్యాలయాల్లోను సంస్కృతి. భాష పట్ల అవగాహన కల్పించాలని అప్పుడే మంచి పౌర సమాజం నెలకొంటుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

వృత్తి పరంగా అందించిన వైద్య సేవల కన్నా ప్రవృత్తి పరంగా తెలుగు భాషా సాహిత్యానికి చేస్తున్న సేవలే నా జీవితానికి సంతృప్తి నిస్తాయని తెలియజేస్తూ, విశ్వవిద్యాలయం అందించిన విశిష్ట పురస్కార నగదుతో పాటు మరో కోటి రూపాయలను వర్సిటీకి అవసరమయ్యే మౌలిక సదుపాయాల నిర్మాణానికై విరాళంగా చెక్కును మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సమక్షంలో విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య నిత్యానందరావుకు అందజేశారు.

ఆత్మీయ అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉన్నతవిద్యామండలి అధ్యక్షులు ఆచార్య వి. బాలక్రిష్ణారెడ్డిగారు ప్రసంగించారు

కార్యక్రమానికి తొలుత విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు అతిథులకు స్వాగతం పలుకుతూ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న కోర్సుల వివరాలను, తెలుగు భాష, సాహిత్యాల ఔన్నత్యాన్ని, వాటి ప్రాభవాన్ని పెంచేందుకు విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపాలిటీ మేయర్ శ్రీమతి కొలను నీలా గోపాల్ రెడ్డి, మేడ్చల్ - మల్కాజ్ గిరి కలెక్టర్, శ్రీ గౌతంపోట్రు ఐఏఎస్, అడిషనల్ కలెక్టర్ రాధిక ఐఏఎస్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్, ఎం.డి. సాబేర్ అలీ లతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు విశ్వవిద్యాలయం ఆత్మీయ సత్కారంతో పాటు చిత్ర, శిల్పకళల విద్యార్థులు చిత్రించిన చిత్రపటాలను అందించారు. విస్తరణ సేవా విభాగం ఇంఛార్జ్ సహాయ సంచాలకుడు రింగురామమూర్తి పురస్కార ప్రదాన కార్యక్రమానికి సమన్వయ కర్తగా వ్యవహరించారు.

### సాంస్కృతిక పదర్శనలు :

తెలుగు విశ్వవిద్యాలయం శిల్పం-చిత్రలేఖన విభాగానికి చెందిన బోధనా సిబ్బంది డా.వెంకటేశం, మహేష్, గ్లోరీ పాల్‌ల ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులు చిత్ర శిల్ప కళా నైపుణ్యంతో విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని అంగరంగ వైభవంగా, అందంగా అలంకరించి తమ కుంచెతో జాలువారిన చిత్రకళా ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. పురస్కార ప్రదానానికి ముందుగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో రంగస్థల కళల శాఖాధిపతి డా. బి.హెచ్. పద్మప్రియ పర్యవేక్షణలో విద్యార్థులు నిర్వహించిన మత్తువదలరా! నాటకం సామాజిక రుగ్మతలను ఎత్తిచూపుతూ తద్వారా జరిగే పరిణామలను విశదీకరిస్తూ సందేశాత్మక ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.

నృత్యశాఖాధిపతి డా. వనజా ఉదయ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి, పేరిణి, ఆంధ్రనాట్య కళారూపాల ప్రద్శరన సభికులను ఎంతగానో అలరించింది.

జానపద కళలశాఖాధిపతి డా. లింగయ్య తన జానపద విద్యార్థులచే డప్పు నృత్యాన్ని ప్రదర్శించారు.

విశ్వవిద్యాలయం విద్యార్థులైన జాతీయ స్థాయి ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీతలైన పేరిణి రాజ్ కుమార్, ఒగ్గు రవి, అందె భాస్కర్ తమ బృందాలతో ప్రదర్శించిన కళారూపాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రముఖ సంగీత కళాకారిణి శ్రీమతి శ్వేతా ప్రసాద్ తన గానామృతంతో సభికులను అలరించింది.




# ప్రజా పాలన విజయోత్సవం

## - మెడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

**వెలుతురు మెడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, 02 డిసెంబర్ 2024:**
ప్రభుత్వం నిర్వహిస్తున్న "ప్రజాపాలన విజయోత్సవం" కార్యక్రమాల్లో భాగంగా ఆరోగ్య వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయి.

సోమవారం రోజున కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ గౌతమ్ పొత్రు, ఐఏఎస్ గారు, అర్బన్ లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ కుమారి రాధిక గుప్తా, ఐఏఎస్‌తో మెడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి గారిచే ప్రారంభించే కార్యక్రమలో పాల్గొన్నారు అలాగే, 2024 నుండి ప్రారంభమవుతున్న కొత్త పారామెడికల్ కోర్సులుడిప్లొమా ఇ ఇసిజి టెక్నాలజీ (డిఇసిజి), డిప్లొమా ఇ మెడికల్ స్టెరిలైజేషన్ మరియు ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ (డిఎంఎస్టి)ప్రారంభించబడ్డాయి.

మల్కాజ్గిరిలోని మెడ్చల్ మల్కాజ్‌గిరి ప్రభుత్వ వైద్య కళాశాల/ఆసుపత్రి ప్రాంగణంలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైత్రి క్లినిక్ ప్రారంభించబడింది. ఈ క్లినిక్ వారంలో రెండు రోజులు సేవలు అందించి, ట్రాన్స్‌జెండర్ సమాజానికి సమగ్ర ఆరోగ్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషించనుంది.

ఈ సందర్భంగా శ్రీ గౌతమ్ పొత్రు, ఐఏఎస్ గారు మాట్లాడుతూ, "ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం మరియు విద్యా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి కట్టుబడి ఉంది. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల స్థాపన, కొత్త పారామెడికల్ కోర్సుల ప్రారంభం జిల్లా యువతకు అధిక శిక్షణను అందించడం మాత్రమే కాకుండా, సమాజానికి అధునాతన ఆరోగ్య సేవలను అందించడంలో సహాయపడుతుంది" అని తెలిపారు.


కళాశాల విద్యార్థులను ఉద్దేశించి, ఆయన మాట్లాడుతూ, "ఈ అవకాశాలు మీ భవిష్యత్‌కు మేల్కొలుపు గానే కాకుండా, సమాజానికి సేవ చేయడానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి దోహదం చేస్తాయి. ఈ అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకొని, మీ సేవలతో సమాజానికి మేలు చేయండి" అని ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమం గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, కుత్బుల్లాపూర్ (ఈసిఐఎల్ ఎక్స్ రోడ్) ప్రాంగణంలో నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో ప్రముఖ అధికారులు పాల్గొన్నారు: డా. టి. రఘునాథ స్వామి, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి, డా శోభ రాణి , ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిని మల్కాజ్గిరి డివిజన్ , డా. వంశీ కృష్ణ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల, శ్రీమతి కె.సంపూర్ణ , ప్రిన్సిపాల్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, శ్రీమతి డి.జయంతి, వైస్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప భక్తులతో పావనమైన పాలకుర్తి సోమేశ్వరాలయం

**మద్దిరాల, వెలుతురు:**
సోమవారం పాలకుర్తి పట్టణ కేంద్రంలోని స్వయంభు శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని మద్దిరాల మండల పరిధిలోని గుమ్మడవెళ్లి గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు దర్శించుకున్నారు.. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా గురు స్వామి వర్రె మధు మాట్లాడుతూ.. పూర్వం భారతదేశంలో అనేక ప్రదేశాలు పచ్చని వృక్షాలు, నదీనదాలు, కొండల నడుమ ప్రకృతి సంపదతో దేవాలాయం కళకళ లాడేదని కొనియాడారు.. సాక్ష్యాత్తు ఆ సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామినే ఆయనను దర్శించుకున్న భక్తుల కోరికలను తీరుస్తాడని కొడియాడు.. 1200, 1300 సంవత్సరాల క్రితం ఇక్కడ ఋషులు తపస్సు చేసేవారని, వారికి ప్రత్యక్షమయిన సోమేశ్వరుడు వారి కోరికపై భక్తజనులనాదరించటానికి స్వయంభూగా ఇక్కడ వెలిశాడనీ తెలిపారు... సప్త ఋషుల



కోరికపై సోమేశ్వరుడు ఇక్కడ వెలిశాడని మన పూర్వికులు చెప్పుకుంటారన్నారు.. ఈ గుహాలయంలో అమ్మవారిని కూడా దర్శించవచ్చుకోవచ్చన్నారు.. వారు కూడా అమ్మవారిని దర్శనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.. తెలంగాణలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రాలల్లో పాలకుర్తి స్వయంభు శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉన్నదని కొనియాడారు.. సోమవారం వస్తే భక్తుల రద్దీతో ఆలయం కిటకిటలాడుతుందన్నారు.. సుమారు వంద కిలో మీటర్ల దూరంలో ఉన్న తమ ఊరి నుండి వెళ్లి స్వామి వారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా.. మనసు నిశ్చలంగా అనిపించిందన్నారు మధు గురు స్వామి.. స్వామి వారిని దర్శించుకున్న వారిలో వల్లపు నరేష్ స్వామి, కంచుకట్ల రాము స్వామి, చింటూ స్వామి, వీ రాము స్వామి, వల్లపు శివ స్వామి తదితరులు ఉన్నారు.

# ఎస్టీ బాలుర వసతిగృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్‌డిఓ

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి సోమవారం ఎస్టీ బాలుర వసతి గృహాన్ని అస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు వసతి వసతి గృహ పరిసరాలను, వంటగదిని, సామాగ్రి గదిని మరియు మరుగుదొడ్లను పరిశీలించినారు. సామాగ్రి గది యందు విద్యార్థులకు అందజేస్తున్న భోజన సరుకుల నాణ్యతను పరిశీలించారు.

విద్యార్థులకు అందజేస్తున్న అన్నం, పప్పు, కూరగాయలు, గుడ్లు, మరియు మజ్జిగ యొక్క నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు నివసిస్తున్న ప్రతి గదిని సందర్శించి గదులలో ఉన్న విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్యం గురించి మాట్లాడుతూ వైద్య పరీక్షలు నెలవారీగా జరుగుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకోవడం జరిగింది. వసతి గృహ వంట





సిబ్బందితో మాట్లాడి పిల్లలకు వండే ఆహారాన్ని పూర్తి పరిశుభ్ర వాతావరణంలో వండి, వేడిగా ఉన్నప్పుడే విద్యార్థులకు అందజేయవలసిందిగా ఆదేశించడం జరిగింది.



# ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది

**రాజేంద్రనగర్ వెలుతురు డిసెంబర్ 02:**
కాంగ్రెస్ పార్టీఆరు గ్యారెంటీలు 60 పథకాల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి నెరవేర్చకపోగా విజయోత్సవం నిర్వహిస్తున్నటువంటి కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎండగాడుతూ ఉప్పరపల్లి రాజేందర్ నగర్ డివిజన్ రాజేంద్రనగర్ అసెంబ్లీ భారతీయ జనతా పార్టీ తరపున %=ఋా% గారికి ఛార్జషీట్ ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు బొక్క నరసింహారెడ్డిఅంజన్ కుమార్, తోకల శ్రీనివాస్ రెడ్డి మల్లారెడ్డి బుక్క వేణుగోపాల్ బొక్క బాల్ రెడ్డి మల్లేష్ యాదవ్ కొమురయ్య సంగీత రవి, అసెంబ్లీలోని అన్ని మండలాలు,డివిజన్ ల నుంచి అన్ని మున్సిపాలిటీ నుంచి భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# పోలీస్ శాఖలో క్రమశిక్షణ, అంకితభావం, నిజాయితీతో విధులు నిర్వహించాలి..

## - హద్నూర్ ఎస్సై చల్ల రాజశేఖర్

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
క్రమశిక్షణ, అంకితభావం, నిజాయితీతో కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని హద్నూర్ సబ్ ఇన్స్పెక్టర్ చల్ల రాజశేఖర్ అన్నారు. సోమవారం శిక్షణ ముగించుకొని నూతనంగా విధుల్లో చేరిన పోలీస్ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఉన్నత అధికారుల ఆదేశాలను పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని, విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం



చూపిన శాఖపరమైన చర్యలుంటాయన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ రూరల్ పి ఎస్ పరిధిలోని హద్నూర్ పోలీస్ స్టేషన్ కు నూతనంగా 14 మంది విధుల్లో చేరినట్లు తెలిపారు. అందులో పదిమంది పురుష పోలీసులు, నలుగురు మహిళా పోలీసులు వీధుల్లో చేరినట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది పూర్తిస్థాయిలో చేరడంతో కొరత తీరింది అన్నారు.

# జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు

## డ్రైవర్లకు ఏవైనా చెడు అలవాట్లు ఉంటే వాటిని మానుకోవాలి...

## ఆరోగ్య నియమాలు పాటించి ఆరోగ్యంగా ఉండాలి...

## పరీక్షలు నిర్వహించిన సంగారెడ్డి రీజియన్ ఆర్టీసీ మెడికల్ ఆఫీసర్ శృతి...

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డిపోలో సంగారెడ్డి రీజియన్ ఆర్టీసీ మెడికల్ ఆఫీసర్ శృతి సోమవారం జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో 45 సంవత్సరాలు నిండిన డ్రైవర్లకు ఆరోగ్య







పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు డ్రైవర్లకు ఆరోగ్యపరంగా ఎలా ఉండాలనే దానిపై తగు సలహాలు, సూచనలు చేశారు. ముఖ్యంగా డ్రైవర్లు వారికి ఏవైనా చెడు అలవాట్లు ఉంటే వాటిని మానుకోవాలని, ఆరోగ్య నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా జహీరాబాద్ డిపో గ్యారేజ్ ఆవరణలో సంగారెడ్డి రీజియన్ ఆర్టీసీ మెడికల్ ఆఫీసర్ శృతి మొక్కలు నాటారు. అనంతరం వారు గేట్ మీటింగ్ నిర్వహించి ప్రత్యేకంగా డ్రైవర్ కండక్టర్ సిబ్బందులందరికి ఆరోగ్యపరంగా ఎలా ఉండానే దానిపై తగు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ డిపో మేనేజర్ జాకిర్ హుస్సేన్, గ్యారేజ్ సూపర్వైజర్ తిరుమలేష్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన మాజీ సర్పంచ్ మారుతి...

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యు కోనింటీ మాణిక్ రావు ఆదేశాల మేరకు న్యాల్కల్ మండలం మల్గి గ్రామ మాజీ సర్పంచ్ జట్గొండ మారుతిమల్గి గ్రామానికి చెందిన హామీల్పూర్ నాగప్పకు15 వేల



రూపాయల విలువ గల ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైనా చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు, మాజీ సర్పంచ్‌కు లబ్దిదారుడు కృతజ్ఞతలు తెలిపారు.



## లక్ష్మీ గణపతి హెూమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి, మనాలి ఠాకూర్..

**గోదావరిఖని, డిసెంబర్ 2, (వెలుతురు):**
రామగుండం నియోజకవర్గం అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్,కి ఈ రామగుండం ప్రాంత ప్రజలకి సింగరేణి కార్మికులకి ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని సింగరేణి భాస్కర్ కిరణ్, ఆధ్వర్యంలో సోమవారం, శ్రీ లక్ష్మీ గణపతి హెూమం నిర్వహించడం జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, సతీమణి మనాలి ,పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ పూజ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భారీ ఎత్తున సింగరేణి కార్మికులతో పాటుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గోదావరిఖని టు (ఐదవ మెట్టు) 1500 కిలోమీటర్లు శబరిమలై వరకు పాదయాత్ర చేసిన కేశెట్టి నరేష్

### పాదయాత్రముగించుకొని వచ్చిన నరేష్ స్వాగతం పలికిన కార్పొరేటర్ పొన్నం విద్యాలక్ష్మి

**గోదావరిఖని, డిసెంబర్ 2, (వెలుతురు):**
స్థానిక రామగుండం పారిశ్రామిక ప్రాంత 48వ డివిజన్ లో నివసిస్తూకేశెట్టినరేష్, ,ఐదవ మెట్టు, అయ్యప్ప స్వామి శబరిమలై వరకు 1500 కిలోమీటర్లు నడుచుకుంటూ మహా పాదయాత్ర చేయడం జరిగినది. గత నెల అక్టోబర్ 17వ తేదీ నాడు మహా పాదయాత్ర



కరీంనగర్ నుంచి గడప నాగరాజు గురుస్వామి ఆధ్వర్యంలో 108 మంది మహా పాదయాత్ర సాగించడం జరిగినది సోమవారం, శబరిమలై పాదయాత్ర ముగించుకొని గోదావరిఖనికి 48 డివిజన్ వచ్చిన సందర్భంగా ఆ డివిజన్ కార్పొరేటర్ పొన్నం విద్య లక్ష్మణ్ గౌడ్ కేశెట్టి నరేష్ అయ్యప్ప స్వామికి పూలమాల శాలువాతో ఘనంగా స్వాగతం పలికారు అనంతరం వారు మాట్లాడుతూ... మన యొక్క 48 వ డివిజన్ నుంచి కే శెట్టి నరేష్ అయ్యప్ప, ఐదో మెట్టు ,1500 కిలోమీటర్లు మహా పాదయాత్ర లో పాల్గొనడం జరిగినది, అక్టోబర్ 17 నాడు మొదలుపెట్టిన అయ్యప్ప పాదయాత్ర నవంబర్ 29 నాడు దర్శనం చేసుకోవడం జరిగినది. ఇట్టి మహా పాదయాత్ర ను ముగించుకున్న నరేష్ అయ్యప్ప స్వామి, ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఒజ్జ శ్రీను, గురు స్వామి, అమ్మ రాజు, గురు స్వామి, చికెన్ రవి, గురు స్వామి, ఒజ్జ సురేష్, శ్రీను, గురు స్వాములు కేశెట్టి శ్రీరాములు, టైలర్ శ్రీనివాస్, గురు స్వామి, జంపయ్య గురుస్వామి, మరియు 42వ డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్ కుమార్ అయ్యప్ప స్వాములు పాల్గొన్నవారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పాలను ప్రజా ఆంక్షలకు అనుగుణంగా పాలన

### - మినిమం వేజ్ బోర్డ్, చైర్మన్ జనక్ ప్రసాద్

**గోదావరిఖని, డిసెంబర్ 2, (వెలుతురు):**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా సాగుతూ ఏడాది కలాంను పూర్తి చేసుకుంటుందని మినిమం వేజ్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ ప్రశంసించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జనక్ మాట్లాడుతూ గత, బి ఆర్ ఎస్, ప్రభుత్వం ప్రజా, కార్మిక,రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన చేయకపోవడం మూలంగానే ప్రజలు బొందపెట్టి మార్పును




కోరుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోరుకున్న విధంగా పాలన చేస్తూ సంవత్సర కాలంలోనే యువతకు 50 వేల ఉద్యోగాలను కల్పించడం జరిగిందని తెలిపారు. సింగరేణి కార్మికులకు సంబంధించిన సమస్యలపై రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ కార్మికుల పక్షాన నిలుస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 4న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో లక్ష మందితో జరుగనున్న యువ వికాస సభలో 9 వేల మంది యువతకు ఉద్యోగ పత్రాలను అందించనున్నారని, ఈ సభకు ప్రజలు, కార్మికులు, రైతులు, యువత హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేఖరుల సమావేశంలో ఐ ఎన్ టి యు సి, నాయకులు ఎస్.నరసింహ రెడ్డి,పి.ధర్మపురి, కె.సదానందం,వడ్డేపల్లి దాసు,వంగ లక్ష్మీపతి గౌడ్,అల్లాఉద్దీన్,మండ రమేష్,పుట్ట రమేష్, వికాస్, పాల్గొన్నారు.

## జిల్లా కమిటీ సభ్యులుగా పులుసు సత్యం, కందాల శంకర్ రెడ్డిల ఎన్నిక

**వెలుతురు న్యూస్, నూతనకల్, డిసెంబర్ 2:**
గత మూడు రోజుల నుండి జిల్లా కేంద్రంలో జరిగిన సిపిఐఎం మూడవ జిల్లా మహాసభలలో మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామా నికి చెందిన పులుసు సత్యం, కందాల శంకర్ రెడ్డిని జిల్లా కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్ను కున్నట్లు జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి సోమవారం తెలిపారు.సత్యం, శంకర్ రెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి





జిల్లా కమిటీ సభ్యునిగా ఎన్నుకున్న రాష్ట్ర జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు పార్టీ బలోపేతం కోసం అనునిత్యం కృషి చేస్తామనీ తెలిపారు.

# 6 గ్యారంటీలు 66 అబద్ధాలు..

# కాంగ్రెస్ గ్యారెంటీలపై బీజేపీ పోరుబాట

### న్యాల్కల్‌లో బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ - రైతులు, రైతు కూలీల సమస్యలు అడిగి తెలుసుకొన్న బీజేపీ నాయకులు..

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు 6 గ్యారంటీలను ఇచ్చి ఒక సంవత్సరం గడుస్తున్న వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలం ఆయిందని న్యాల్కల్ మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు ఓంకార్ యాదవ్ ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండల కేంద్రంలో బీజేపీ మండలం పార్టీ అధ్యక్షులు ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ నియోజకవర్గం నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు న్యాల్కల్ మండలంలోని రైతులతో, రైతు కూలీలతో కలిసి వారి సమస్యలని అడిగి తెలుసుకొన్నారు. ఇచ్చిన హామీలను నేరవెర్చనందుకు రాష్ట్ర ప్రభుత్వనికి వ్యతిరేకంగా, బుద్ధి వచ్చేలా నిరసన తెలుపటానికి బైక్ ర్యాలీని నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీద ప్రజలకు 6 గ్యారంటీలు 66 అబ్బదాలతో సరిపెట్టుకుందని ఆరోపించారు. చేతకాని హామీలు ఇచ్చి మోసపూరిత కుట్రలు చేస్తూ ప్రజలకు ఇస్తానన్న రైతు భరోసా, రైతు రుణ మాఫీ లాంటి 6 గ్యారంటీ లకు గండి పెట్టి రైతులకు మోసం చేస్తూ ఉంటే బీజేపీ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. పరిపాలన చేయడం



చేతకాకపోతే ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలనీ వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలం ప్రధాన కార్యదర్శులు మల్లేష్ గంగ్వార్, పలింకార్ రాహుల్ కుమార్, మండలం బీజేవైఎం అధ్యక్షులు విష్ణు సునర్, సీనియర్ నాయకులు బస్వారాజ్, గోరక్ నాథ్ అరుణ్ గౌడ్, చిన్న, ముదిరాజ్, శివ, యాదవ్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పాలన వైఫల్యాలను ఎండగడుతూ జహీరాబాద్‌లో భారీ బైక్ ర్యాలీ

### ముఖ్య అతిధిగా పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి...

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒక సంవత్సరం పాలన వైఫల్యాలను ఎండగడుతూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణములో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జగన్నాథ్ ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గం బీజేపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు.
కాంగ్రెస్ ప్రభుత్వం ఒక సంవత్సరం పాలన వైఫల్యాలను ఎండగడుతూ నిర్వహించిన బైక్ ర్యాలి విజయవంతంగా జహీరాబాద్ అసెంబ్లీ పరిధిలో నిర్వహించిన అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జహీరాబాద్ ప్రాంతంలో చెరుకు రైతులను అధికంగా వున్నప్పటికీ ఇక్కడ వున్నా చెరుకు రైతులకు మద్దతుగా నిలవకుండా ఇక్కడ రైతుల భూములను కూడా ఫార్మా కంపెనీ కోసం లాక్కోవడం తెలంగాణ రైతాంగాన్ని అలాగే చెరుకు రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వున్నా చిత్త శుద్ధి తేటతెల్లం అవుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో సాగునీరు కోసం నారింజ ప్రాజెక్ట్ వున్నప్పటికీ కనీసం జహీరాబాద్ ప్రాంత ప్రజలకు నిరుపయోగంగా మారడం దురదృష్టకరమని అన్నారు. ప్రస్తుతం ఈ జిల్లా నుండి వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న దామోదర రాజనర్సింహ జహీరాబాద్ ప్రాంతంలో



ఇప్పటికే వాయుకాలుష్యంతో ప్రజలు సతమతం అవుతున్న కూడా వారి ఆరోగ్యం పట్ల ఎలాంటి ఆలోచన లేకుండా ఇక్కడి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడటం ఇక్కడ మంత్రిగారు ఈ ప్రాంత ప్రజలపై చూపిస్తున్న ప్రేమకు నిదర్శనమని తెలిపారు. ఈ ప్రాంతలో ఇటీవలే వక్ఫ్ బోర్డు కూడా భూములు అక్రమించినట్లుగా వార్తలు రావడం రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే భూములన్నీ వక్ఫ్ అధీనంలోకి వెళ్ళడం దురదృష్టకరమని పేర్కొన్నారు.
మహాలక్ష్మి పేరుతో మహిళలకు తులం బంగారం పేరు చెప్పి ఇప్పటి వరకు ఎంత మందికి ఇచ్చారో చెప్పాలన్నారు. ఉచిత విద్యుత్ పేరుతో మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతాం



అని చెప్పి మొత్తం తెలంగాణ రాష్ట్రాన్నె అంధకారంలోకి నెట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కార్యక్రమ ఇంచార్జి శ్రీ గొల్ల భాస్కర్, శ్రీనివాస్ గౌడ్, సుధీర్ బండారి, బక్కయ్య గుప్తా, పూల సంతోష్, పట్టణ అధ్యక్షులు విశ్వనాథ్ స్వామి, మండల అధ్యక్షులు దుర్గయ్య, విశ్వనాథ్, వైద్యనాథ్, ఓం కార్, శ్రీకాంత్, బీజేవైఎం నాయకులు అనిల్, సీనియర్ నాయకులుబండి వెంకట్, బొగ్గుల సంతోష్, మల్లేష్, సురేష్, అప్పం శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో ప్రజాపాలన కళాయాత్ర

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం లోని న్యాల్కల్ మండల కేంద్రంలోని పలు గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన ప్రగతిని సంగారెడ్డి జిల్లా



కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి పర్యవేక్షణలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి సంగారెడ్డి జిల్లా కళాకారులు ఆట మాట పాటల ద్వారా పాటలు పాడి ప్రజలను ఉత్తేజపరిచారు. న్యాల్కల్ మండల కేంద్రంతో పాటు హద్నూర్, గంగ్వార్ గ్రామాలలో పెద్ద ఎత్తున కళాయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తమ పాటల ద్వారా ప్రజలకు వివరించారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టినటువంటి ఆరు గ్యారంటీల అమలు యొక్క అభివృద్ధి పథాన్ని వివరించడం జరిగింది.



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం, ఐదు వందలకే గ్యాస్ సిలిండర్, రైతులకు రుణమాఫీ, యువ వికాసం, ఉద్యోగ నియామకాలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పది లక్షలకు పెంపు, మహిళలకు వడ్డీలేని రుణాలు, స్కిల్ యూనివర్సిటీ వంటి తదితర పథకాలకు సంబంధించి పాటలు ఆలపించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేసిందని వివరించారు. కళాకారుల ఆటపాటలు ప్రజల్ని ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో న్యాల్కల్ మండల ఎంపీడీఓ రాజశేఖర్ కార్యదర్శి ధన్ రాజ్, ప్రజాప్రతినిధులు సొసైటీ ఛైర్మన్ సిద్ధి లింగయ్య స్వామి అలాగే గంగ్వార్ నాయకులు బలరాం రెడ్డి, మాజీ ఎంపిపి రత్నం, జీవన్ రెడ్డి, విఠల్, చంద్రప్ప, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
ఈ కళాయాత్రలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు జిల్లా టీమ్ లీడర్ ఆయిదాల సునీల్, డి రమేష్, ఎన్ దుర్గేష్, ఎస్ మల్లేష్, పి సంధ్య, ఈ వినేష్, బి నవీన్ మరియు జి శంకర్ పాల్గొని కళా ప్రదర్శన నిర్వహించారు.

## ఎన్ టి పి సి అయ్యప్ప దేవాలయంలో అంగరంగ వైభవంగా పడిపూజ మహెూత్సవం

### - ముఖ్య అతిధిగా ఎన్ టి పి సి సధరన్ రీజియన్ ఆర్ ఈ డి, కేదార్ రంజన్ పాండు

**గోదావరిఖని, డిసెంబర్ 2, (వెలుతురు):**
ఆదివారం రోజు ఎన్ టి పి సి పి టి ఎస్, వైకుంఠపురం హరిహర దేవాలయం ప్రాంగణంలోని ఆదివారం, ఎన్ టి పి సి, పి టి ఎస్,శ్రీఅయ్యప్ప స్వామి వారి దేవాలయంలో అంగరంగ వైభవంగా, అత్యంత భక్తి శ్రద్ధలతో ఐ సి హెచ్ కార్తికేయన్, వారి బృందం నిర్వహించిన పడి పూజలను ఆలయ పూజారి బ్రహ్మశ్రీ రాంపల్లి వామనశర్మ, చేతుల మీదుగా ఘనంగా జరిగాయి. అని అఖిలభారతీయ అయ్యప్ప ధర్మాప్రచార సభ ,ఏ బి ఏ పి , సభ్యుడు జనగామ తిరుపతి తెలిపారు . ఈ కార్యక్రమాని ముఖ్య అతిధిగా ఎన్ టి పి సి ఆర్ ఈ డి, కేదార్ రంజన్ పాండు, అన్ని విభాగాల జిఎంలు, హెచ్ ఆర్ ఏ జి ఎం బజయ్ కుమార్, సిగ్దార్ తో పాటు ఏ జి ఎం లు, డి జి ఎం లు, అధికారులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు అన్నారు. ఉదయం గణపతి హెూమం, అయ్యప్ప స్వామికి, అన్ని ఉత్సవ విగ్రహాలకు అభిశేఖం చేసినట్లు తెలిపారు. సాయంత్రం దేవాలయ ప్రాంగనం దీపారదన, కళశపూజ, భక్తి పారావస్యంతో భజన, అయ్యప్ప శరణుగోషతో వైకుంఠపురం ప్రాంగణం మారుమోగింది.
పిటిఎస్ అయ్యప్ప దేవాలయమునకు పూర్వ వైభవం వచ్చింది అని పలువురు గురుస్వాములు హర్షం వ్యక్తం చేస్తు ఆలయ ఇంచార్జి పొలినేని సంపత్ రావుని అభినందించారు. అన్నారు. అనంతరం పడిపూజ, అల్పాహారం, ప్రసాద వితరణ జరిగింది అని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ్యుడు జనగామ



తిరుపతి తెలిపారు.
అయ్యప్ప దేవాలయం కమిటీ సభ్యుడు పోలినేనిసంపత్, రావు,ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలలో , కార్పొరేటర్ కొలిపాక సుజాత మల్లయ్య, హరి హర దేవాలయ కమిటీ చైర్మన్ చెంద్రశేఖర్, సభ్యులు వి.గిరి కుమార్, టివి ఆర్ చంద్ర, ప్రభాకర్ గురు స్వామి, రాములు గౌడ్ గురు స్వామి, శేషు కుమార్ గురు స్వామి, బజన బృందం సాగి కిషన్ రావు, కేరళ హరి, కృష్ణ,పర్స రామస్వామి గురుస్వామి, అయ్యప్ప కన్నె స్వాములు, గురు స్వాములు, భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి యేడాది పాలనలో సింగరేణి కార్మికుల సమస్య ఏ ఒక్కటి పరిష్కారం చేయలేదు,

**హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి, రియాజ్ అహ్మద్ అరెస్టును ఖండించిన జేఏసీ సంఘాలు**

గోదావరిఖని, డిసెంబర్ 2, (వెలుతురు):
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యేడాది పాలనలో సింగరేణి కార్మికుల డిక్లరేషన్ లోని ఒక్క హామీ కూడా తీర్చలేక పోయారని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆరోపించారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ సింగరేణిలో ప్రధానంగా ఉన్న బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ సమస్య గత ప్రభుత్వ తీర్చలేక పొగా, ఈ ప్రభుత్వం కూడా ప్రైవేటికరణకు అనుకూలంగా ఉన్నామనే సంకేతం వచ్చేలా బీజేపీ ప్రభుత్వంలో కలిసి యాక్షన్ లో పాల్గొనడం జరిగిందని అన్నారు. సింగరేణిలో పేర్క్ పై ఇన్ కం టాక్స్ రద్దు, సొంతింటి కల, మారుపేర్ల సమస్య కూడా అలాగే ఉండి పోయాయని వీటన్నింటిపై ఈనెల 4న ముఖ్యమంత్రి పెద్దపల్లి జిల్లా సభకు వస్తున్న సందర్భంగా ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికుల సమస్యలపై మాట్లాడితే తాము ఏదో అల్లర్లు సృష్టించే వారిలా హెచ్ఎంఎస్, నాయకులు రియాజ్ అహ్మద్ ను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ విలేఖరుల సమావేశంలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు టి.శ్రీనివాస్, జి.రాములు,జక్కుల నారాయణ, ఐ.కృష్ణ, కామెర గట్టయ్య, పోషమల్లు, ఇ.నరేష్ పాల్గొన్నారు.

## తెలంగాణ ఆటో యూనియన్ రాష్ట్ర జేఏసీ జిల్లా కమిటీ ఎన్నిక, జిల్లా అధ్యక్షునిగా ముందర రవికుమార్

గోదావరిఖని, డిసెంబర్ 2, (వెలుతురు):
తెలంగాణ ఆటో యూనియన్ల రాష్ట్ర జేఏసీ జిల్లా కమిటీని తెలంగాణ ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్ ప్రకటించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆటో యూనియన్ల రాష్ట్ర జేఏసీ జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులుగా గోపు ఐలయ్య యాదవ్, అధ్యక్షు



లుగా రేణికుంట్ల సురేష్, ప్రధానకార్యదర్శిగా అయిందాల సదానందం, కోశాధికారిగా తోకల వెంకటేష్ లను ఎన్నుకున్నట్లు తెలిపారు. గౌరవ అధ్యక్షులు గోపు ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ తనకు ఇచ్చిన భాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తూ ఆటో యజమానులు, డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని అన్నారు. ప్రభుత్వం కూడా మహాలక్ష్మి పథకం ద్వారా ఆటో యజమానులు, డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులను గుర్తించాలని కోరారు. ఈ విలేఖరుల సమావేశంలో తెలంగాణ ఆటో యూనియన్ల రాష్ట్ర జేఏసీ జిల్లా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కాశీపేట రాజయ్య,అధికార ప్రతినిధి మంథని అశోక్,కార్యదర్శి గాలిపెల్లి కొండయ్య, కార్యవర్గ సభ్యులు చందు, స్వామి, విజయ్ కుమార్, పాల్గొన్నారు.

## రాష్ట్రంలో నిర్బంధ పాలన సాగుతుంది

**- మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్**

గోదావరిఖని, డిసెంబర్ 2, (వెలుతురు):
తెలంగాణ రాష్ట్రం లో నిర్బంధ పాలన సాగుతుందని మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్, అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పిలుపు మేరకు సోమవారం, గురుకుల బాట కార్యక్రమం లో భాగంగా గోదావరిఖని మైనార్టీ హాస్టల్ పాఠశాలను సందర్శనకు వేళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గురుకుల పాఠశాలలో విద్యార్థులు సరైనా వసతులు అందటం లేదని సరైనా భోజనం పెట్టడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు తెలపడం జరిగిందని



ఈ క్రమంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్, గురుకుల బాటకు పిలుపు నివ్వడం జరిగిందని గురకులాల్లో విద్యార్థులు పరిస్థితి వారి స్దితిగతులని తెలుసు కునేందుకు వస్తే పాఠశాల అధికారులు అనుమతులు లేవంటూ మాట్లాడుతున్నారని ఇది దుర్మార్గపు పాలనకు నిద్శనమన్నారు. ఇప్పటికీ వరకు 48 మంది గురుకుల విద్యార్థులు మృతి చేందారని చెప్పారు. గురుకుల పాఠశాలల్లో పిల్లలకు ఏ ఇబ్బందులు కలిగిన పూర్తి భాధ్యత పాలకులు ప్రిన్సిపల్ వహించాలన్నారు. నిర్బంధ పాలనకు ప్రజలనుండి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో కార్పోరేటర్ కల్వచర్ల కృష్ణ వేణీ నాయకులు అచ్చే వేణు నారాయణదాసు మారుతి చుక్క శ్రీనివాస్ సట్టు శ్రీనివాస్ బోడ్డు రవీందర్ జడ్సన్ ఇరుగురాళ్ల శ్రావన్ కిరన్ జీ రామారాజు ఆవునూరి వెంకటేష్ చింటూ శ్రీకాంత్, పాల్గొన్నారు.

## ఏ చిరు వ్యాపారికి నష్టం జరిగిందని మాజీ ఎమ్మెల్యే బంద్ పిలుపునిచ్చారు..?

**- కాంగ్రెస్ అధికార ప్రతినిధి మోహిద్ సన్నీ**

గోదావరిఖని, డిసెంబర్ 2, (వెలుతురు): రామగుండంలో ఏ చిరు వ్యాపారికి నష్టం జరిగిందని మాజీ ఎమ్మెల్యే బంద్ కు పిలుపునిచ్చారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మొహిద్ సన్నీ ప్రశ్నించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ కోరుకంటి చందర్ విజయోత్సవాలు ఎందుకు జరుపుకుంటున్నారని మాట్లాడడం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ఉచిత బస్సు, ప్రతి ఇంటికి 200 యూనిట్ల కరెంటు ఫ్రీ, 500 రూపా




యలకు గ్యాస్, రైతులకు రుణ మాఫీ చేసినందుకు విజయోత్సవాలు జరుపుకుంటున్నా మని తెలిపారు. రామగుండంలో జరుగుతున్న కూల్చి వేతల కారణంగా ఏ ఒక్క చిరు వ్యాపారికి కూడా నష్టం జరుగలేదని, అలాంటప్పుడు ఎవ్వరి కోసం గోదావరిఖని ప్రకటించారని, అభివృద్ధిని చూడలేకనాఅని ఎద్దేవా చేశారు. ఈ విలేఖరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హమీద్, గుంపుల ఓదెలు, మహంకాళి అంజయ్య, దాసరి ఎల్లయ్య,మండ రమేష్, మేకల హరికృష్ణ, తిరుపతి, చంద్రశేఖర్, పాల్గొన్నారు..

# సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తాం..

**రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ , ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి బి జనక్ ప్రసాద్**

గోదావరిఖని, డిసెంబర్ 2, (వెలుతురు):
ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సింగరేణి కార్మికుల సొంత ఇంటి కల , పెర్క్స్ మీద ఇన్కమ్ ట్యాక్స్ మాఫీ చూపిస్తామని,
4 వ తేదీన పెద్దపల్లి లో జరిగే ముఖ్యమంత్రి, యువ వికాసం సభ కి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం, చేయాలని రాష్ట్ర కనీస వేతనం సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి బి జనప్రసాద్, కార్మికులను కోరారు. సోమవారం జీడీకే 11 ఇంక్లైన్ గెట్ మీటింగ్ లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సింగరేణి కార్మికుల చిరకాల వాంఛ అయిన కార్మికుల సొంత ఇంటి కల , పెర్క్స్ మీద ఇన్కమ్ ట్యాక్స్ మాఫీ గురించి ప్రభుత్వ తో మాట్లాడటం జరిగిందని త్వరలోనే ఆచరణ కాబోతుందని తెలిపారు. అంతే కాకుండా తెలంగాణ లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ముఖ్యంగా కార్మికుల కృషి వల్ల ఎన్నడూ లేని విధంగా సింగరేణి లో అత్యధిక ఉత్పత్తి, ఉత్పాదక, లాభాలు గడించిందని. ప్రభుత్వం కూడా సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే పెండింగ్ లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగుల వయోపరిమితి 35-40 ఏళ్ల పెంపు , రామగుండం లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ , 800 మెగా వాట్ల పవర్ ప్లాంట్లు , ఒడిసా లో నైని ప్రాజెక్టు నిర్మాణం , స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ఏర్పాటు , కోటి రూపాయల ప్రమాద భీమా , స్థానికులకే 80% ఉద్యోగాలు , సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం, బీసీ లైజనింగ్ ఆఫీసర్



నియామకం వంటి అనేక కార్యక్రమాలు చెప్పటామని సింగరేణి కార్మికులకు గతంలో కన్నా ఎక్కువ 796 కోట్లు లాభాలు ఇవ్వటం తో పాటు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, కృషి పలితంగా కాంట్రాక్టు కార్మికుల కి కూడా లాభాలలో నుండి 5000 రూపాయలు ఇప్పించామని. అలాగే భవిష్యత్ లో కూడా రామగుండం లో 1000 క్వార్టర్లు తో గేటెడ్ కమ్యూనిటీని తరహా నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు.
సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహా రెడ్డి, ధర్మపురి, మాట్లాడుతూ ..
ఏఐటీయూసీ గుర్తింపు సంఘం పూర్తి గా విఫలమైంది అని, ఒకప్పుడు పోరాటాలు చేసే నాయకులు ఉంటే ఇప్పుడు పైరవీల కోసం ఆరాటే పడే నాయకులు ఉన్నారని మొన్న జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో ఒక్క డిమాండ్ కూడా అగ్రిమెంట్ చేయకుండా సూచన ప్రాయంగా అంగీకరించారని తెలపటం సిగ్గు చేటని దుయ్యబట్టారు.
ఆర్జీ-1 వైస్ ప్రెసిడెంట్ సదానందం అధ్యక్షత న జరిగిన ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీలు వంగ లక్ష్మిపతి గౌడ్, వికాస్ కుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షులు వద్దేపల్లి దాస్, నాయకులు లింగస్వామి , జాయింట్ జనరల్ సెక్రటరీ లు గడ్డం కృష్ణ, బత్తుల పోచయ్య, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ పోతరబోయిన సమ్మయ్య యాదవ్, సెంట్రల్ సెక్రటరీలు మోసిన్, పుట్ట రమేష్, మండ రమేష్, బ్రాంచ్ సెక్రటరీలు గుండేటి శ్రీనివాస్, ఎదులాపురం శ్రీని వాస్, పిట్ సెక్రటరీ గాదె సంపత్, అల్లావుద్దీన్, తాటి రాజయ్య, సంపత్, రామస్వామి, కుమారస్వామి, హేమంత్, రాకేష్, ఆంజనేయులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# బూటకపు ఎన్కౌంటర్లను ఖండిస్తున్నాం...

**ఎన్కౌంటర్ పై సిట్టింగ్ జడ్జ్‌చే న్యాయ విచారణ జరిపించాలి.**

**తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కమిటీ డిమాండ్**

గోదావరిఖని, డిసెంబర్ 2, (వెలుతురు):
నిన్న ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో ములుగు జిల్లాలోని చల్పక అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ నాయకులను పట్టుకొని బూటకపు ఎన్కౌంటర్ పేరుతోటి చంపడాన్ని తెలంగాణ ప్రజా ఫ్రంట్ , (టీపిఎఫ్) పెద్దపెల్లి జిల్లా కన్వీనర్, గుమ్మడి కొమ్మరయ్య, జిల్లా కో కన్వీనర్, గాండ్ల మల్లేశం, ఒక ప్రకటనలో కండించారు,
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి ముందు మా పార్టీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్య పునరుద్ధరణ, పౌర స్వేచ్ఛను కల్పిస్తామని ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి, ఏడో గ్యారంటీ గా ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ ఫాసిజానికి, బీజేపీ పార్టీకి వ్యతిరేకంగా పోరాడాలని దేశవ్యాప్తంగా తిరుగుతూ పిలుపునిస్తా ఉంటే రాష్ట్రంలో మాత్రం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి, సంవత్సర కాలంలో దామరతోగు బూటకపు ఎన్కౌంటర్ మొదలు ఇప్పుడు ములుగు జిల్లాలో ఎన్కౌంటర్ వరకు తెలంగాణలో ఎన్కౌంటర్ల పరంపర కొనసాగిస్తూ ఇక్కడా అదే విధానాలను అమలు చేస్తున్నారని వారు పేర్కొన్నారు.
గత పది సంవత్సరాల ప్రజా కంటక కెసిఆర్ చీకటి పాలన అంతం కావడానికి ప్రజాసంఘాలు, విప్లవ పార్టీలు నిర్వహించిన పాత్ర తెలంగాణ ప్రజానీకానికి , కాంగ్రెస్ పార్టీకి తెలియంది కాదు. నిరాయుధులను, అన్నంలో విషం పెట్టి స్పృహ కోల్పోయిన తర్వాత పట్టుకుని చంపడం కన్న న్యాయ వ్యవస్థ మీద వారికి గౌరవం ఉంటే వారిని కోర్టులో హాజరు పరచవలసిన అవసరం ఉండే అలా కాకుండా ఎన్కౌంటర్, చేయడం దారుణం.
దామగుండంలో రాడార్ ప్రాజెక్టు కోసం వందలాది ఎకరాల అటవీ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం, ఫార్మా సిటీ కోసం లగచర్లలో ప్రజల భూములను గుంజుకోవడం అక్కడ ప్రజల తిరుగుబాటు,ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా దివాల్పూర్ రైతుల పోరాటాల నుండి ప్రభుత్వం గుణపాఠం నేర్చు కోనట్లుంది.
వివిధ వార్త పత్రికలలో, సామాజిక మధ్యమాలలో వచ్చిన వార్తలను, చనిపోయిన మావోయిస్టుల శరీరాలను, వారికీ అయినా గాయలను, ఆ ప్రాంతాన్ని గమనించినట్లయితే వారిని పట్టుకొని చిత్రహింసలకు గురిచేసి చంపినట్లుగా ప్రజలు భావిస్తున్నారు. ఇంత పెద్ద ఎన్కౌంటర్, జరిగిన అవతలి వైపు పోలీసులకు ఎలాంటి గాయాలు కాకపోవడం ఎన్ కౌంటర్, పై పలు అనుమానాలను కలిగిస్తున్నది. మూడవసారి అధికారంలోకి వచ్చిన మోడీ, అమిత్ షా, బీజేపీ ప్రభుత్వం శరవేగంగా ఆర్థిక సంస్కరణలు అమలుచేస్తుంది. 2025 నాటికీ వామపక్ష తీవ్రవాదాన్ని, మావోయిస్టు పార్టీని, ప్రజా ఉద్యమాలను అంతం చేస్తామని డి జి పి, ల సమావేశంలో హొమ్ శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. దాంట్లో భాగంగానే ఆపరేషన్ కగార్, పేరుతొ ఆదివాసీలను అడవుల నుండి వెళ్లగొట్టే క్రమంలో పసిగుడ్డు మొదలు పండు ముసలి వరకు దాడులు, హత్యలు,గృహ దహనాలు,లూఠిలు,స్త్రీ లపై అత్యాచారాలకు, డ్రోన్ దాడులకు పాల్పతూ వారిని చంపుతున్నారు.
ఇప్పటికైనా రాజ్యాంగం ద్వారా ఆదివాసీలకు దాఖాలు పడ్డ 1/70 యాక్ట్, పేసా చట్టం, 5,6 షెడ్యూల్, అటవీ హక్కుల చట్టం, గ్రామసభ తీర్మానలను అమలు చేయాలనీ, ఆపరేషన్ కగార్ ను నిలుపుదల చేయాలని, ఆదివాసీ ప్రాంతాలలో సైనిక క్యాంపులను ఎత్తివేయాలని, మావోయిస్టు పార్టీ ని శాంతి భద్రతల సమస్యగా కాకుండా సామాజిక, ఆర్థిక, రాజకీయ కోణంలో పరిశీలించి వారితో శాంతి చర్చలు జరపాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. మూలుగులో జరిగిన బూటకపు ఎన్కౌంటర్ పై నిపుణు లైన ఫోరోనిక్స్, అధికారులతో పోస్టుమార్టం నిర్వహించి,సిట్టింగ్ జడ్జ్ చే న్యాయ విచారణ జరిపించి, నిజా నిజాలను తెలంగాణ ప్రజల ముందు ఉంచాలని, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కమిటీ తరుపున ప్రభుత్వాన్ని , చేస్తున్నాము.
అలాగే ఈ ఘటనను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధా వులు, బుద్ధిజీవులు ఖండించాలని వారు కోరారు.

# అభివృద్ధి పేర విధ్వంసం సృష్టిస్తూ చిరువ్యాపారుల జీవితాలను రోడ్డుపై పడేశారు...

**చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపకుండా దుకణాలు కుల్చారు.**

**వ్యాపారులకు న్యాయం జరిగేదాకా పోరాటం.**

**నేటి బజార్ బందు జయప్రదం చేయండి .**

**రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్.**

గోదావరిఖని, డిసెంబర్ 2, (వెలుతురు):
రామగుండం నియోజకవర్గంలో గోదావరిఖని, ఎన్టీపిసిలో పాలకుల అభివృద్ధి పేరిట విద్వసం సృష్టిస్తూ వ్యాపారులను, చిరువ్యాపారులను ఆర్థిక నష్టానికి గురిచేస్తున్నారు... చిరు వ్యాపారులకు ఎటువంటి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయకుండా వారి వ్యాపార సంస్థలను కూల్చివేయడం వలన వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి
చిరువ్యాపారులకు న్యాయం జరిగేంతా వరకు పోరాడుతని మంగళవారం బజరుబంద్ కు వ్యాపారులు ప్రజలు పాల్గొని



జయప్రదం చేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్, కోరారు. లక్ష్మినగర్, కళ్యాన్ నగర్,గణేష్ నగర్ ప్రాంతాల్లో రోడ్ల వెడల్పు పేర్ల మీద ఇండ్లు,షాపులను కూల్చి వేయడం వలన వ్యాపారస్తులు ఆర్థిక సంక్షోబానికి గురి అవుతున్నారని తెలిపారు. కళ్యాన్ నగర్. ప్రాంతంలో రోడ్లు తవ్వి వదిలేయడం వలన వ్యాపారాలు సాగాక ఆర్థిక నష్టానికి లోనవుతున్నారన్నారు. ఎన్టీపిసి, గాంధీ, మార్కెట్ చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించడంతో వారు ఆకలితో అలమటిస్తు దిక్కు తోచని స్తితిలో ఉన్నారని వారికి ప్రత్యా న్యాయం చూపించి వారిని ఆదుకోవాలన్నారు. రోజురోజుకు జనాభ తగ్గుతున్న రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వ్యాపారాలు నడవక ఇబ్బంది పడుతున్న స్తితిలో సుందరీకరణ పేరిట, రోడ్డు విస్తరణ పేరిట, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పేరిట ప్రశాంతంగా ఉన్న వ్యాపార ప్రాంతాల్లో కల్లోలం రేపుతున్న కూల్చివేతలకు నిరసనగా వ్యాపారులు, చిరువ్యాపారులు, కార్మిక కర్షక సకలజనులు ఐక్యం అవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఈ నేపథ్యంలో కూల్చివేతలను నిలిపి వేయాలని చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసిన తరువాతే వారి షాపులను తొలగించాలని అన్నారు.
రోడ్డు వెడల్పుతో లక్ష్మీనగర్లో నిర్మాణాల కూల్చివేతలకు గురి అయ్యే ఇండ్లకు వ్యాపార సంస్థలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ 03 వ తేది మంగళవారం గోదావరిఖని, ఎన్టీపిసి,లో జరిగే బజార్ బంద్, వ్యాపారులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## సీఎం పర్యటన సందర్భంగా

# పోలీస్ అధికారులతో సీపీ సమీక్షా సమావేశం

**అధికారులు సమన్వయంతో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, కార్యక్రమం సజావుగా జరిగేలా చూడాలి: పోలీస్ కమీషనర్ , ఎం శ్రీనివాస్**

గోదావరిఖని, డిసెంబర్ 2, (వెలుతురు):
డిసెంబర్ 04 వ తేదిన పెద్దపల్లి లో, ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, కార్యక్రమం సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సీపీ ,పేర్కొన్నారు.
సోమవారం, రామగుండం పోలీస్ కమిషనరేట్ లో రామగుండం పోలీస్ కమీషనర్, ఎం.శ్రీనివాస్ ఐపిఎస్., ఐజీ ,అధ్యక్షతన రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి డీసీపీ, ఏసీపీ లు, సీఐ లు ఎస్ఐ లతో బందోబస్త్ ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలు, విఐపి లు వచ్చే మార్గాలు, ప్రవేశ మార్గాలు, సభకు వచ్చే ప్రజల రాకపోకల సౌకర్యం,ట్రాఫిక్ మార్గ దర్శకాల పై, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రత్యేక ప్రాంతాలు గుర్తింపు అనుగుణంగా ఏర్పాట్లు,వివిధ శాఖల సమన్వయం, అత్యవసర పరిస్థితిలలో అంబులెన్స్, ఫైర్ సర్వీస్ గురించి, బందోబస్త్ విధులకు సంబందించిన డ్యూటీ చార్ట్ స్పష్టంగా కేటాయింపు, స్పెషల్ టీమ్ ల ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్షా సమావేశంలో




అధికారులతో చర్చించి సలహాలు, సూచనలు, ఆదేశాలు జారీ చేయడం జరిగింది.
ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి డిసిపి చేతన ఐపిఎస్, మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఐపిఎస్,అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు,గోదావరిఖని ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, సిసిఎస్ ఏసీపీ వెంకటస్వామి, టాస్క్ ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏ ఆర్ ఏసీపీ సుందర్ రావు,వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్ లు,సీఐ లు, ఎస్ఐ లు పాల్గొన్నారు.



## సూర్యాపేటలో ప్రారంభమైన ప్రజానాట్య మండలి శిక్షణా తరగతులు

**వెలుతురు, సూర్యాపేట జిల్లా, డిసెంబర్ 2:**

తెలంగాణ ప్రజానాట్యమండలి సూర్యాపేట జిల్లా సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 2 3 4 తేదీలలో జరిగే కళారూపాల శిక్షణా తరగతుల కార్యక్రమం ను జండాను ఆవిష్కరించి ప్రారంభించిన రాష్ట్ర ప్రజానాట్య మండలి అధ్యక్షుడు కురి మిద్దె శ్రీనివాస్ , సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నూతన కళారూపాలశిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా సందర్భంగా శ్రీనివాస్ కార్యక్రమంలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జండా ను ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్ తో పాటుగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి కళాకారులు పాల్గొన్నారు,

## డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు నెంబర్లు కేటాయించాలి

**వెలుతురు న్యూస్, సూర్యాపేట డిసెంబర్ 2:** అక్టోబర్ నెలలో సూర్యాపేట డబల్ బెడ్రూం లను సమీక్షించిన అధికారులు 45 రోజులలో లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపి గడువు ముగిసినను ఇంతవరకు అలాట్మెంట్ చేయలేదని కోరుతూ 48 వార్డులకు చెందిన డబల్ బెడ్ రూమ్ దారులు సోమవారం జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సూర్యాపేట డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల కమిటీ అధ్యక్షులు షేక్ నయీమ్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఇంకా డబల్ బెడ్ రూములు



కేటాయించకపోవడంతో వేల రూపాయలు కిరాయిలు కట్టవలసి వస్తుందని ఆవేదన చెందారు. డబల్ బెడ్ రూమ్ దారులందరూ పేదవారే అని రోజు కూలితో జీవనం కొనసాగి స్తున్నారని అధికారులు తక్షణమే డబల్ బెడ్ రూమ్ దారులకు నెంబర్లు కేటాయించాలన్నారు. అధికారులు పెట్టిన 45 రోజుల గడువు ముగిసినందున ఆర్డిఓ అందుబాటులో లేకపోవడంతో తహసిల్దార్ కు వినతిపత్ర ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు ఎస్ కే ఆశ. ఎండి రఫీ. హుస్సేన్ బి. హసీనా. రామని పావని. కాటూరి బిక్షవమ్మ, నీలమ్మ. అనిల్. మోర నరేష్ నూకల నాగరాజు రవి నాయక్. శారద, కుడ కుడ నీలమ్మ, రజిత తదితరులు పాల్గొనడం జరిగింది.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ D.C.M.S చైర్మన్

**సూర్యాపేట, వెలుతురు న్యూస్ డిసెంబర్ 2:** ఆదివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని M.L.C తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ D.C.M.S చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ కలిశారు. ఇచ్చిన మాట ప్రకారం బీసీకుల గణనకు ప్రభుత్వం సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు



జనాభా ప్రకారం రిజర్వేషన్లు,గ్రామపంచాయతీ ఎన్నికల్లో 50% రిజర్వేషన్లు ప్రకటించి బీసీ లకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.అలాగే ఏకకాలంలో రైతులకు 2 లక్షల రుణమాఫీ, పంటకు గిట్టుబాటు ధర, 500 బోనస్, రైతు సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయాన్ని పండుగ చేయడమే లక్ష్యంగా ప్రజా పాలన కొనసాగిస్తున్నందుకు రాష్ట్ర రైతాంగం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తమ్మడబోయిన అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో సింగరేణి మారు పేర్లు విజిలెన్స్ బాధితుల సమస్య పరిష్కార ప్రకటన చేయాలి

### - మారు పేర్లు బాధ్యులు

**గోదావరిఖని, డిసెంబర్ 2, (వెలుతురు):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువ వికాస్ సభలో సింగరేణి మారుపేర్ల విజిలెన్స్ బాధితుల సమస్య పరిష్కారంపై ప్రకటన చేయాలని సింగరేణి మారుపేర్ల విజిలెన్స్ బాధితులు వేడుకున్నారు.గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మారుపేర్ల భాదితులు మాట్లాడుతూ తమ తండ్రుల కాలంలో బొగ్గు బావులలో పనిచేయడానికి ఎవ్వరూ రాని పరిస్థితుల్లో సింగరేణి యాజమాన్యం తమ తండ్రులను మారు పేర్లతో ఉద్యోగంలోకి తీసుకొని పనిచేయించడం జరిగిందని అప్పుడు అధికారులు చేసిన తప్పిదాలకు తాము శిక్షను అనుభవిస్తూ తమ తండ్రుల ఉద్యోగాలు రాక ఇబ్బందులు




పడుతున్నామని నిరుద్యోగంతో బట్టల షాపులలో, బొల్ల షాపులలో పనిచేసుకుంటున్నమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తమ సమస్య అర్థం అయ్యేలా కార్మిక సంఘాలు, రామగుండం ఎమ్మెల్యే ఈనెల 4న పెద్దపల్లిలో జరిగే యువ వికాస్ సభలో వివరించి వన్ టైం సెటిల్మెంట్ కింద తమకు ఉద్యోగాలు ఇచ్చేవిధంగా ఇప్పించాలని వేడుకున్నారు. ఈ విలేఖరుల సమావేశంలో సింగరేణి మారుపేర్ల విజిలెన్స్ బాధితులు శ్రావణ్,శ్రీనివాస్,ఈర్ల రాజయ్య,హరీష్,రంజిత్,పొన్నం వెంకటేష్, బొమ్మకకార్తీక్,శ్రావణ్,రమేష్,పుట్టసత్యం, కొమురమ్మ, పాల్గొన్నారు.

# డిసెంబర్ 3ను అమరుల దినోత్సవంగా గుర్తించాలి

- రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి..
- అమరుల బలిదానాలపై తెలంగాణ పుట్టింది.
- తెలంగాణ అమరులకు గుర్తింపు ఉండదా...
- అమరులను గుర్తుంచుకునే బాధ్యత మనకు లేదా..
- అమరుల త్యాగాలు రేపటి తరానికి నాంది...
- తెలంగాణ అమరుల కోసం ప్రత్యేక తేదీ కావాలి..
- తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సాధన కమిటీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్..

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 02:**

తెలంగాణ అమరవీరుల త్యాగాల పైన ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ అమరవీరులకు వారి బలిదానాలకు గుర్తింపు కావాలని తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సాధన కమిటీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్ అన్నారు. గురువారం హైదరాబాదులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇమంది ఉదయ్ కుమార్ మాట్లాడుతూ మంచి ఉద్యోగంలో ఉంటూ లక్షల జీతం తీసుకునే పోలీసులు చనిపోతే వారి జ్ఞాపకార్ధంగా స్మారక వారోత్సవాలు అక్టోబర్ 21వ తేదీన పోలీసుల అమరవీరుల సంస్మరణ దినంగా జరుపుకోవడం అందరికీ తెలిసిందే.. అదేవిధంగా ఫారెస్ట్ అమరవీరుల దినోత్సవం జాతీయస్థాయిలో నవంబర్ 11వ తేదీన నిర్వహించుకోవడం కూడా తెలిసిందే.. లక్షల రూపాయల జీతాలు తీసుకునే ఉద్యోగులు చనిపోయిన వారే అమరవీరులైతే మరి ఏ జీతం లేకుండా జీవితాన్ని తెలంగాణ కోసం త్యాగం చేస్తూ ప్రాణాలు వదిలేసిన వారిని ఏమనాలి ... వారు తెలంగాణ కోసం బలిదానం చేసిన అమరవీరులు కారా .. రేపటి తరానికి బంగారు భవిష్యత్తును అందించేందుకు తెలంగాణ రాష్ట్రం కోసం జీవితాలను తృణప్రాయంగా త్యాగం చేసిన వారు అమరవీరులు కాదా వారిని గుర్తుంచుకోవడం కోసం రేపటి తరాలకు వారి




జీవితాన్ని స్ఫూర్తిగా అందించడం కోసం ప్రత్యేక తేదీ ఉండకూడదా అంటూ తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సాధన కమిటీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్ అంటున్నారు.

తెలంగాణ అమరవీరుల కోసం ఒక ప్రత్యేక తేదీ అంటూ ఉంటే అమరవీరుల కుటుంబాలకు వారి త్యాగాలకు ఒక గుర్తింపు ఉంటుంది. నేటి తరానికి 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన త్యాగాలైనా, మలిదశ ఉద్యమానికి సంబంధించి జ్ఞాపకాలైన రేపటి తరానికి తెలియాలంటే తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవం అనేది ఉంటేనే సాధ్యమవుతుంది. అందుకే మలి దశ ఉద్యమాన్ని మలుపు తిప్పిన శ్రీకాంతచారి మరణించిన రోజు డిసెంబర్ 3ను తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా ప్రకటించాలని 2014 తెలంగాణ ఏర్పాటైన నాటినుండే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వేదికగా ఉద్యమాలు ఊపందుకున్నాయి. 2015లో తెలంగాణ అమరవీరుల సంస్కరణ దినోత్సవ సాధన కమిటీగా రిజిస్టర్ కాబడి ప్రొఫెసర్ కోదండరామ్ నేతృత్వంలో కార్యక్రమాలు జరిగాయి. 2015 భద్రాచలంలో జరిగిన గోదావరి పుష్కరాలలో మలిదశ ఉద్యమానికి కారణమైన అమరుడు శ్రీకాంతచారి కుటుంబ సభ్యులు తల్లిదండ్రులు శంకరమ్మ వెంకటాచారి సోదరుడు రవీంద్ర చారి మరియు కుటుంబ సభ్యులందరి ఆధ్వర్యంలో భద్రాచలం గోదావరిలో తెలంగాణ కోసం అమరులైన 1200 మంది అమరవీరులకు పిండ ప్రధాన కార్యక్రమాలు ఈ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం 2016లో జరిగిన కృష్ణా పుష్కరాల్లో సైతం హుజూర్నగర్ మఠంపల్లి కృష్ణా పుష్కర ఘాట్ లో కార్యక్రమాలను నిర్వహించి కృష్ణా పుష్కరాలను సైతం పిండ ప్రధాన కార్యక్రమాలు నిర్వహించారు.

తెలంగాణ ప్రభుత్వంలో ఎంతోమందికి తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఏర్పాటు చేయాలని వినతి పత్రాలు ఇస్తూ చివరకు నేటి ముఖ్యమంత్రి 2016లో తెలుగుదేశం ముఖ్య నాయకుడైన రేవంత్ రెడ్డికి సైతం తెలంగాణ అమరవీరుల సంస్కరణ దినోత్సవ ఏర్పాటుకై విజ్ఞాపన చేయగా ఈ విషయాన్ని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటానని హామీ ఇచ్చారు. అంతేగాకుండా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కు బహిరంగ లేఖను రాసి విడుదల చేస్తూ తెలంగాణ అమరవీరుల జ్ఞాపకార్థం కోసం తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను సైతం తెలిపారు. తమకు అవకాశం వచ్చిన రోజున తప్పనిసరిగా తెలంగాణ అమరవీరుల దినోత్సవాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.. పదేళ్ల తర్వాత అనుకోకుండా శ్రీకాంతాచారి పెట్రోల్ పోసుకున్న నవంబర్ 29 ఎలక్షన్లు జరగడం డిసెంబర్ మూడవ తేదీన శ్రీకాంతాచారి మరణించిన రోజున ఫలితాలు రావడం ఎలక్షన్లలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విజయం సాధించింది..

ఎలక్షన్లో ఫలితాలు వచ్చి ఏడాది కావస్తున్న సందర్భంలో డిసెంబర్ మూడవ తేదీన ఇప్పటికైనా తెలంగాణ అమరవీరుల జ్ఞాపకార్థం కోసం డిసెంబర్ 3ను అమరవీరుల దినోత్సవంగా ప్రకటిస్తారేమోనని ఎదురు చూస్తున్నాం..





# నూతన కానిస్టేబుల్‌లకు పోలీస్ స్టేషన్‌ల కేటాయింపు

- విధుల నియామక పత్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్
- పోలీసు విధులు చాలా ప్రత్యేకమైనవి.
- ప్రజలకు సేవలు అందించడానికి పోలీసు ఉద్యోగం చక్కని అవకాశం.
- లక్ష్యాలు, సవాళ్లతో కూడినది పోలీస్ ఉద్యోగం.
- లక్ష్యంతో పనిచేసి సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలి.
- క్రిమినల్స్ పట్ల కఠినంగా ఉండాలి.
- సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 2**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పోలీసు రిక్రూట్మెంట్ నందు ఉద్యోగం పొంది 9 నెలల శిక్షణ పూర్తి చేసుకొని 281 మంది నూతన కానిస్టేబుల్స్ జిల్లా కు వచ్చారు. ఇందులో 197 మంది సివిల్ కానిస్టేబుల్స్, 84 మంది, ఏఆర్ కానిస్టేబుల్స్ ఉన్నారు. జిల్లాకు వచ్చిన 281 మంది నూతన కానిస్టేబుల్ లకు జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో గల ఎస్వీ డిగ్రీ కళాశాల ఆడిటోరియం నందు జరిగిన సమావేశంలో విధుల నియామక పత్రాలను, పోలీస్ స్టేషన్ నియామక పత్రాలను అందించారు. నియామక పత్రాలు పొందిన నూతన కానిస్టేబుల్ లకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపి విధుల నిర్వహణకు సంబంధించి పలు కీలక సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. సివిల్ విభాగంలో పురుషులు 129 మంది, మహిళలు 68 మంది, ఏ ఆర్ విభాగంలో పురుషులు 65 మంది, మహిళలు 19 మంది ఉన్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో పోలీసు విధులు అనేవి చాలా ప్రత్యేకమైనవని, ఇతర శాఖల విధులతో పోలిస్తే పోలీసు డ్యూటీ క్లిష్టమైనదని, సవాళ్లతో, లక్ష్యాలతో కూడినది అన్నారు. విధుల నిర్వర్తించే సమయంలో సమాజం దృష్టి పోలీసు సిబ్బందిపై ఉంటుందని, కావున చక్కని యూనిఫాం లో క్రమశిక్షణతో, బాధ్యతగా, ఆదర్శంగా విధులు నిర్వర్తించాలని, ప్రజలతో మర్యాదగా మాట్లాడాలని తెలిపినారు. ప్రజలకు సేవలు అందించడానికి పోలీసు ఉద్యోగం మంచి మార్గం అన్నారు. క్రిమినల్స్ పట్ల కఠినంగా వ్యవహరిస్తూనే సాధారణ ప్రజలతో స్నేహపూర్వక వాతావరణం కలిగి ఉండాలని ఆదేశించారు. సమస్యలతో బాధితులు పోలీసు స్టేషన్ కు వస్తారు అలాంటి వారికి ధైర్యం, భరోసా కల్పించాలని అన్నారు. మన ప్రవర్తన, మన విధుల వల్ల మన తల్లిదండ్రులకు, పోలీస్ శాఖకు, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కోరారు. అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, అందరికీ సమాన సేవలు అందించాలని, బాగా పని చేసే వారికి సమాజంలో గుర్తిపు ఉంటుందని, రివార్డులు అందిస్తా మని అన్నారు. క్రమశిక్షణ లేకుండా ప్రజలను ఇబ్బందులు పెడితే శాఖాపరమైన చర్యలు ఉంటాయి అని హెచ్చరించారు.

శిక్షణలో నేర్చుకున్నవి అన్ని గుర్తు పెట్టుకోవాలని, ఎలాంటి విధులైనా నిర్వర్తించే విధంగా మానసిక దృఢత్వంతో, ఆత్మ విశ్వాసంతో ఉండాలని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవాలి అన్నారు, వత్తిడి లేకుండా పని చేయాలని, విధులతో పాటుగా ఆరోగ్యం కాపాడుకోవాలి అన్నారు. పని చేసే చోట సీనియర్స్ ను గౌరవించాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను అధిగమించడం, పరిష్కరించడం నేర్చుకోవాలని, సాంకేతికత బాగా అభివృద్ధి చెందినదనీ, సోషల్ మీడియా బాగా ప్రాచుర్యంలో ఉన్నదని, యూనిఫామ్ లో ఉండి సెల్ఫీ వీడియోలు, రీల్స్ లాంటివి సోషల్ మీడియా నందు పెట్టవద్దు అని తెలిపారు. విధుల నిర్వహణలో పురుషులు మహిళలు అందరూ సమానమేనని, అన్ని విధులు అందరూ నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు.లక్ష్యంతో పనిచేసి అక్రమ రవాణాను, అసాంఘిక కార్యకలాపాలను నివారించాల్సిన బాధ్యత మీపై ఉన్నదని, పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా ను అరికట్టడంలో, డ్రగ్స్ నివారించడంలో, సైబర్ మోసాలను నివారించడంలో, మహిళలకు రక్షణ కల్పించడం బాగా పని చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమం నందు ఆర్మడ్ అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విధంగా క్రమశిక్షణతో ఉంటూ విధులు నిర్వర్తించాలని, సమయానికి విధులకు చేరుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ఈ కార్యక్రమం నందు ఏ ఆర్ డిఎస్పి నరసింహ చారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు, ఆర్మడ్ ఇన్స్పెక్టర్స్ లు నారాయణ రాజు, నరసింహ, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఆర్ఎస్ఐలు సురేష్, అశోక్, అన్వర్, నూతన కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం రామగుండంపై వివక్ష చూపుతూ జిల్లాను చేయలేదు

- కనీసంఈప్రభుత్వం అయిన రామగుండంను రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలి,
- గోదావరిఖనిలో అర్బన్ తహాశీల్దార్ కార్యాలయం ప్రభుత్వం మంజురు చేయాలి,
- డిసెంబర్ 4న ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటించాలని డిమాండ్,
- డి హెచ్ పి ఎస్,మద్దెల దినేష్

**పెద్దపల్లి, డిసెంబర్ 2, వెలుతురు:** ప్రజలకు చేరువగా పాలన, సమర్థంగా పథకాల అమలు, పేదరిక నిర్మూలన, పటిష్ఠ పర్యవేక్షణ లక్ష్యాలతో గత ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణకు పూనుకుందని ఉమ్మడి రాష్ట్రంలోని తెలంగాణలో చివరిసారిగా 38 ఏండ్ల క్రితం అంటే 1978 ఆగస్టు 15న రంగారెడ్డి జిల్లా ఆవిర్భవించిందని, ఆ తర్వాత అనేక కొత్త జిల్లాల కోసం పోరాటాలు, ఉద్యమాలు డిమాండ్లు వచ్చినా సాధ్యపడలేదని, తెలంగాణ ఏర్పడిన అనంతరం గత కెసిఆర్ ప్రభుత్వం హయాంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ చట్టం–1974 ప్రకారం తెలంగాణలో కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారని, కొత్తగా జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. దీంతో రాష్ట్రంలో మొత్తం జిల్లాల సంఖ్య 33కి, రెవెన్యూ డివిజన్లు 76కి,మండలాలు 612 ఉన్నాయన్నాయని డి హెచ్ పి ఎస్ నేత మద్దెల దినేష్ పేర్కొన్నారు. సోమవారం, జిల్లా కేంద్రంలో ప్రజా వాణి సందర్భంగా అధికారులకు రామగుండం రెవెన్యూ డివిజన్గా ఏర్పాటు చేయాలని అదే విధంగా గోదావరిఖని లో అర్బన్ తహశీల్దార్ కార్యాలయం మంజూరు చేయాలని కోరారు. ఈ



సందర్భంగా మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుండి రామగుండంను చిన్నచూపు చూస్తుందని జిల్లాల పునర్విభజన సందర్భంగా రామగుండం జిల్లాను ఏర్పాటు చేయాలని ప్రజల కోరిక తిరస్కరించి పెద్దపల్లి జిల్లాగ ప్రకటించిందన్నారు. తదనంతరం రామగుండమును రెవెన్యూ డివిజన్‌ను ప్రకటిస్తామని ప్రభుత్వాలు హామీ ఇచ్చిన దానిని పూర్తిగా ప్రజా ప్రతినిధులు కూడా మర్చిపోయారని విమర్శించారు. రామగుండం జనాభా పరంగా రష్ట్రంలోని నగరాల్లో 5వ స్థానములో, వైశాల్యములో 4వ స్థానంలో ఉండి, అత్యధిక పన్నులను చెల్లిస్తున్న కార్పొరేషన్ లలో ఒకటిగా ఉండి, కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలకు అత్యధిక పన్నులు, రాయల్టీలను చెల్లిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలు కుడా ఎన్నో ఉండి జిల్లాగా ఏర్పడని (ఏర్పాటు చేయని) ప్రాంతముగా చరిత్రలో రామగుండము ప్రాంతం నిలిచిపోయిందన్నారుఅదే విధంగా మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పేరొంది, మూడు లక్షలకు పైగా జనాభా ఉన్న రామగుండము ప్రాంతాన్ని కాదని యాభై వేల జనాభా ఉన్న పెద్దపల్లిని ఒక జిల్లాగా నాటి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రామగుండము ప్రాంతానికి ప్రస్తుతం ఉన్న రెవిన్యూ డివిజన్‌ను పెద్దపల్లి, మూడు లక్షలకు పైగా ఉన్న రామగుండము ప్రాంత ప్రజలు రెవిన్యూ అవసరాలకు కొరకు పెద్దపల్లి నిత్యం 30 కిలోమీటర్లు ప్రయాణంచేసి వెళ్ళాల్సి వస్తుందన్నారు. పెద్దపల్లి జిల్లా విస్తీర్ణం: 2,236 చ.కి.మీ.
జనాభా 7,95,332, అక్షరాస్యత 60 శాతం
మండలాలు మొత్తం 14,అత్యధిక జనాభాగల మండలం రామగుండం,రెవెన్యూ డివిజన్లు పెద్దపల్లి, మంథని,రెవెన్యూ గ్రామాలు మొత్తం 215 ఉన్నాయన్నారు కావున రామగుండం, అంతర్గం, పాలకుర్తి తో కలిపి చుట్టూ ప్రక్కన ఉన్న మండలాలతో రామగుండం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డీమాండ్ చేశారు. కేవలం ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయం వల్ల రామగుండము ప్రాంత ప్రజలు వ్యయ ప్రయాసల పాలవుతున్నారని పెద్దపల్లి జిల్లాలో సగానికి పైగా జనాభా రామగుండము ప్రాంతములోనే కేంద్రీకృతమైందని పరిపాలన సౌలభ్యం కొరకే మీరు కొత్తగా జిల్లాలు ఏర్పాటు చేసిన అనంతరం రామగుండంను రెవెన్యూ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కడం జరిగిందన్నారు.
మూడు లక్షలకు పైగా జనాభా వున్నాకూడా ఈ రామగుండానికి కేవలం ఒకే ఒక తహశీల్దార్ కార్యాలయం వుండడం సరికాదని, గోదావరిఖనిలో అత్యధికంగా ఉన్న జనాభా ప్రతిపాదికన క్రింద చూసి ఖనిలో ఒక అర్బన్ తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. డిసెంబర్ 4న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ వస్తున్న సందర్భంగా రామగుండం రెవెన్యూ డివిజన్ గా, అర్బన్ తహశీల్దార్ కార్యాలయం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.




## పోలింగ్‌స్టేషన్‌లో ఓటర్లసంఖ్య పెంపుతో ఇబ్బంది కాదా?'

### ఈసీ వివరణకు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2(వెలుతురు):** ఒక పోలింగ్ స్టేషన్‌కు సంబంధించి గరిష్ఠ ఓటర్ల సంఖ్యను 1,200 నుంచి 1,500 వరకు పెంచాలని ఎలక్షన్ కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం(పిల్) పై సుప్రీంకోర్ట్ విచారణ జరిపింది. ఈ పిల్‌పై ఈసీ తన అభిప్రాయం చెప్పాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం సోమవారం ఈ ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ జరిపింది. పోలింగ్ స్టేషన్‌లో గరిష్ఠ ఓటర్ల సంఖ్య పెంచడానికి ఉన్న కారణాన్ని వివరిస్తూ మూడు వారాల్లోగా ఒక అఫిడవిట్ దాఖలు చేయాలని ఎన్నికల సంఘం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది మణిందర్ సింగ్‌ను ఆదేశించింది. గరిష్ఠ ఓటర్ల సంఖ్యను పెంచాలని నిర్ణయించడం ఆందోళనకరమని, ఏ ఓటరు కూడా తన ఓటింగ్ హక్కును కోల్పోకూడదని సుప్రీం స్పష్టం చేసింది. 'ఒక్కో ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లో మొత్తం ఓటర్ల సంఖ్యను పెంచినప్పుడు కచ్చితంగా సదరు నియోజకవర్గంలో ఉన్న రాజకీయ పార్టీలన్నింటినీ ఈసీ సంప్రదిస్తుంది' అని ఈసీ తరఫున హాజరైన న్యాయవాది మణిందర్ సింగ్ సుప్రీంకోర్ట్‌కు తెలిపారు. నిర్ణీత సమయం దాటినా- అప్పటికే పోలింగ్ కేంద్రానికి వచ్చిన వారికి ఓటు వేసేందుకు ఈసీ అనుమతిస్తుందని స్పష్టం చేశారు. సుప్రీంకోర్ట్ బెంచ్ ఈ పిల్ తరువాతి విచారణను 2025 జనవరి 25కు వాయిదా వేసింది. ఈ తేదీలోపు పిటిషనర్‌కు ఈసీ తన అఫిడవిట్ కాపీని అందజేయాలని స్పష్టం చేసింది. ఎలక్షన్ కమిషన్ ఆగస్ట్ నెలలో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ స్టేషన్‌లోని ఓటర్ల సంఖ్యను పెంచుతూ 2 ప్రకటనలు జారీ చేసింది. దీనిపై ఇందుప్రకాశ్ సింగ్ సుప్రీంకోర్ట్‌లో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఈసీ నిర్ణయం ఏకపక్షంగా ఉందని, ఎలాంటి అభిప్రాయ సేకరణ చేయకుండా, డేటాను విశ్లేషించకుండా ఈ నిర్ణయం తీసుకుందని ఆయన ఆరోపించారు.

## హైదరాబాద్‌ను కాపాడాలనే హైడ్రా

### హైడ్రాకు తూట్లు పొడిచే ప్రయత్నాలు
### బీఆర్‌ఎస్ సినిమాకు శుభం కార్డు పడింది
### సమగ్ర సర్వేను అటకెక్కించిన బీఆర్‌ఎస్
### తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శలు

**హైదరాబాద్,డిసెంబర్2(వెలుతురు):** హైదరాబాద్‌ను కాపాడాలనే ఉద్దేశంతోనే హైడ్రాను తీసుకువచ్చామని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. దీనికి కూడా తూట్లు పొడిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొన్నేళ్లపాటు కేబినెట్లో మహిళలకు చోటు కల్పించని పార్టీ బీఆర్ఎస్ అని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో




సమగ్ర సర్వే చేయించి ఆ తర్వాత దానిని అటకెక్కించారని విమర్శించారు. బీసీలకు బీఆర్ఎస్ అనుకూలమా? కాదా? చెప్పాలని నిలదీశారు. దామాషా పద్ధతిలో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఫలాలు దక్కాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే తాము బీసీ గణన చేపడుతున్నట్లు చెప్పారు. బతుకమ్మ చీరల పేరిట గత ప్రభుత్వం నేతన్నల జీవితాలను ఆగం చేసిందన్నారు. సూరత్ నుంచి చీరలను తెచ్చి ఇచ్చారని మండిపడ్డారు. ఆ చీరలు కూడా మహిళలు కట్టుకోవడానికి ఉపయోగపడలేదని... పంటచేలలో బెదురు పెట్టేందుకు ఉపయోగపడ్డాయని విమర్శించారు. ఒక్క డీఎస్సీ ఇవ్వని ప్రభుత్వం కేసీఆర్‌దే అన్నారు. గ్రూప్-1 పేపర్లు లీక్ చేసిన చరిత్ర ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ సినిమాకు శుభం కార్డు పడిందని చురక అంటించారు.

## మైనారిటీలపై భారత్‌లోనూ దాడులు

### భారత్, బంగ్లాదేశ్ ల మధ్య పెద్ద తేడా లేదు
### మెహబూబా ముఫ్తీ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2(వెలుతురు):** బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై దాడులు జరుగుతున్నాయి.. అదేవిధంగా భారత్ లోనూ మైనారిటీలపై దాడులు జరిగితే ఇక ఈ రెండు దేశాల మధ్య తేడా ఏమున్నట్టు? అంటూ జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ సంచలన వ్యాఖ్యలు చేశారు. నవంబర్ 24న ఉత్తరప్రదేశ్ లోని సంభాల్ లో జరిగిన హింసను ప్రస్తావిస్తూ ముఫ్తీ ఈ వ్యాఖ్యలు చేశారు. పాలకులు దేశాన్ని 1947 నాటి కాలం వైపు నడిపిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో యువతకు ఉద్యోగాలు లేవు, తగినన్ని



ఆసుపత్రులు లేవు, సరైన విద్యావకాశాలు లేవని గుర్తుచేశారు. పాడైపోయిన రోడ్లను బాగుచేయాల్సిన పాలకులు ఆ విషయం పక్కన పెట్టి ఆలయాల ఆనవాళ్ల కోసం మసీదులను కూల్చి ఆ శిథిలాల్లో వెతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంభాల్ తరహాలోనే అజ్మీర్ దర్గాపైనా వివాదం సృష్టించారని, ఆలయ స్థలంలో దర్గాను నిర్మించారని కొంతమంది కోర్టుకెక్కారని చెప్పారు. మతసామరస్యానికి వేదికగా నిలిచే అజ్మీర్ దర్గాలో సర్వే పేరుతో తవ్వకాలకు సిద్ధమవుతున్నారని ముఫ్తీ మండిపడ్డారు. మైనారిటీలపై దాడుల విషయంలో ఇండియాకు, బంగ్లాదేశ్ కు తేడా కనిపించడంలేదని అన్నారు. ఉత్తరప్రదేశ్ సంభాల్ లోని షాహి జామా మసీద్ ఉన్న స్థలంలో గతంలో ఓ ఆలయం ఉండేదని, దానిని కూల్చేసి మసీదును కట్టారని యూపీ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిని విచారించిన కోర్టు.. మసీదు స్థలంలో సర్వే చేయాలని ఆదేశించింది.

కోర్టు ఆదేశాలతో అధికారులు సర్వే చేయడానికి ప్రయత్నించగా స్థానిక ముస్లింలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన గొడవలో పోలీసులు జరిపిన కాల్పుల్లో నలుగురు చనిపోయారు. దీంతో సంభాల్ ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటనను ప్రస్తావిస్తూ మైనారిటీలపై మన దేశంలోనూ దాడులు జరుగుతున్నాయంటూ ముఫ్తీ ఆవేదన వ్యక్తం చేశారు.

## కేసీఆర్ ఒక మొక్క కాదు.. వేగుచుక్క : కవిత

**హైదరాబాద్, డిసెంబర్ 2 (వెలుతురు):** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మొక్క అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. కేసీఆర్ మొక్క కాదు పీకేయడానికి కేసీఆర్ ఒక వేగుచుక్క అని కొనియాడారు. రేవంత్ రెడ్డి గురువులకే చుక్కలు చూపించి తెలంగాణ సాధించిన శక్తి కేసీఆర్ అని కవిత ప్రశంసించారు. ఎమ్మెల్సీ కవిత నివాసంలో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తే ఊరుకోబోము. ముఖ్యమంత్రి, మంత్రులు అదే పనిగా తిట్ల పరిపాలన చేస్తున్నారు. కేసీఆర్ పాలనలో నిధులు వరదలయ్యి పారేవి ఇప్పుడు రాష్ట్రంలో తిట్లు పారుతున్నాయని కవిత విమర్శించారు.

## ప్రజా కళాకారులారా... ఉద్యమాలకు ఊపిరిలూదండి

### - సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ పిలుపు

**వెలుతురు న్యూస్ సూర్యాపేట డిసెంబర్ 2:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల పట్ల ప్రజలు చైతన్యం అయ్యేవిధంగా తమ కలాలకు, గళాలకు పదును పెట్టి ఉద్యమాలకు ఊపిరులూదాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం బొమ్మగాని ధర్మబిక్షం భవన్ లో తెలంగాణ ప్రజానాట్య మండలి సూర్యాపేట జిల్లా స్థాయి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ

కళ ప్రజా చైతన్యానికి ఆయుధమని, సామాజిక రుగ్మతలపై యువతను, చైతన్యం చేయాల్సిన బాధ్యత కళాకారులదేనని ఇటీవల కాలంలో యువత డ్రగ్స్, గంజాయి లాంటి మాదక ద్రవ్యాలకు బానిసలు అవ్వటం వల్ల సమాజానికి ప్రమాదం పొంచి ఉన్నందున భావి భారత పౌరులకు వారి కర్తవ్యం ఏమిటో వారికి అర్థమయ్యేలా కళారూపాల ద్వారా వారిని చైతన్య పరచి,వారు సమాజానికి ఉపయోగపడేలా తయారు చేయాలని ఆయన ఉద్భోదించారు.

తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే శ్రీనివాస్ మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలు కాలంగా భారత రాజకీయాలు మతం బారిన పడ్డాయని, రాజకీయాల్లోకి రాముడిని గుంజి ఒక రాజకీయ పార్టీ అబ్బాం గడుపుకుంటున్నదని, దేశ ప్రజలకు విద్య, వైద్యం ఉపాధి సామాజిక న్యాయం లభించాలంటే దేశంలో రాష్ట్రాల్లో వామపక్ష ఉద్యమం బలోపేతం కావడం ద్వారానే సాధ్యమవుతుందని ఆయన అన్నారు. పట్టణ సిపిఐ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ప్రజానాట్య మండలి జిల్లా నిర్మాణ బాధ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రజానాట్య మండలి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జంపాల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి దొంతగాని సత్యనారాయణ, సిపిఐ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్, గోపన బోయిన వెంకటేశ్వర్లు, ఎడెల్లి శ్రీకాంత్, తొట్ల ప్రభాకర్, నంద్యాల రామిరెడ్డి, తాళ్ల సైదులు పాల్గొన్నారు.



## ఘనంగా ఆరోగ్య ఉత్సవాలు - వర్చువల్ విధానంలో నర్సింగ్ కళాశాల, మైత్రి క్లినిక్ ప్రారంభోత్సవం

### - పాల్గొన్న జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా, వెలుతురు న్యూస్**

ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగల్ పల్లి లో భారత్ ఇన్స్టిట్యూట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఆరోగ్య దినోత్సవం కార్యక్రమములో కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్ రావు, ఆర్డీఓ అనంత రెడ్డి, ఆదిభట్ల మున్సిపల్ ఛైర్మన్ నిరంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వర్చువల్ పద్ధతిలో ప్రభుత్వ నర్సింగ్ కళా శాలను, మైత్రి ట్రాన్స్ క్లినికను మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ప్రారంభించగా, స్థానికంగా జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ సి.నారా యణ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఈ రోజు నర్సింగ్ కళాశాలను మెడికల్ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేయడం శుభసూచకమనీ ఈ నర్సింగ్ కాలేజీలో విద్యార్థినిలకు కావలసిన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని ఆయన అన్నారు. తరచూ ఈ కళాశాలను



సందర్శిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఫ్యాకల్టీ పరంగా గాని, ఇతర మెడికల్ ఎక్విప్మెంట్ సదుపాయాలను కూడా సమకూరుస్తామని అన్నారు.

ఈ నూతన కాలేజీలో చేరి నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియ చేశారు. ముందుగా నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల నూతన భవనాన్ని





పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి, ఇబ్రహీంపట్నం తహశీల్దార్ సునీత, వైద్యారోగ్య శాఖ అధికారులు, నర్సింగ్ విద్యార్థులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి(65)ఫిర్యాదులు

### ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా, వెలుతురు న్యూస్**

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు.



సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశమ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల వద్ద నుంచి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతలతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వెంట వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వివిధ అంశాలపై 65 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రెవెన్యూ శాఖ - 53, ఇతర శాఖలకు- 12, మొత్తం 65 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ NRGS ద్వారా ఆయిల్ ఫామ్



మొక్కలు పెంపకానికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, ఉద్యానవన శాఖలు సమన్వయంతో పని చేస్తూ రైతులకు సబ్సిడీలు అందే విధంగా కృషి చేస్తూ పెద్ద ఎత్తున ఆయిల్ ఫామ్ మొక్కలు పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. జిల్లా

అధికారులు సమన్వయంతో పని చేయాలని, పెండింగు పనులను ముందుగా పరిష్కరించాలని, అంకిత భావంతో పని చేయాలని, కింది స్థాయిలో శాఖ పని తీరును పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేసి పనులు పెండింగులో లేకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఫైల్స్ పెండింగ్ పెట్టకుండా నిబంధనల ప్రకారం పనుల చేయాలని అన్నారు.

## 2047 నాటికి విక్షిత్ భారత్ లక్ష్యం

### ఉద్యోగుల శిక్షణకు స్వదేశీ ఫ్రేమ్‌వర్క్
### వికాస్, గర్వ, కర్తవ్య, ఐక్యత అనే నాలుగు సందేశాలతో రూపకల్పన
### హెచ్‌ఆర్ సభ్యుడు ఆర్ బాలసుబ్రహ్మణ్యం వెల్లడి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2(వెలుతురు):** స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారి భారతదేశంలో నైపుణ్యాభివృద్ధికి స్వదేశీ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించింది కేంద్ర ప్రభుత్వం. 2047 నాటికి విక్షిత్ భారత్ అనే మోదీ గారి లక్ష్యానికి అనుగుణంగా ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించారు. ఆధునిక బ్యూరోక్రసీకి శిక్షణ ఇవ్వడానికి 2021లో ప్రధాని మోదీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ద్వారా దీనిని డెవలప్ చేశారు. కర్మయోగి కాంపిటెన్సీ ఫ్రేమ్ వర్క్ పేరుతో రూపొందించిన ఈ కోర్సు.. ముస్సూరీలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌తో సహా ప్రభుత్వ శిక్షణా అకాడమీలలో కోర్సులు, వర్క్‌షాప్‌లకు పునాదిగా ఉపయోగిస్తున్నారు. ఈ ఫ్రేమ్‌వర్క్‌లో అంశాలను భగవద్గీతలోని అంశాల ఆధారంగా పేర్కొన్నారు. సహకారం, స్వాధ్యాయ, రాజ్య కర్మ, స్వధర్మం అనే నాలుగు ప్రధాన ధర్మాలను పెంపొందించడానికి ఈ ఫ్రేమ్ వర్క్‌లో అంశాలను ప్రస్తావించారు. 3.2 మిలియన్ల మంది పౌర సేవలకు శిక్షణిచ్చేందుకు ఈ మొట్టమొదటి మేడ్ ఇన్ ఇండియా మాడ్యుల్‌ను రూపొందించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుకు శిక్షణ ఇచ్చేందుకు ఈ మాడ్యుల్‌ను రూపొందించారు. ఈ విషయమై కెపాసిటీ బిల్డింగ్ కమిషన్‌లోని హెచ్‌ఆర్ సభ్యుడు ఆర్ బాలసుబ్రహ్మణ్యం పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. బ్యూరోక్రసి శిక్షణా ఫ్రేమ్‌వర్క్ విషయంలో ఇప్పటి వరకు పశ్చిమ దేశాలను అనుకరిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు స్వంత ఫ్రేమ్ వర్క్‌ను ఉపయోగిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ఫ్రేమ్ వర్క్ భారతీయ నాలెడ్జ్ సిస్టమ్, భగవద్గీత సూత్రాలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఈ ఫ్రేమ్ వర్క్‌ను డెవలప్ చేయడానికి 18 నెలలకు పైగా సమయం తీసుకున్నామని బాలసుబ్రమణ్యం తెలిపారు. ఈ ఫ్రేమ్ వర్క్ దాదాపు 60 మంత్రిత్వ శాఖలు, 93 విభాగాలతో పాటు వాటి కింద 2,600



పైగా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల అవసరాలను తీర్చాలని భావిస్తోంది. కమిషన్ ప్రతి ఉద్యోగి వారి సంబంధిత పని విభాగాలలోని పాత్రలను మ్యాప్ చేసిందని, ఆశించిన ఫలితాలను సాధించడానికి అవసరమైన నిర్దిష్ట సామర్థ్యాలను గుర్తించిందని డాక్టర్ ఆర్ బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఫ్రేమ్‌వర్క్‌లోని అంశాలపై కమిషన్ ఎలా నిర్ణయం తీసుకుందనే దానిపై బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. 'భారతదేశ భవిష్యత్తును నిర్దేశించడానికి ప్రధాని మోదీ చెప్పిన విషయాలను పరిగణలోకి తీసుకున్నాము. ప్రధాని మోదీ చెప్పిన వికాస్, గర్వ, కర్తవ్య, ఐక్యత అనే నాలుగు సందేశాలను గుర్తించాము. ఈ నాలుగు తీర్మానాలను సాధించడానికి, ప్రభుత్వ అధికారులు నాలుగు పునాది విలువలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని మా పరిశోధనలో తేలింది. వీటికి అనుగుణంగా ఫ్రేమ్ వర్క్‌ను డిజైన్ చేశామని' చెప్పుకొచ్చారు. ఇదిలా ఉంటే ఫ్రేమ్‌వర్క్ అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు భౌతికంగా శిక్షణను అందించడానికి వార్షిక జాతీయ అభ్యాస వారోత్సవాన్ని నిర్వహించాలని కేంద్రం యోచిస్తోంది. ఇటీవల ఢిల్లీలో ఈవారం మొదటి ఎడిషన్ ముగిసింది. ఇందులో కేంద్ర, రాష్ట్రాలల నుంచి 4.8 మిలియన్ల మంది పౌర సేవకులను ఆకర్షించింది. 43 శాతం మంది కనీసం నాలుగు కోర్సులను పూర్తి చేసారు.

## జీవో 317పై ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కసరత్తు

### మార్గదర్శకాలు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్,డిసెంబర్2(వెలుతురు):** జీవో 317కు సంబంధించి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులకు అనుగుణంగా సీఎస్ శాంతికుమారి మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ మేరకు మార్గదర్శకాలతో కూడిన జీవో ఎంఎస్ నెం. 243, 244, 245 జారీ చేశారు. మెడికల్, స్పౌస్, మ్యూచువల్ ఆధారంగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వీటికి సంబంధించిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మూడు కేటగిరీలకు సంబంధించి విడివిడిగా మార్గదర్శకాలను జారీ చేశారు. ఖాళీలకు లోబడి స్థానిక కేడర్‌లో మార్పు, బదిలీకి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో ఆయా స్థానాల్లో ఉన్న ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని ప్రభుత్వం అందులో పేర్కొంది.

## మహిళలు ఏమైనా కుందేళ్లా

### పిల్లల్ని కంటే ఉద్యోగాలు దొరికే పరిస్థితి కూడా లేదు
### మోహన్ భగవత్ వ్యాఖ్యలపై రేణుకా చౌదరి ఆగ్రహం

**హైదరాబాద్,డిసెంబర్2(వెలుతురు):** వరుసగా పిల్లలను కనడానికి మహిళలు ఏమైనా కుందేళ్లా అని కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకా చౌదరి మండిపడ్డారు. ప్రతి జంట ముగ్గురు పిల్లలను కనాలని ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ ఇటీవల పిలుపునిచ్చారు. దేశంలో జనాభా వృద్ధి రేటు తగ్గుదలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ మహిళా నేత రేణుకా చౌదరి తీవ్రంగా స్పందించారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, పిల్లల్ని కంటే ఉద్యోగాలు దొరికే పరిస్థితి కూడా లేదన్నారు. ఉద్యోగం లేని అబ్బాయిలకు అమ్మాయిలను ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రారన్నారు. మోహన్ భగవత్ ఎక్కువమంది పిల్లలను కనాలని చెబుతున్నాడని, కానీ అలా కనేందుకు మహిళలు కుందేళ్లు కాదన్నారు. ఈ మాటలు చెప్పేవాళ్లు ఎంతమంది పిల్లలను పెంచగలరు అని ప్రశ్నించారు. అలా మాట్లాడేవారి అనుభవాలు ఏమిటో బాగా తెలుసని వ్యాఖ్యానించారు.

# పంజాబీ దమ్ ఆలూ రెసిపి



**దమ్ ఆలూగా కూడా పిలిచే ఈ వంటకం చక్కగా ఉడికిన, మసాలా దినుసులన్నీ కూరబడిన ఆలూ, ఇంకా కస్తూరి మెంతులు, జీలకర్ర, జీడిపప్పు, ఏలకులు, దాల్చిన చెక్క, ఇతర భారతీయ దినుసులన్నీ వేసి నోరూరించే కూరల అద్భుతమైన కాంబినేషన్.**



పంజాబీ దమ్ ఆలూ వంటకం ప్రపంచంలోనే నోరూరించే పంజాబీ ఆహార స్టైల్ నుంచి వచ్చింది. మొదటిసారి రుచి చూసినప్పటినుండి అందరికీ అభిమాన ఆలూ రెసిపి అయిపోయింది. ఇది సులభంగా వండుకోగలిగే వంటకం,పైగా ఆఖరున నోరూరించే కూర తయారైనప్పుడు మనకి ఇంకా ఇంకా తినాలనిపించే వంటకం కాబట్టి పంజాబీ ఆలూ ఎన్నటికీ బోర్ కొట్టదు. పంజాబీ ఆహారంలోనే ముఖ్య వంటకమైన పంజాబీ ఆలూ రెసిపి భారతీయ ప్రసిద్ధ వంటకంగా ప్రపంచంలో పేరు తెచ్చుకుంది.దీన్ని మీరు దాదాపు ఏ పెళ్ళిలోనైనా ,ఇతర ఫంక్షన్లలోనైనా చూడవచ్చు. ఈ రెసిపిలో ప్రత్యేకత ఏంటంటే ఇది మామూలుగా పెరుగుకి సంబంధించిన తడి కూర అయినా కూడా, మనం దీన్ని పొడి దమ్ ఆలూ మసాలాగా మార్చుకుని ముఖ్య భోజనం ముందు వంటకంలా వడ్డించుకోవచ్చు.

### కావలసినవి

1.చిన్న బంగాళదుంపలు 15–18 2.కొత్తిమీర చేతికి పట్టినన్ని 3.టమాటా ప్యూరీ 3/4 కప్పు 4.పెరుగు 3/4కప్పు 5.నూనె 5చెంచాలు 6.ఉల్లిపాయ 1 కప్పు 7.అల్లంవెల్లుల్లి పేస్టు 1 చెంచా 8.జీలకర్ర 1 చెంచా 9. జీడిపప్పు 6–7 10. దాల్చినచెక్క 1 ముక్క 11.ఏలకులు1 12.లవంగాలు1 13.ధనియాలు 1చెంచా 14.కస్తూరి మెంతులు 1 చెంచా 15. పంచదార 1 చెంచా 16.కారం 1 చెంచా 17.ఉప్పు1 చెంచా 18. ఇంగువ1 చెంచా 19. బిర్యానీ ఆకు 1 20.పసుపు 1 చెంచా

### తయారు చేసే విధానం:

1. మిక్సీ జార్లో ధనియాలు, దినుసులు, జీడిపప్పు, జీలకర్ర అన్నీవేసి మెత్తని పొడిలా మిక్సీ పట్టండి.
2. కుక్కర్ తీసుకుని నీళ్ళు పోసి, బంగాళదుంపలు వేయండి.
3. బంగాళదుంపలు మెత్తగా అయ్యేవరకు కుక్కర్ లో ఉడికించండి.
4. బంగాళదుంపల తొక్కు తీసేసి, ఫోర్క్ తో ఆలూలలో గుచ్చండి. దానివలన దినుసులు లోపలి వరకూ వెళ్తాయని ఖచ్చితంగా తెలుస్తుంది.
5. ఒక పెనం తీసుకుని, నూనె వేసి, బంగాళదుంపల పైపొర గోధుమరంగులోకి మారేదాకా వేయించండి.
6. ఇంకో పెనం తీసుకుని, నూనె,బిర్యానీ ఆకు, అల్లం వెల్లుల్లి పేస్టు, ఉల్లిపాయ ముక్కలు వేసి ఉల్లిముక్కలు లేత బ్రౌన్ రంగులోకి మారేదాకా కలపండి.
7. టమాటా ప్యూరీని వేసి మళ్ళీ కలపండి.
8. ప్యూరీ గట్టిపడుతుంటే, మసాలా దినుసుల మిశ్రమాన్ని వేసి ఆపకుండా కలుపుతూ ఉండండి.
9. పెరుగు, కారం, ఉప్పు వేసి బాగా కలపండి
10. పసుపు, పంచదార వేసి 23నిమిషాలు కలిపి నీళ్ళు ఆఖరిలో పోయండి.
11. కస్తూరి మెంతులు వేసి ఒక నిమిషం కలపండి.
12. మూతలు ఉంచి కొన్ని నిమిషాలు ఉడకనివ్వండి, కూర గట్టిపడుతూ, అన్ని దినుసుల వాసన మీకు తెలుస్తుంది.
13. బంగాళదుంపలను ఈ కూరలో వేసి బాగా కలపండి.
14. బంగాళదుంపలు కూరలో వేసి ఉడికించాక, దమ్ ఆలూను బౌల్ లోకి తీయండి. 15.ఇక దీన్ని కొత్తిమీరతో పైన అలంకరించి చపాతీ లేదా పూరీకి పక్కన వంటకంలా వడ్డించండి.





## రుచికరమైన కాకరకాయ చిప్స్

**కావలసిన పదార్థాలు**

కాకరకాయలు – అరకిలో
ఎండుకొబ్బరి తురుము – పావుకప్పు
జీడిపప్పు – పావుకప్పు
పసుపు – 1 టీ స్పూన్
కారప్పూస – అరకప్పు
పంచదార – పావుకప్పులో సగం
జీలకర్ర 1 టీ స్పూన్
కరివేపాకు 1 కట్ట
కారం – 2 టీ స్పూన్లు
నూనె – అరకప్పు
ఉప్పు తగినంత

**తయారీ విధానం**

కాకరకాయలకు పొట్టు, లోపలి గింజలు తీసి గుండ్రంగా చిన్న ముక్కలు కోయాలి. వీటిలో ఉప్పు, పసుపు, మంచినీళ్లు పోసి ఉడికించి ఆ నీళ్లని వంపేయాలి. మళ్లీ వీటిలో పంచదార, మంచినీళ్లు పోసి ఉడికించి, మిగిలిన నీళ్లన్నీ పిండేయాలి.

బాండీలో నూనె వేడి చేసి జీలకర్ర, ఇంగువ, పసుపు, కరివేపాకు వేయించాలి. అందులోనే ఉడికించిన కాకరకాయ ముక్కలు కొద్దిగా వేయించాలి. తర్వాత ఎండుకొబ్బరి, కారప్పూస, వేయించిన జీడిపప్పు, కారం, ఉప్పు కలిపి చివర్లో కొత్తిమీర తరుగు చల్లాలి.

- పసుపు నీటితో వంటగదిని శుభ్రం చేయడం వల్ల ఈగలు దరి చేరవు.
- క్యాబేజీని ఉడికించే సమయంలో వాసన వస్తుంటుంది. వాసన రాకుండా ఉండాలంటే చిన్నం అల్లం ముక్క వేసి తేడాను గమనించండి.

## కాలీఫ్లవర్ రుచులు

### కాలీఫ్లవర్ వల్కనో

**కావలసినవి:** కాలీఫ్లవర్1 (పెద్దది), వైట్‌సాస్3 కప్పులు చీజ్అరకప్పు, ఉప్పుతగినంత మిరియాలపొడితగినంత వైట్‌సాస్ తయారీకి వెన్న ఒకటిన్నర టేబుల్ స్పూన్లు కార్న్‌ఫ్లోర్ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, పాలు 3కప్పులు

**తయారుచేసే విధానం:** ఒకసాస్‌లో వెన్నను కరిగించి, కార్న్‌ఫ్లోర్‌ను దానికి బాగా కలిపి పాలుపోయండి. సన్నని మంటమీద కలుపుతూ, సాస్ చిక్కబడేంతవరకూ ఉడికించండి. తగినంత ఉప్పును చేర్చండి వైట్‌సాస్ తయారవ్వుతుంది. కాలీఫ్లవర్‌ను అడుగుచెక్కి శుభ్రంగా కడగండి. ప్రెషర్ కుక్కర్‌లో ఉంచి, ఉడికించండి. అరగంట ఉడికించి బయటకు తీయండి. ఉప్పు, మిరియాల పొడి దానిమీద చల్లండి. బేకింగ్ డిష్‌లో ఉంచి దానిమీద వైట్‌సాస్ పోయండి. తురిమిన చీజ్ చల్లి ఓవెన్‌లో ఉంచి, చీజ్ కరిగిన తరువాత బయటకు తీయండి. వేడిగా సర్వ్ చేయండి.



### షాహీ గోబీ మటర్

**కావలసినవి:** కాలీఫ్లవర్ ఒక కిలో పచ్చి బఠానీపావ్వకిలో, ఉల్లిపాయలు4 అల్లంఅంగుళం ముక్క, వెల్లుల్లిరేకలు10 జీలకర్రఒక టీ స్పూన్, గరం మసాలా ఒక టీస్పూన్ పచ్చిమిరపకాయలు4 లేక 6, ఆమ్‌చూర్అర టీస్పూన్ టమాటాలు అరకిలో, పెరుగుఅరకప్పు కోవాఒక టేబుల్‌స్పూన్ ఎండుద్రాక్ష రెండు టేబుల్ స్పూన్లు నెయ్యినాలుగు టేబుల్ స్పూన్లు కొత్తిమీరఒక కట్ట, ఉప్పురుచికి తగినంత


**తయారుచేసే విధానం:** బఠానీలను మెత్తగా ఉడికించి నీటిని వార్చి ఓ ప్రక్కన ఉంచండి. కాలీఫ్లవర్‌ను విడివిడిపూలుగా తరగండి. రెండు టేబుల్‌స్పూన్ల నేతిని వేడిచేసి కాలీఫ్లవర్ ముక్కలను కొంచెం ఎర్రబడేంతవరకు వేయించాలి. వెడల్పాటి పాన్‌లో మిగిలిన నేతిని వేడిచేసి అందులో తరిగిన ఉల్లిముక్కలు, రెండు పచ్చిమిరపకాయలు తరిగిన ముక్కలు, తరిగిన అల్లం, వెల్లుల్లి, జీలకర్ర, ఆమ్‌చూర్ గరం మసాలా కలపాలి. తరిగిన టమాటా ముక్కలు వేసి, కలిపి వేయించి పెట్టుకున్న కాలీఫ్లవర్ ముక్కలు, ఎండు ద్రాక్ష, కోవాలను చేర్చి కలిపి, రెండు కప్పుల నీరు పోయండి. బఠానీలో వేసి పది నిమిషాలు ఉడికించండి. మిగిలిన పచ్చి మిరపకాయలను కొత్తిమీరను తరిగి పైన చల్లి వేడిగా వడ్డించండి.

## సూప్స్ అండ్ స్టాటర్స్

### బేబీ కార్న్ స్టాటర్స్ ...

**కావల్సిన పదార్థాలు :** బేబీకార్న్ 15, పెరుగు సగం కప్పు, జీలకర్ర రెండు చెంచాలు, ఉప్పురుచికి తగినంత, మైదా 1/2కప్పు, మొక్కజొన్న పిండి సగం కప్పు, నిమ్మరసంఅరచెంచా, కారంఅరచెంచా, నూనె వేయించడానికి సరిపడా

**తయారీ విధానం:** ముందుగా బేబీ కార్న్ శుభ్రంగా కడిగి రెండు పొడవు ముక్కల్లా చేసుకోవాలి. ఓ గిన్నెలో సగం దాకా నీళ్ళు పోసి అందులో ఈ బేబీకార్న్ ముక్కలు వేసి స్టౌ మీద పెట్టాలి . నీళ్ళు కొద్దిగా వేడి అయ్యాక బేబీకార్న్ ముక్కల్ని వేయాలి. నీళ్లు మరిగాక దింపి బేబీకార్న్‌ని వేడినీటిలోనే ఉంచి పక్కకు పెట్టాలి. ఐదుని ముషాలయ్యాక నీటిని వంపేయాలి. ఓ గిన్నెలో పెరుగు, తగినంత ఉప్పు, చెంచా జీలకర్రపొడి తీసుకొని బాగా కలపాలి. ఇందులో బేబీకార్న్‌ని వేసి వాటిని పెరుగు బాగా పట్టేలా కలిని ఒక గంటసేపు అలాగే ఫ్రిజ్ లో ఉంచాలి. ఆలోపు మైదా, మొక్కజొన్న పిండి, మిగిలిన జీలకర్రపొడి, కారం, మరికొంచెం ఉప్పు, నిమ్మరసం ఓ గిన్నెలో తీసుకొని నీళ్ళు పోసుకుంటూ చిక్కని పిండిలా కలుపుకోవాలి. ఇప్పుడు ఫ్రిజ్ లో ఉంచిన బేబీకార్న్‌ని తీసి మైదా మిశ్రమంలో ముంచి కాగుతున్న నూనెలో వేయాలి. అన్ని వైపులా ఎర్రగా వేగిన తర్వాత పక్కకు తీసేయాలి. కచెప్‌తో వేడి వేడిగా తింటే రుచికరంగా ఉంటాయి.



### పాలకూర, స్వీట్ కార్న్ సూప్

**కావల్సిన పదార్థాలు:** స్వీట్‌కార్న్ రెండు కప్పులు, వెల్లుల్లి తరుగు టేబుల్‌స్పూను, ఉప్పు తగినంత, మిరియాలపొడి రుచికి సరిపడా, పాలకూర తరుగు కప్పు, నూనె రెండు చెంచాలు, క్రీం కొద్దిగా.

**తయారీ విధానం:** పొయ్యిమీద బాణలి పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక వెల్లుల్లి తరుగు వేయించాలి. నిమిషమయ్యాక స్వీట్‌కార్న్ వేసి వేయించాలి. అవి కాస్త వేగాక నాలుగు కప్పుల నీళ్లు పోసి మంట పెంచాలి. అవి మరుగుతున్నప్పుడు తగినంత ఉప్పూ, మిరియాలపొడీ వేసి దింపేయాలి. ఆ నీళ్ల వేడి తగ్గాక స్వీట్‌కార్న్‌ని మిక్సీలో తీసుకుని మెత్తని గుజ్జులా చేసుకోవాలి. దీన్ని మళ్లీ నీళ్లలో వేసి పొయ్యిమీద పెట్టాలి. రెండు నిమిషాల తరవాత పాలకూర తరుగు వేసి మంట తగ్గించాలి. కాస్త ఉడికాక దింపేసి క్రీం వేస్తే చాలు.

### చికెన్ టిక్కా

**కావల్సిన పదార్థాలు:** ఎముకల్లేని చికెన్ ముక్కలు అరకేజీ, సెనగపిండి ఒకటిన్నర టేబుల్‌స్పూను, పెరుగు కప్పు, కారం చెంచా, మిరియాలపొడి, గరంమసాలా అరచెంచా చొప్పున, పసుపు పావుచెంచా, ఉప్పు తగినంత, ధనియాలపొడి అర చెంచా, కసూరీమేథీ ముప్పావుచెంచా, నిమ్మరసం టేబుల్‌స్పూను, బిర్యానీ మసాలా అరచెంచా.

**తయారీ విధానం:**

పైన సిద్ధంచేసుకున్న పదార్థాలన్నింటినీ ఓ గిన్నెలోకి తీసుకుని అన్నింటినీ బాగా కలపాలి. ఈ గిన్నెను ఫ్రిజ్‌లో అరగంట నుంచి గంట ఉంచాలి. తరవాత ఇవతలకు తీసి ఇనుప చువ్వలకు గుచ్చి నిప్పులమీద కాల్చుకోవాలి. ■

## నోరూరించే వంటలు.... చేయటంలో మెళకువలు!

**వంటగదిలో రుచికరమైన వంటలు చేయాలని చూస్తున్నారా? మంచి వంటకాలు ఎలా వుంటాయో మీరు ఊహించుకోవచ్చు. వంటగదిలో మీరు కొత్తగా ప్రవేశిస్తున్నారా? మీరు వంటలో నిపుణులైనా కాకపోయినా? మీరు వంటప్రక్రియలో, వండిన పదార్థాలను నిల్వ వుంచటంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనాలి. వంట చేసే చిట్కాలు, మెళకువలు ఇంతవరకు మీకు తెలియలేదా? ఆందోళన చెందకండి. మేము మీకు వంటగదిలోని పెనాలు, కూరగాయలు కోయటం వంటి అంశాలపై కొన్ని ఉపయోగకరమైన చిట్కాలు, మెళకువలు అందిస్తున్నాం. పరిశీలించండి.**

- వంటనూనె నిల్వ కంపు కొడుతూంటే, దానిలో ఎనిమిది లేదా పది నల్లటి మిరియాలు వేయండి. అది కొన్ని వారాలవరకు చెడు వాసన రాకుండా వుంటుంది.
- పంచదార డబ్బాకు చీమలు పడుతున్నాయా? చీమలు పట్టకుండా డబ్బాలో 3 లేదా 4 లవంగాలు పడేయండి. ఇక చీమలు అక్కడికిచేరవు.
- పప్పు దినుసులను డబ్బాలలో పోసే ముందు సమయం వుంచండి. ఈ చర్య కేక్ సమంగా కోసేలా చేస్తుంది.
- ఉప్పును వర్షాకాలంలో గడ్డ కట్టకుండా వుంచటానికి గాను కొద్ది బియ్యాన్ని ఒక గుడ్డలో గట్టిగా కట్టి ఉప్పు డబ్బాలో వేయండి.
- పచ్చళ్ళు ఎపుడూ బూజు పడుతూంటాయి. బూజు పట్టకుండా ఒక చిన్న గుడ్డలో ఆవాలు మూట కట్టి దానిని పచ్చడి జాడీలో శుభ్రమైన చెంచాతో పెట్టి వాటిని వేయించండి. ఇలా చేస్తే వాటికి పురుగు, బూజు పట్టకుండా వుంటుంది.
- కొత్తిమీర కట్టలు ఫ్రిజ్‌లో పెట్టేటపుడు ఒక ప్లాస్టిక్ డబ్బాలో పెట్టి అందులో పెట్టండి. త్వరగా వాడకుండా వుంటాయి.
- బాండ్లీలో నూనె పొంగకుండా నూనె వేడి ఎక్కేటపుడే కొంచెం ఉప్పు వేయండి. నూనె పొంగకుండా వుంటుంది. లేదా అతి తక్కువగా పొంగుతుంది.
- పాలు త్వరగా తోడుకోవాలా? పాలలో కొద్దిగా జొన్న పిండి లేదా విటమిన్ సి టాబ్లెట్ వేయండి. గడ్డ పెరుగు తోడుకుంటుంది.
- యాపిల్ కోసిన తర్వాత దానిని ఉప్పు నీటిలో కడగండి. ఇక ఆ ఆపిల్ ముక్కలు ఎప్పటికి తాజాగా వుంటాయి.
- చికెన్ లేదా మటన్ లివర్‌ను పాలలో 15 నుండి 20 నిమిషాలు నానపెట్టి ఉడికించండి. అది మెత్తగా వుండటమే కాక, మంచి రుచిని కూడా ఇస్తుంది.
- ఆహారంలో గరిష్ట విలువ కొరకు కొద్ది చుక్కలు చింతపండు రసాన్ని వేయండి. పాలు అధికంగా మరిగి వాసనా? దానిలో కొద్దిగా ఉప్పు వేయండి. వాసన తగ్గుతుంది.
- గుడ్లు ఉడికించే ముందు అవి పగలకుండా కొద్దిగా ఉప్పు మరియు కొద్ది చుక్కలు వినేగర్ వేయండి.
- కేక్‌ను కోసేటపుడు, కత్తిని చల్లని నీటిలో కొంత వుంచండి. పచ్చడి జాడీనుండి ఎపుడు బయటకు తీసినా, దానిని పొడి గరిటెతో తీయండి, గాలి చొరకుండా మూత గట్టిగా పెట్టండి.
- వెల్లుల్లి వలవకుండా వుండాలంటే, వాటి రెబ్బలు విడదీని వాటిని కొద్ది ఉప్పు, వినేగర్ తో కలిపి ఫ్రిజ్ లో వుంచండి. అవి చాలా రోజులు తాజాగా వుంటాయి.
- మీ ఫ్రిజ్‌లో చేపలు తాజాగా వుండాలంటే, పచ్చి చేపలను లేదా మాంసాన్ని బాగా కడగండి, పూర్తిగా ఎండపెట్టండి. వాటిని ప్లాస్టిక్ బేగ్‌లలో వుంచి రిఫ్రిజిరేటర్‌లో పెట్టండి.
- ప్రతిరోజూ వంట చేసే వారికి ఈ వంటింటి చిట్కాలు ఎంతో సహకరిస్తాయి. ఇవి ఆచరణలో పెడితే, వంట ఎంతో తేలిక. మీకు కనుక మరిన్ని చిట్కాలు తెలిసివున్నట్లయితే, మాకు వ్రాయండి. మీ అనుభవాలు మాతో పంచుకోండి.





## అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే శ్రీలీల సందడి

టాలీవుడ్ హీరో బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న పాపులర్ టాక్ షో అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే. సీజన్ 4లో ప్రతీ ఎపిసోడ్‌కు ఎంటర్‌టైన్ మెంట్ డోస్ పెంచుతూ వెళ్తున్నాడు. ఇప్పటివకే పలువురు సెలబ్రిటీలు సందడి చేయగా.. తాజాగా శ్రీలీల, నవీన్ పొలిశెట్టితో కొత్త ఎపిసోడ్ చేసింది బాలకృష్ణ టీం. ఎపిసోడ్ 6 ప్రోమోను విడుదల చేశారు. మీరు ఎమ్మెల్యే..నేను ఎమ్మెల్యే.. మీరు మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ.. నేను మెంబర్ ఆఫ్ లాస్ట్ బెంచ్ అసోసియేషన్.. అంటూ ఫన్ టైమింగ్ కామెడీతో షురూ అయింది ప్రోమో. రియల్ లైఫ్‌లో చిట్టీ దొరికిందా..? అని నవీన్ పొలిశెట్టి అడిగాడు బాలకృష్ణ. డేట్‌కు వెళ్దామన్నామనుకో ఏ యాక్టర్‌ను తీసుకొని వెళ్తామని అడిగితే.. మనం ఇప్పటికే డేట్‌లో ఉన్నామంటున్నాడు నవీన్ పొలిశెట్టి. బాలయ్యతో శ్రీలీల, నవీన్ పొలిశెట్టి సరదా చిట్‌చాట్, ఆటపాటతో సాగుతున్న సీజన్ 4 ఎపిసోడ్ 6 ప్రోమో నెట్టింట వైరల్ అవుతోంది. ఫుల్ ఎపిసోడ్ డిసెంబర్ 6న విడుదల కానుంది. ఇప్పటికే ఈ షోలో ఏపీ సీఎం నారాచంద్రబాబునాయుడు, మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, కోలీవుడ్ స్టార్ అల్లు అర్జున్ సందడి చేశారని తెలిసిందే.

### రాజమౌళి.. మహేష్‌బాబు

## బిజీ..బిజీ : నమ్రత

హాలీవుడ్ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ 'ముఫాసా- ది లయన్ కింగ్'. 2019లో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం 'ది లయన్ కింగ్' సినిమాకు ఈ చిత్రం ప్రీక్వెల్‌గా వస్తుంది. ఈ సినిమా డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లిష్, హిందీ, తెలుగు, తమిళం భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. అయితే ఈ సినిమాకు తెలుగు వెర్షన్‌లో అగ్ర హీరో మహేశ్‌బాబు వాయిస్ ఓవర్ ఇస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ప్రధాన పాత్ర అయిన 'ముఫాసా'కి బాలీవుడ్‌లో షారుఖ్ ఖాన్ వాయిస్ ఓవర్ ఇవ్వగా.. తెలుగులో మహేశ్ తన గాత్రాన్ని అందించారు. అయితే ఈ మూవీ విడుదల తేదీ



దగ్గరపడటంతో ప్రమోషన్స్‌లో భాగంగా సినిమా పోస్టర్‌ని ఆదివారం హైదరాబాద్‌లో లాంచ్ చేశారు. ఇక ఈ వేడుకకు మహేశ్‌బాబు సతీమణి నమ్రతా శిరోద్కర్ ముఖ్య అతిథిగా హాజరుకాగా.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నమ్రత మాట్లాడుతూ.. మహేశ్ ప్రస్తుతం రాజమౌళి సినిమాతో బిజీగా ఉన్నాడు. అందుకే ఈ వేడుకకు రాలేకపోయాడు. ఇది అనుకోకుండా జరిగింది. ఇది ఫ్యామిలీ ఎమోషనల్ రైడ్. మహేశ్ చాలా ఎంజాయ్ చేస్తూ డబ్బింగ్ చెప్పారు. తప్పకుండా అందరికీ నచ్చుతుందని తెలిపారు. దిగ్గజ దర్శకుడు రాజమౌళి, మహేశ్ బాబు కాంబోలో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. SSMB 29గా వస్తున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే పట్టాలెక్కనుంది.



### భక్తకన్నప్పలో మోహన్‌బాబు

## మనమరాళ్లు ఫస్ట్ లుక్ రిలీజ్

మంచు ఫ్యామిలీ నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి విష్ణుతో పాటు, మోహన్ బాబు, అక్షయ్ కుమార్, శరత్ కుమార్, ముఖేష్ రిషి తదితర ప్రముఖుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా మంచు ఫ్యామిలీ నుంచి మరో ఇద్దరిని పరిచయం చేసింది. ఈ సినిమాలో ఇప్పటికే మంచు విష్ణు కొడుకు నటిస్తుండగా.. తాజాగా మంచు విష్ణు ఇద్దరు కూతుళ్లు అయిన అరియానా, వివియానా కన్నప్ప సినిమాలో నటిస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం అరియానా, వివియానా పుట్టినరోజు సందర్భంగా.. ఈ విషయాన్ని మోహన్ బాబు తెలుపుతూ.. కన్నప్ప సినిమాతో నా మనవరాల్లు అరియానా, వివియానా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నందుకు ఆనందిస్తున్నాను. నటనపై వాళ్లకు ఉన్న అభిరుచి చూసి నాకెంతో గర్వంగా ఉంది. పరిశ్రమలో వారికి గుర్తింపురావాలని ఎంతోమందిలో స్ఫూర్తి నింపాలని కోరుకుంటున్నా అని మోహన్ బాబు రాసుకోచ్చారు.

## ఎప్పుడూ టచ్ చేయని జానర్‌తో వరుణ్‌తేజ్

మెగా హీరో వరుణ్ తేజ్‌కి ఈ మధ్య అసలు కలిసి రావాట్లేదన్న విషయం తెలిసిందే. అప్పుడెప్పుడో ఫిదా, తొలిప్రేమ సినిమాలతో సాలిడ్ హిట్లు అందుకున్న ఈ కుర్ర హీరో కెరీర్ గ్రాఫ్ సడన్‌గా పడిపోయింది. ఆపరేషన్ వాలంటైన్, గాండీవ ధారి అర్జున, గని, సినిమాలతో వరుస డిజాస్టర్‌లను అందుకున్నాడు. ఇప్పుడు మట్కా సినిమాతో తాజాగా మరో డిజాస్టర్‌ను ఖాతాలో వేసుకున్నాడు.

ఈ సినిమా ఎంతటి పరజయం అందుకుంది అంటూ కనీసం పెట్టిన బడ్జెట్ కూడా రాకపోవడం విశేషం. ఇదిలావుంటే వరుణ్ తేజ్ ప్రస్తుతం యాక్షన్ సినిమాలను పక్కనపెట్టి కొత్త జానర్‌లో సినిమా చేయబోతున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా సినిమాలతో సూపర్ హిట్లు అందుకున్న దర్శకుడు మేర్లపాక గాంధీతో వరుణ్ తేజ్ తన తదుపరి ప్రాజెక్ట్‌ను చేయబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ మూవీ హారర్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్నట్లు సమాచారం.. మెగా హీరో వరుణ్ తేజ్ కూడా ఫస్ట్ టైం ఈ జానర్‌లో సినిమా చేయబోతున్నాడు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి నెలలో సెట్స్ మీదకి వెళ్లనున్నట్లు సమాచారం. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌లు సంయుక్తంగా నిర్మించబోతున్నాయి.






## సిల్క్‌స్మిత జీవితం ఆధారంగా..

సినిమా అంటే ఇష్టపడే ప్రతీ ఒక్కరికి పెద్దగా పరిచయం అక్కర్లేని పేరు సిల్క్ స్మిత. 80లలో అగ్రహీరోలతో కలిసి నటించి తన హాట్ హాట్ అందాలతో ఇండస్ట్రీని ఓ ఊపు ఊపింది. కైపెక్కించే కళ్లతో మత్తెక్కించే అందంతో కుర్రకారు గుండెల్ని పిండేసింది. సిల్క్ స్మిత ఉందంటే చాలు ఆ సినిమాకు బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురవాల్సిందే. అయితే సిల్క్ జీవితాన్ని ఆధారంగా చేసుకుని పాన్ ఇండియా స్థాయిలో మరో బయోపిక్ వస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే బాలీవుడ్‌లో ది డర్టీ పిక్చర్ అంటూ సినిమా రాగా బ్లాక్ బస్టర్ అందుకుంది. ఇప్పుడు సౌత్ నుంచి సిల్క్ లైఫ్ స్టోరీపై మరో సినిమా రాబోతుంది. సిల్క్ స్మితా ది క్వీన్ ఆఫ్ ది సౌత్ అంటూ ఈ సినిమా రాబోతుండగా.. చంద్రికా రవి సిల్క్ పాత్రలో నటించబోతుంది. ఈ చిత్రంతో జయరామ్ అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నాడు. కాగా నేడు సిల్క్ స్మిత జయంతి. ఈ సందర్భంగా మూవీ నుంచి గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ చూస్తుంటే.. 80లలో సిల్క్ స్మిత తన నటనతో ఎంత పాపులర్ అయ్యిందో చూడవచ్చు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కూడా స్కిల్ స్మిత గురించి అడిగి తెలుసుకుంది అంటే ఎంత ఇంపాక్ట్ చూపించిందో చెప్పనవసరం లేదు. వచ్చే ఏడాది ఈ సినిమా తెలుగుతో పాటు, తమిళం, మలయాళం, కన్నడ, హిందో భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 8 ఏండ్ల తరువాత ప్రేక్షకుల ముందుకు ఉపేంద్ర

కన్నడ రియల్ స్టార్ ఉపేంద్ర స్వీయ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం. దాదాపు 8 ఏండ్ల గ్యాప్ తర్వాత ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు ఉపేంద్ర. మనోహరన్-శ్రీకాంత్ కేపి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాలో



ఉపేంద్రకు జోడీగా రీష్మా నానయ్య నటిస్తుంది. కాంతర ఫేమ్ అజనీష్ లోకనాథ్ సంగీతం సమకూర్చుతున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా మూవీ నుంచి వార్నర్ పేరిటా టీజర్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ టీజర్ చూస్తుంటే.. అనే ఫిక్షనల్ వరల్డ్‌లో ఈ సినిమా స్టోరీ ఉండనున్నట్లు తెలుస్తుంది. గ్లోబల్ వార్మింగ్, ఏఐ, కరోనా, ఆర్థిక ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, యుద్ధాలతో ముగిసిన అనంతరం 2040లో భూమి ఎలా ఉండబోతుంది.. ప్రజలు ఎలా జీవిస్తున్నారు. భూమిని కాపిటలిస్ట్‌లు లాక్కోని ఎలా నాశనం చేశారు అనేది ఈ సినిమాలో చూపించబోతున్నట్లు తెలుస్తుంది.



### ఆ డైరెక్టర్‌తో చిరంజీవి

## మెగా ప్రాజెక్టు

ఒక్క సినిమా డైరెక్ట్ చేసిన వశిష్టకు, తన సినిమాను డైరెక్ట్ చేసే ఛాన్స్ ఇచ్చేశారు చిరంజీవి. ఆ సినిమానే 'విశ్వంభర'. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇదిలావుంటే.. 'విశ్వంభర' తర్వాత మరో కుర్ర డైరెక్టర్‌తో సినిమా చేయనున్నారట చిరంజీవి. తనెవరో కాదు, 'దసరా'తో నానికి భారీ విజయాన్ని ఇచ్చిన శ్రీకాంత్ ఓదెల. ప్రస్తుతం నానితోనే 'ప్యారడైజ్' అనే సినిమా చేస్తూ బిజీగా ఉన్నారు శ్రీకాంత్. ఈ సినిమా తర్వాత మెగా మూవీకి ఆయన రెడీ అవుతారనేది లేటెస్ట్ న్యూస్. ఇటీవలే చిరంజీవికి ఆయన ఓ కథ వినిపించారని, ఆ కథ చిరంజీవికి కూడా బాగా నచ్చిందని, బౌండ్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేయమని శ్రీకాంత్‌ని చిరంజీవి ఆదేశించారనేది ఫిల్మ్‌వర్గాల్లో బలంగా వినిపిస్తున్న టాక్. చిరంజీవి 'విశ్వంభర', శ్రీకాంత్ ఓదెల 'ప్యారడైజ్'.. ఈ రెండు సినిమాలు పూర్తయ్యాక, ఈ మెగా ప్రాజెక్ట్ ఉంటుందట. ఈ వార్త ఫిల్మ్ వర్గాల్లో పొక్కడంతో కుర్ర డైరెక్టర్లకు అవకాశాలిస్తూ భిన్నమైన ప్రయాణాన్ని చిరంజీవి సాగిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## నేనేం ఐటమ్ గర్ల్‌ను కాదు.. : తమన్నా

రజనీకాంత్ 'జైలర్'లో 'వా.. కావాలయ్యా.. దా.. దా..' అంటూ ఐటమ్ నంబర్లో చెలరేగిపోయింది తమన్నా. ఆ సినిమాలో ఆమె చేసింది చిన్న పాత్రే అయినా.. ఆ పాట, అందులో తమన్నా నాట్యాభినయం కొన్ని నెలలపాటు సోషల్ మీడియాను కుదిపేశాయనే చెప్పాలి. రీసెంట్‌గా 'స్త్రీ 2'లో కూడా ఓ చిన్న పాత్ర చేశారు తమన్నా. అందులో కూడా 'ఆజ్ కీ రాత్..' పాటలో సందడి చేశారు. ఆ సినిమా ఏకంగా 900కోట్ల క్లబ్‌లో చేరింది. దాంతో 'తమన్నా ఐటమ్ సాంగ్ చేస్తే సినిమా హిట్' అనే సెంటిమెంట్ మొదలైంది. మామూలుగానే సినిమావాళ్లకు సెంటిమెంట్లు ఎక్కువ. అందుకే.. దర్శక, నిర్మాతలంతా ఐటమ్ సాంగ్స్ చేయమంటూ తమన్నా ఇంటిముందు క్యూ కడుతున్నారట. దాంతో తమన్నా అసహనం వ్యక్తం చేశారు. రీసెంట్‌గా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'నేను చేసిన పాటలు ఆ సినిమాల సక్సెస్‌లకు హెల్ప్ అవ్వడం ఆనందంగానే ఉంది. అందుకని, వరుసగా ఐటమ్ నంబర్లే చేయమంటే ఎలా? 'జైలర్' రజనీసార్ సినిమా అవ్వడంతో ఇష్టంతో చేశా. 'స్త్రీ2' డైరెక్టర్ అమర్ కౌశిక్ నాకు మంచి ఫ్రెండ్. తను అడగ్గానే కాదనలేక చేశా. అంతేతప్ప అదేపనిగా ఈ తరహా పాటలు చేయడానికి నేనేం ఐటమ్ గర్ల్‌ని కాదు..' అంటూ అసహనం వ్యక్తం చేసింది తమన్నా భాటియా.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com